ఓమ్ (TELUGU)

# కంచెర్ల గోపన్న

అను

# రామదాసు

ఉభయభాషాప్రవీణ-వేదాంతపారీణ

మిన్నికంటి గురునాథశర్మ ప్రణీతము

ఆంధ్రోపాధ్యాయుఁడు-టవున్ హైస్కూలు-గుంటూరు.

**Sole Agents:**

**Venkateswar & Co.,**

**Publishers, GUNTUR.**

**1935**

క్రయము ౧౦ అణాలు

CHECKED June 85

# అంకితము

CHECKED 1992

కాశికాలింగమ్ముఁ గైఁబూని కాల్నడఁ
దోడ్తెచ్చె శివరామ ధూర్వహుండు
తనతండ్రి సప్తసంతానమ్ములను జెడి
పోసీక పోషించె బుచ్చిరాజు
'ఏరుచూ' గ్రామాధికారి యుదారుండు
ధీరుండు నా మీతె వేరరాజు
వ్రాయుంగఁ జదువంగ వాదముల్ దీర్పంగ
ప్రౌఢుఁడయ్యెను శివరామ బుధుఁడు

ఏరి తాత తండ్రియు, తాత, కూరిమి పిత
అన్న, యెనలేని కీరితిఁ గన్నవారొ ?
ఎవరు కోటానఁగోట్లు జపించి రీశు
నట్టి తండ్రి లక్ష్మార్యున కంకితంబు.

# ఒక మాట

ఆంధ్రమహాజనులారా!

చరిత్రములు వ్రాయుట నావంటి కించిజ్ఞులకు నలవిగానిపని. అందును బ్రతివిషయము సంశయ గ్రస్తమగు రామదాసు చరిత్రమును వ్రాయుట మిక్కిలి కష్టతరము.

శ్రీరాముఁడు వరాలు చెల్లించి పోవుట యను విషయ మసత్యమని త్రోసివేయుట కొకవేళ శ్రమముండ దేమోకాని, రామదాసు-గోపన్న భిన్నులా? రామదా సేశాఖీయుఁడు? ఆతని గురువు కబీరా? మాదన్నకు రామదాసునకుఁ జుట్టఱికము గలదా? రామదాసు కారాగార విముక్తుఁడయ్యెనా? మున్నగు సంశయములఁ దేల్చుటకు మాత్రము శ్రమంపడక తీఱదు. ఆపని యలఁతులచే నగునది కాదని యెఱింగియు మఱొకనికైనఁ జోదనగా నుండునని తలంచి వ్రాసితిని.

ఇందలి సిద్ధాంతములు కొందఱకుఁ గష్టము కలిగింపక పోవు. కాని చరిత్రములలో నసత్యము లుండరాదను మతముం బురస్కరించి కొని వ్రాయఁబడి యుండునని వారే నిగ్రహింపక పోరు.

ఈవిషయమై యొకవ్యాసము భారతిలోఁ బ్రజోత్పత్తి వత్సరాశ్వయుజ మాసమునఁ (8 సం 10) బ్రకటించితిని. ఇప్పుడు గ్రంథ రూపమున నర్పించుచున్నాఁడను.

లోపములున్నఁ దెలుపఁ గై మోడ్చెదను.

యువవత్సరాశ్వయుజ
కృష్ణత్రయోదశి
గుంటూరు.

విధేయుఁడు,
గురునాథశర్మ.

# కొద్ది సవరణ

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| ౧౦ | ౧౪ | వ్యక్తులుగారనియు | వ్యక్తులనియు |
| ౧౮ | ౮ | శకటచోరకుఁడు | శకటచోదకుఁడు |
| ౨౪ | ౨ | బుచ్చి | బుబ్బి |
| ౩౧ | ౧౫ | విమానములు | వాహనములు |
| ౪౬ | ౧౭ | నదృష్టమైనాకలదు | నదృష్టమైనంగలదు |
| ౫౭ | ౮ | సవరం బెఱింగి | స్వరం బెఱింగి |
| ౮౪ | ౧౧ | చేయుంపుమా | చేయించునుజుమా |
| ౧౧౫ | ౨౩ | భోగ్యైక | భోగైక |
| ౧౨౨ | ౮ | వచ్చుచునుఁటినని | వచ్చుచున్నదాన |
| ౧౨౬ | ౨౦ | దూరములక్ష్మి | దూములక్ష్మి |

ఓమ్

శ్రీరాఘవస్వామినే నమః

# రామదాసు

## మొదటి ప్రకరణము

శ్లో॥ శ్రీరామం త్రిజగద్గురుం సురవరం సీతామనోనాయకం
శ్యామాంగం శశికోటిపూర్ణవదనం చంచత్కలాకౌస్తుభం
సౌమ్యం సత్యగుణోత్తమం సుసరయూతీరేవసంతం ప్రభుం
త్రాతారం సకలార్థసిద్ధిసహితం వందే రఘూణాం పతిం.

శ్రీరామ కర్ణామృతము

జరాయుజాండజస్వేదజోద్భిజ్జము లగుచతుర్విధ భూతగ్రామములు దివారాత్రము లుపార్జనాపరత్వమున మునిఁగి తేలుచు నుపాత్తవస్తువుల నుపయోగించి పరిత్యజించుచున్నవి. ఒక్క వస్తువుగూడ నవిచ్ఛిన్నానందము నిచ్చుచుంటలేదు. శాశ్వతానందోపలబ్ధికి వెదకుచుంటఁ గాఁబోలుఁ బరిపరివిధములఁ బర్వెత్తుట? అది సహజము జీవకోటికి. ఆబ్రహ్మకీట మున్నత స్థితికిఁ బోవుటకే నిత్యవ్యాపారమున నిమగ్నమగుట. కావున సృష్టికిఁ బరిణామమే లేకుండెడివి. అజ్ఞానాంధకారమున మునిఁగి యైహికసుఖానుప్రాప్తి నానంద మనుభవించుచుఁ దత్ప్రత్యువాయవ్యాఘాతములచేఁ గశాఘాతంబులఁ దురంగంబుంబోలె నొడలెఱింగి క్రమముగాఁ బ్రపంచమున విఘ్నమనునది యేల యుండవలయునని విచికిత్సించుచున్నాఁడు మానవుఁడు. ఈ

విచికిత్సయే ద్వితీయ సోపానము. ఈ మెట్టుపై నెక్కి పాఱఁజూచుచున్నాఁడు. దరి త్రోవ లభింపలేదు. ఘుంఘుమారుతమున సముద్రగర్భమునందలి కలంబుంబోలె సర్వతోముఖములం గొట్టుకొనుచు నెవఁడో యొకండు కర్ణధారుం డున్నాఁడని యాస్తికుండగుచున్నాఁడు. కాదామఱి—

ఉ. తా నొనరించు కార్యము సదా సఫలంబగుచున్నదో భవి
ష్యేన సము[illegible] [illegible] సదిత్వ్యము [illegible] యసత్యముం దనుం
గాని [illegible] [illegible] పట్టిచో నదె కర్త యీశ్వరా
[illegible] సర్వమున్ భ్రమాతిశయ [illegible] [illegible] బాపురే!

—నేను రచించిన ఆధిపత్యము

ఇది తృతీయసోపానము. దీని నధిరోహించి గంతవ్యస్థానము నన్వేషించుచున్నాఁడు. ఒక మార్గమునఁ గూర్చములు, నాజ్యస్థాలులు, హోమకుండలములు, తిరుమణితిరుచూర్ణములు విభూతి రుద్రాక్షములు కన్పించినవి.

" న కర్మణామనారంభా న్నైష్కర్మ్యం పురుషోశ్నుతే "

పురుషుఁడు యజ్ఞాదికర్మములఁ జేయమిచేఁ గ్రియారహిత నిశ్చయమును బొందఁడు—అనియు—

" నియతం కురుకర్మత్వం "

నిత్యము నీవు కర్మమును జేయుము—అనియు—

" ఏవం జ్ఞాత్వా కృతంకర్మ పూర్వైరపి ముముక్షుభిః. "

ఈ ప్రకారము నెఱింగి మోక్షాపేక్షగలపూర్వులు కర్మము నాచరించిరి—అనియుఁ గొన్నిమంత్రము లస్పష్టముగాను స్పష్టముగాను విన్పించినవి. ఆమార్గమునఁ గొంతదూరము పోయినాఁడు.

" న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః. "

ఎవ్వఁడు క్షణమైనను గర్మమును జేయకయుండఁజాలఁడు. ప్రకృతివలనఁగల్గిన త్రిగుణములు నతనిచేతఁ గర్మమును జేయింపక విడువవు—అని యెఱింగి మఱొకదెస నిరీక్షించినాఁడు.

జటాజినధారులై నిమీలితనేత్రులై నిశ్చలులై యాత్మానాత్మవివేకము గలిగి నిస్సంగులై స్వాత్మావలోకనము సేయు బ్రహ్మజ్ఞానులం గనినాఁడు.

" సర్వం కర్మాఖిలం పార్థ! జ్ఞానే పరిసమాప్యతే. "

ఎల్లకర్మములు బ్రహ్మజ్ఞానమునందు లయించుచున్నవి-అనియు మఱియు నేవేవో విన్నాఁడు. ఆ మానవున కర్థముగాలేదు. అది దుస్తరమైనమార్గమని భయపడినాఁడు. ఆ యున్నతమార్గమున నిరపాయముగాఁ బయనము సేయలే నని తలంచునంతలో హరినామకీర్తనల యఱపులు తాళములచప్పిళ్లు గజ్జల మ్రోఁతలు నృత్యముల ధిమిధిమిధ్వానములు విన్పించినవి. ఆ త్రోవను దిలకించినాఁడు.

హరిభజనలు జరుగుచున్నవి. "చేతులఁ దాళముపట్టుక, చేతో మోదంబుతోడ సిగముడి వీడఁ। బాతరలాడుచు" గీతమును భక్తుఁడు పాడుచున్నాఁడు. బాలవృద్ధానుచరు లతని ననుసరించి పాడుచున్నారు. ఈత్రోవ నిరపాయమైనదియు సర్వజన సులభమైనదియు నుత్తమమైనదియు నని మానవుఁడు తలంచినాఁడు. వెంటనే యమ్మార్గము నధిగమించినాఁడు. కనుక నే "మోక్ష

సాధన సామగ్ర్యాం భక్తిరేవగరీయసీ" మోక్షమును సాధించు సాధనములలో భక్తియే యత్యుత్తమమైనదని పెద్దలన్నారు.

" యోగినామపి సర్వేషాం, మద్గతే నాంతరాత్మనా
శ్రద్ధావాన్ భజతేయోమాం సమేయుక్తతమోమతః."

ఈ శ్లోకమునకు మధ్వాచార్యులవారు వ్యాఖ్యానముచేయుచు, "తపస్సులకంటె యజ్ఞాది కర్మములకంటె ధ్యానయోగము విశేషించు చున్నదనియు నందును శివాదిధ్యానముకంటె విష్ణుధ్యానము శ్రేష్ఠమనియు, ధ్యానముకంటె జ్ఞానము, కేవల జ్ఞానముకంటె ధ్యానముతోఁగూడిన జ్ఞానము, శ్రేష్ఠమనియు నుడివిరి. మఱియు ధ్యానముకంటె దర్శనము, దర్శనముకంటె భక్తి, భక్తికంటె సాధనము లేనేలే"దనిరి. అట్టి పరమోత్తమమైన భక్తిమార్గమునఁ గృతార్థుఁడైనవాఁడు మన కంచెర్ల గోపన్న. మహాజనులారా! పరమ భాగవతోత్తముఁడైన గోపన్న చరిత్రము చదివి మీరును భక్తిమార్గము నవలంబించి ధన్యులగుఁడు.

నేలకొండపల్లి పురాతనమైన పట్టణము. పశ్చిమచాళుక్య త్రిభువనమల్లిదేవునిపక్షమున గోవిందరాజు నేలకొండపల్లి రాజధానిగా రాజ్యము పరిపాలించు (1123 సం) పండ్రెండవ శతాబ్ది ప్రారంభమునను, గోవిందరాజుల యనంతరము వచ్చిన యుదయరాజుల కాలమునను, నాపురి వైభవము వర్ణనాతీతముగా నుండెడిది. శాసనములలోఁ గొండపల్లియనియే కలదు. అట్టి మహోన్నతస్థితినందిన కొండపల్లి క్రమముగా క్షీణించి యగస్త్యభ్రాతయనినట్లు కంభముమెట్టు చెంతనున్న కొండపల్లి యనఁబడవలసిన స్థితికి వచ్చెను. ఆపట్టణమిపుడు రాజధానికాదు గావ

నట్టి స్థితికివచ్చెను. ఇది 16వ శతాబ్ద్యంతమునాటిమాట. అయినను నందు ధనవంతులు పెక్కురుగలరు. వర్తకము విరివిగా సాగుచున్నది. కర్షకుల కనువైన క్షేత్రములు గలవు. కష్టపడి పనిచేయువారికిఁ గూలి దొరకుచుండెను. అందెవేసిన గొప్ప కోడెలు పందెపుగుఱ్ఱములు నందుఁ గలవు. క్షత్రియులు లేరు గాని మిగిలిన వర్ణములవారందుఁ గలరు. స్నానసంధ్యాదు లాచరించు కర్మిష్ఠులైన బ్రాహ్మణులు స్వకులోచితవృత్తి నవలంబించిన వైశ్యులు శూద్రులు నందున్నారు. బ్రాహ్మణులలో యాజ్ఞవల్క్యులు కంచెర్లవారు కూటికి గుడ్డకు తరుగులేకుండ కాఁపురము చేయుచుండిరి. అందు లింగనమంత్రి పండితుఁడు. పౌరాణికుఁడు. వక్త. ఒరులఁ దిరియవలసిన పనిలేని జీవనముగలవాఁడు. పౌరుల కాయనచెంతఁ దమ పిల్లలకు విద్యగఱపించినచో వా రెక్కువత్తురని కుతూహలము గాన లింగనమంత్రికిఁ బాఠశాల యొకటి యేర్పడెను.

అట్లు కంభముమెట్టు తాలూకాలోని నేలకొండపల్లియం దొజ్జయై సుఖముగాఁ గాలముగడుపుచు మడిమాన్యముల సంపాదించిన లింగనమంత్రియు గృహిణియగు కామమ్మయుఁ జిరకాలము వఱకు బిడ్డలులేక యెన్నియో వ్రతములాచరించిరి. కామమ్మ తులసికిఁ బ్రదక్షిణములు చేసినది. పుట్టలకు పాలుపోసినది. ఎన్నియో నియమములఁ బాటించినది. తండ్రియు మంచిభక్తుఁడు. సుందరకాండ మతనికిఁ బ్రాణము. రాముఁ డతనికాత్మ. కతిపయ దివసములకు సంతానగోపాల మంత్రప్రభావమువలనఁ గామమ్మ గర్భము ధరించినది. నెలలు నిండినపిదప నొక శుభముహూర్త

మునఁ గామమ్మ ప్రసవించినది. మగబిడ్డ కలిగెను. కామమ్మ యిష్టప్రకారము గోపయ్యఅని పేరుపెట్టిరి.

గోలకొండ నవాబగు తానీషా లేక అబూహసన్ కుతుబ్ షాహా క్రీస్తుశకము 1658 మొదలు 1687 వఱకు రాజ్యమేలెనని కీర్తి శేషులగు కే. వి. లక్ష్మణరావు పంతులుగారు వ్రాసిరి. మన గోపన్నగారీకాలమువాఁడనుట నిర్వివాదము.

అరయునరయు, 1686 సం॥ అక్టోబరు మాసమున ఔరంగజేబుతోఁ దానీషా తలపడి యేడెనిమిది మాసములు యుద్ధము చేయుట సంభవించెను. ఆ వత్సరముననే వంచనమొయిఁ దానీషాకుఁ దెలియకుండ నాతనిసుబ్రాంతకాంతాజన మక్కన్న మాదన్నగారలఁ జంపించెను. ఆదినముననే బ్రాహ్మణు లనేకులు గోలకొండలోఁ జంపఁబడిరి. రామదాసుగూడ నపుడే చంపఁబడి యుండును. కాన నప్పటి కతఁడు 12 యేండ్లు కారాగారమున నుంటచేఁ జెయిలో 1674 వ వత్సరమునఁ జేరి యుండును. తహశీల్ దారుగా కనీసము రెండు వత్సరము లున్నను నా పదవికి వచ్చుటకు 22 ఏండ్లైన నుండవలయును గాన 1650 ఈతని జన్మవత్సరమై యుండును.

మఱియు గోపన్న మామగారు మాదన్నగారు 1682వ సంవత్సరమున నత్యంత ప్రాభవోపేతుడై యుండెను. ఆవత్సరమే యిబ్రహీముకున్న షామాలష్కర్ అధికారమును (సర్వసేనానాయకత్వమును) తొలఁగించి యక్కన్నగారి కిప్పించెను. ఆ వత్సరమే మాదన్నగారు తన కుమారుఁడగు మల్లన్న కత్యంత

వైభవమున వివాహము చేయ కుంఫినీవారు నీసెడు బంగారపు గొలుసులు కాన్కగఁ బంపించిరి. మఱియు నుగాది కానుకలని పేరుపెట్టి 400 వరహాలు మాదన్నగారి కంపి వారి యనుగ్రహము కంపెనీవా రభ్యర్థించిరి. ఈ వత్సరముననే పోడేల లింగప్పను కృష్ణానదీ దక్షిణ ప్రాంతమునకు సుబేదారును (గవర్నరు) గాఁ జేసినది. కనుక నింత యున్నతస్థితిలో నున్న మాదన్నగారు మేనల్లు నా వత్సరమే చెఱ విడిపించియుండ నోపునని యొకవేళ తలంతమనుకొందుము. అప్పయునఁ జెఱయున్నది 12 ఏండ్లు. తహశీల్దారుగానున్నది కనిసము 2 ఏండ్లనియేని తలంపవచ్చుంగదా? అటని యిరువది యేట తహశీల్దారు పదవి వచ్చునని చూచినను 1682 లో 34 పోగా 1648 లో గోపన్న జనించెనని తేలును. అనఁగా నీ కాలమును మించి జననము కాదని నా భావము. మఱియు భద్రాచలములోఁ గోవెలకు పశ్చిమదిశ నిలువురాళ్లమీఁద —

"స్వస్తిశ్రీ)......శాలివాహనశక వర్షంబులు ౧౫౭౪ (క్రీస్తు 1652 అగును) అగు నేటి......నందననామ సంవత్సర చైత్ర శు ౯ లు భానువారం......శ్రీరామదాసుగారు శ్రీతానీషా గారి యనుమతి వెంబడిని......వ్రాసియున్న శాసనం" అని కలదు. తానీషా 1658 మొదలు రాజ్యము పాలించెనని కీర్తిశేషులైన కే. వి. లక్ష్మణరావుగారు బహు గ్రంథములఁ బరిశోధించి వ్రాసిరిగదా? శాసనము తానీషా యనుమతి వెంబడి 1652 లోనే యెట్లు పుట్టినదో మనము దేనిని నమ్మవలయునో తెలియకున్నది. శాసనమును రామదాసు వ్రాయించినదే

సత్యమైనను, లేక లక్ష్మణరావుగారి వ్రాఁతయే సత్యమైనను 17 వ శతాబ్ద పూర్వభాగమునుండియు గోపన్న యుండెనని తలంచుటకుమాత్ర మెట్టి సంశయమును లేదు.

గోపన్న ప్రతిపచ్చంద్రుని విధంబున దినదిన ప్రవర్ధమానుండగుచుఁ బంచవర్ష ప్రాయంబునఁ దన జనకుండు వాల్మీకి రామాయణము పురాణము చెప్పుచుండ నాలించుచు నొక్కొకప్పుడు రామరామ యని గంతులు వైచుచు నొక్కొక్కప్పుడు చేతులు ముందు పెట్టుకొని బాసికపట్టు పెట్టుకొని కూర్చుండి నిశ్చలుండై వినుచు, నొక్కొక్కప్పుడు తండ్రి తొడపైఁ గూర్చుండి "నాన్నా! ఇష్ణుమూర్తి బూలోకంలో పుట్టకపోతే ఆయన లోకంలోనే వుండి మనన్ని గావరాదూ? అనియు "అప్పా! సందరంలో కొండల్ తేల్తవా? రాముల వారి మయిమా?" అనియు, "నానా! రాములవారు శబరి యెంగిల్ తిన్నాడేఁ" అనియు, "తన యిరోది తమ్ముణ్ణి రచ్చించాడేఁ" అనియు నిట్లెన్నేని గతుల వాగుచుండును. పువ్వు పుట్టుటతోడనే పరిమళించునుగదా? పూర్వము ప్రహ్లాదుఁడు నిట్లు హరిని భజింపఁ బురోహితుండు—

"పంచశరద్వయస్కుఁడవు బాలుఁడ వించుకగాఁ లేవు,
భాషించెదు తర్కవాక్యములు."

అని పల్కెను. బాలుఁడైన గోపన్న పల్కులకుఁ దండ్రి యుబ్బురపడిపోయెను. తన నిరంతర రామాయణపఠనజనితభాగ్యవిశేషము పండినదని యుబ్బిపోయెను.

తండ్రి పంచాంగశుద్ధి నరసి యొకనాఁడు "ఓం-న-మః-శి-వా-యః" అని చెప్పి యక్షరారంభముచేసెను. తండ్రికంటె గురువెవరు ?

నేటికాలపు బడిపంతుళ్లు తామేమో చక్కఁగా విమర్శించి తెలివిగలవారమైతిమనియుఁ, బూర్వులు తెలియనిదానిని మేము దెలిసికొంటిమనియు నుడువుచు 'ఓ' ఆదులలో రాలేదా ? 'న-మ' వర్ణములు తవర్గపవర్గములలో నుండలేదా? 'శి-వా-య' యూరాలలో వచ్చునుగదా? ప్రత్యేకముగా ముం దెక్కడెక్కడి యక్షరములనో తీసి, "ఓ-న-మః-శి-వా-యః" అని దిద్దఁబెట్టుటేల? పూర్వులకు వివేచనశక్తియెక్కడిది? అని యెక్కడపసర్గముంచవలయునో కూడఁ దెలియని తాము నోరు పాఱవైతురు. జడులకుఁ బంచాక్షరమహిమ మెఱుఁగ వశమే ? పోనిండు.

గోపన్నకుఁ ద్వరలోనే యొత్తులు, గుణితము వచ్చెను. తండ్రి తన పక్కలోఁ బండుకొనఁ బెట్టుకొనియే బాలరామాయణమంతయు గోపన్నచే వల్లింపఁజేసె. మధురమైనట్టియుఁ బరిస్ఫుటమైనట్టియు, స్వచ్ఛమైనట్టియు, మార్దవమైనట్టియు, గోపన్న వాక్కునుజూచి తండ్రి యెన్నోరోజులు మురిసికొనలేదు. పిల్లవాఁడు తనపేరు నిల్పఁగలవాఁడగుననియు, మహా యశస్సంపన్నుఁడగుననియు, భక్తుఁడగుననియుఁ దనకేగాక, తనవంశమునకంతయుఁ బేరుదెచ్చువాఁడగుననియు నెన్నినాళ్లో తలఁపలేదు. భగవంతుఁ డోర్వఁడాయెను.

ఒకనాఁడు లింగనమంత్రి కాళ్ళుతీపులుగానున్నవని గోపన్న చేఁ పిక్కలు గ్రుద్దించుకొనుచు నాకస్మికముగా ననాయాసముగా రామరామయనుచు స్థూలశరీరమును విడిచె. పాపము! పిల్లవాఁడబ్బలేనిబిడ్డయైనాఁడు. కామమ్మ దుఃఖసముద్రములోఁ మునిఁగినది. పలువిధములఁ బనవిపనవి యేడ్చినది. "ఆ యొక్కబిడ్డకింత జలంబైన పుచ్చఁబోఁగు వేసికొనునదృష్టము లేకపోయె. ఇఁక నాకెవరుదిక్కు? ఈసముద్రము నెట్లీఁదుదును." అని వాపోవుచుండ నిరుగుపొరుగువారువచ్చి యూఱడించి, యనంతర కర్మకలాపములు చేయించిరి. క్రమముగా దుఃఖమునువదలి కామమ్మ గారాబముతోఁ గుమారుని బెంచుకొనుచున్నది.

గోపన్న యేశాఖవాఁడో విచారింతము:—

తమ శతకకర్తల చరిత్రములోఁ గీ॥ శే॥ వంగూరి సుబ్బారావుగారు రామదాసార్వేల నియోగియనియు గోపన్న—రామదాసు భిన్న వ్యక్తులుగారనియు వ్రాసిరి. ఈ పక్షము వారికి—

"అల్లన లింగమంత్రిసుతుఁ డత్రిజగోత్రుఁ డాదిశాఖ కం
చెర్లకులోద్భవుండను" [దాశరథి]

అనుపద్యము బాధింపఁగా నాదిశాఖకిట్లుత్తరమియ్యఁగడంగిరి.

1. 'ఆదిశాఖ' యనఁగా—బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రులలో బ్రాహ్మణుఁడ ననుటకట్లననేమోయని-ఇది నిస్సారమైన కారణము.

2. ఆదివేదమగు ఋగ్వేదమునకుఁ జెందినవాఁడ నని చెప్పుకొనుట కట్లనెనేమోయని--ఆదిశాఖులది యజుర్వేదము. అందును శుక్లయజుస్సు. ఋగ్వేదముకాదు.

**3.** కంచెర్ల వారిలో **జ్యేష్ఠ** శాఖకుఁ జెందితినను కట్లనేమో యని — జ్యేష్ఠశాఖయన వంశవృక్షమునందు మొదటిశాఖ యనియా? కాక మఱొకటియా? వంశవృక్షమునందు కాదనుకొని మఱొకదానిం బరికింతము.

యాజ్ఞవల్క్యులు, కాణ్వులు, శుక్లయజుస్సులు, ప్రథమశాఖులు, ఇవి సమానార్థకములు. వీరిలో ననఁగా నాదిశాఖలో 5 ఉపశాఖలు గలవు. 1. ఆర్వేలు, 2. కాకులపాములు, 3. ద్రావిడులు [దాక్షిణాత్యులు] 4. మువ్వాలు, 5. అనుమకొండలు.

“ ఆత్రేయసగోత్రజు[illegible]చె [illegible]ల వంశమున [illegible] రామ. ప.

అని యుంటచే రామదాసార్వేలశాఖకుఁ జెందెననవలయునందురా? ఆర్వేలశాఖయు శుక్లయజుశ్శాఖాంతర్గతమే. కాని గోపన్నది అనుమకొండశాఖగాని, ఆర్వేలశాఖకాదు. కంచెర్లవారందఱు ననుమకొండవారే. ఇదివఱకు తెలుగాని ఇప్పుడిప్పుడీయుపశాఖలలో నన్యోన్య వివాహము లేర్పడుచున్నవి.

అయ్యా! శుక్లయజుస్సు—కృష్ణయజుస్సు—అను యజుర్వేదము రెండుశాఖలు గలదగుటచే నాదాదిశాఖ తనదనుట కట్లనెనని తలంచిన సరసముగా నుండును.

4. ‘ఆదిశాఖ’ శబ్దము కులపరముగాఁ గవి వాడినయెడల నది ‘శాఖ’యనికాని ‘శాఖీయుఁడ’నని కాని వ్రాయవలసియుండెను. అది నిజమే. కాని గోపన్న గొప్పవైయాకరణి కాఁడు. సంస్కృతాంధ్రముల నింత ప్రవేశము గలవాఁడుమాత్రమే. అతఁడు భక్తశిఖామణిగావున భక్త్యుద్రేకముచే నతనిభావములు ఛందో

రూపముగా వెల్వడినవనియే మనము గ్రహింపవలయును. లేనిచో నాది శాఖగల కంచెర్లకులమునం దుద్భవించినవాఁడని బహువ్రీహిం జేసికొనరాదా ? నిజమునకు "వాఁడు ప్రథమ శాఖ"అని లోకమున వాడుకగలదుగదా? ఆవాడుకంబట్టి యట్లు రచించియుండును. ఆదిశాఖగాక "అగ్రశాఖ"యనియుఁ గలదు. తెనాలి రామకృష్ణుఁడు "అగ్రశాఖ కోకిలమవునీవు" అని పాండురంగమాహాత్మ్యమున వాడెను.

మఱొకపంక్తి:—కంచెర్ల శరభనకవి తన యధ్యాత్మ రామాయణములోఁ దాను శైవగురు శిష్యుఁడననియు, నాపస్తంబ సూత్రుఁడననియు 'మంత్రి' కులమువాఁడననియు వివరించుచుఁ దనశాఖవారు—

తే. కొండపల్లిని గొండలుఁ గొల్లపూఁడిఁ
గొండ ఖుండిరి తంజాపురందుఁ గొంద
రెలమి వసియించి ప్రబలిరి చెలువు మిగుల
మీటి కంచెర్ల వంశంబువారు ధరణి.

అని 'ఓరియంటల్ లైబ్రరీ వ్రాఁతప్రతిలోఁగలదని కీర్తిశేషులైన వంగూరి సుబ్బారావుగారు వ్రాసి యిందలి 'మంత్రి' పద మార్వేల నియోగిం దెల్పుచున్నదనియు కంచెర్లవారు కొండపల్లిలో నియోగులు గలరని దీనివలనఁ దేలుచున్నదనియు వివరించి కంచెర్ల రామదాసార్వేల నియోగియని పల్కిరి.

మంత్రిపదమే యార్వేల నియోగిందెల్పదు. "అల్లన లింగ మంత్రి సుతుఁ"డని యాది శాఖీయుఁడే వాడెంగదా? నందవరపుర వంశోత్తంసుఁ డగునల్లసాని పెద్దనామాత్యుఁడును దన

తండ్రికిఁ "జొక్కయామాత్య" యని యమాత్యశబ్దమును వాడి యుండెను. గోలకొండ వేపారులును మంత్ర్యమాత్యపదముల వాడుకొనెదరు. యాజ్ఞవల్క్యలలోను వృత్తినిబట్టి నియోగులు వైదికులు గలరు. అనుమకొండ లచ్చముగా లౌక్యులే. గోపన్న లౌకికుఁడగుటచే "నల్లన లింగమంత్రిసుతుఁ"డని మంత్రి పదము వాడెను.

కంచెర్ల యింటిపేరిటివారు నాత్రేయ గోత్రులు నార్వేల నియోగులు బాదరు దగ్గఱనున్న కృష్ణాపురమునఁ గలరు. నేను వారితో మాట్లాడితినిగూడ. కనుకఁ గంచెర్ల శరభనకవి యార్వేల నియోగియైన నగుఁగాక- 'యాదిశాఖ' వాఁడనని స్పష్టముగా గోపన్న చెప్పికొనుటచే నితఁడుమాత్రము తప్పక కాణ్వుఁడే. కంచెర్ల యింటిపేరిటివారు నాత్రేయ గోత్రులు, నాదిశాఖీయులు వినుకొండ పిచ్చికలపాలెము ఏనుఁగుపాలెము కంచెర్ల (గుంటూరు మండలము) మున్నగు గ్రామముల నేటికిని గలరు. వారితోడను నేను మాట్లాడియుంటిని. ఆర్వేలవారిలోను నాది శాఖులలోను గంచెర్లవా రుంటచే నిట్టి చిక్కు వచ్చుచున్నది.

కం. భూసురవరుఁడు నియోగియు
భాసుర కంచెర్లకులజ భవ్యయశుండున్

రామదాసు

అని వరదరామదాసు వ్రాయఁగా నార్వేల నియోగియని భ్రాంతిపడిరి కొందఱు. అట్లుకాదు. ఆదిశాఖులలోను నియోగు లుండిరంటిమిగదా? నియోగులువేఱు. ఆర్వేల నియోగులు వేఱు.

సీ. "ఇల యాజ్ఞవల్క్యవం శేందుండ కాత్యాయ
నీసూత్ర జాతధరాసురుండ
రహి హన్మకొండ భారద్వాజ గోత్రుం
డాదిశాఖా నియోగ్యన్వయుండ"

యాజ్ఞవల్క్య చరిత్ర

అని వంగిపురపు వీరభద్రాచలపతి కవులు వ్రాసికొనిరి.

అయ్యా! కొందఱు రామదాసు చరిత్రమందలి 'నియోగి' పదముంజూచి రామదాసార్వేలనియోగియై యుండెనని తలంచి, దాశరథిశతకము బాధింప గోపన్న వేఱు రామదాసు వేఱని వాదించి, యదియు నిలువమిచే గోపన్నను గూడ నార్వేల నియోగిం జేయ నుంకించిరి. గోపన్న రామదాసులు భిన్నవ్యక్తులనుటకుఁ బ్రబలాధారములు లభించునంతకు వారిరువురుగారు. ఒక్కరేయనియు, నాతఁడు ప్రథమశాఖ నియోగి బ్రాహ్మణుండనియు, విశ్వసింతముగాక!

కొండవీటి దండెకవిలెయందును వినుకొండ తాలూకాలోని పెరుమాళ్ళపల్లె- ఉప్పలపాడు- చినతెల్లపాడు గ్రామములకుఁ గంచెర్లవారాత్రేయస గోత్రులు ప్రథమశాఖీయులు కరణములుగా నున్నట్లు వ్రాయఁబడియున్నది.

# రెండవ ప్రకరణము

లోకములో విద్యాశూన్యుఁ డైనను ధనము గలవాఁడేని పూజింపఁబడును. దరిద్రుఁడైనను నయాచకుండగు నేని యంత తిరస్కరింపఁబడఁడు. ఎవరికేని మన్నన పరులను దేహి యను కున్నంతవఱకే. ఇంద్రుఁడైనను జెయిచాచెనా వాఁడు నల్వురకుఁ బరిహాసపాత్రుఁ డగును. మిత్రుఁడేని యాచనాభారంబున గష్టుఁడగును.

లింగనమంత్రి నల్వురకుఁ బూజ్యుఁడు. అక్కటతన నాయనకు ధనము సులభముగా లభింపసాగెను. లేని యెవ్వరి నడుగఁడు. ఒరులిచ్చిన వలదని నిరసింపఁడు. ఇఁకఁ బూజ్యత వి త్తము చేకూరుటలో వింత యేమున్నది? తండ్రి యనంతరము గోప న్నకు నిదే మంత్రము. "పుత్రాదిచ్ఛే త్పరాజయమ్" అన్నట్లు లింగనమంత్రి గుణము లన్నియుఁ గొడుకున కబ్బినవి కాని తండ్రికి లేని గుణ మొండు రెండును గోపన్న కలవని తండ్రికంటెఁ గొడుకే పైచేయి యనిపించుకొనసాగెను. ఆ రెండు గుణ ములు మీకుఁ గావలయునా? భక్తి-కవిత్వము. తండ్రికి బొత్తిగా భక్తి లేదనముగాని కొడుకున్నంత లేదనయే. కవి త్వము తండ్రి కసలే లేదు.

లింగనమంత్రి కీర్తిశేషుఁడైన పిదప గోపన్న చిన్నవాఁడు గాన కామమ్మ కాపురము పొదుపుగాఁ జేయుచుండెను. లింగన మంత్రి కొంతయాస్తి సంపాదించి యుండెను గానఁ దల్లికిఁ బిల్ల వానికి నన్నవస్త్రములకు లోపము లేకుండెను.

గోపన్న విద్యాభ్యాసము నేమరక చేయుచుండెను. రఘునాథ భట్టరాచార్యులయొద్ద నామలింగానుశాసనము కాళిదాసత్రయము నాంధ్రపంచకావ్యములు పూర్తిచేసెను. రాజవిద్యయని యురుసుగూడ నేర్చుకొని యుత్తమకక్ష్యలఁ గృతార్థుఁడయ్యెను. ఆచార్యులవారు గోపన్న బుద్ధికుశలత కచ్చెరువు పడినాఁడు. అతని రామభక్తికి, వాల్మీకి రామాయణ పఠనాసక్తికి, సంతసించినాఁడు. వీఁడు యశస్వి యగునని తలయూపినాఁడు. రామస్తుతి పరమైన చిటిపొటి పద్దెముల నల్లుకొని రాఁగఁ బరికించి సవరించి దీవించినాఁడు.

"మౌంజీబంధశ్శస్యతే బ్రాహ్మణానాం" అని యష్ప్వరబ్రాహ్మణులు యోచించి "యజుర్వేదాధిపస్సితః" అనియు నెఱింగి కవిబలము గల శుభలగ్నమున నుపనయనాదికములచే గోపన్నకు ద్విజత్వము నిచ్చినారు. తన భర్త పిల్లవాని వడుగును జూచుకొనుటకే ప్రాప్తి లేకపోయె ననెడితలంపుచేత నయ్యుపనయనమునాఁడు కామమ్మ యొక్క-యేడుపేడ్చి బందుగు లశుభముగా వగవరాదన నోరు మూసికొని గ్రుడ్లనీరు గ్రుడ్లఁ గ్రుక్కు-కొన్నది. పండుగ పబ్బములనాఁడు ప్రియజనులు స్మృతికిరారా ?

గోపన్న యుపనయనము మొదలుకొని సకాలమునకు గాయత్రి నుపాసించుచుఁ గాలము గడపుచున్నను రామనామ మేమరకుండెను. రాముఁ డతనికిఁ బరమ దైవముగాఁ గన్పించుచున్నాడు. రామనామామృత మతని జిహ్వకుఁ బరమామృతముగా నున్నది.

... ... ... సానుజనావనవ్రతో
ద్దాముఁడు రాముఁడే పరమదైవము మాకని మీ యడుంగుఁగెం
దామరలే భజించెదను దాశరథీ! కరుణాపయోనిధీ!

అని పాడినాఁడు.

గోపన్న యాచార్యులవారి యొద్దఁ జక్కని వైదుష్యమును సముపార్జించి పదునెన్మిది పురాణములఁ జదువునెడ బ్రహ్మాండ పురాణములోని గౌతమీమాహాత్మ్యము-భద్రాద్రిప్రభావము పఠించి భక్తిప్రేరణమువలన నొకసారి భద్రగిరి కేగి శ్రీరామ చంద్రమూర్తిని సందర్శించి వచ్చినాఁడు. ఆవల సహజముగాఁ బైకుబుకుచున్న కవితాధారలో భక్తిరసమును మిళితముచేసి "దాశరథిశతక" మను రసాయనము తయారుచేసినాఁడు. ఆ శతకముం గూర్చి యొక యైతిహ్యము కలదు.

శ త క ము

గోపన్న గోదావరీతీర సికతాతలమ్మున నుపవిష్టుండై తాళదళమ్మునఁ బద్యమ్ము వ్రాసి ప్రవాహమ్ములో నాయాకును వదల నది నీరసముగానున్న వెల్లువకుం గొట్టుకొనిపోయెడిదఁట! రస పుష్టిగానున్న నీటికెదురెక్కి సమీపమున కేతెంచెడిదఁట! అట్లు గూర్పఁబడిన ప్రతిపద్యమును గంటనద్దికొని దాశరథీ! కరుణాపయోనిధీ! అని యఱవఁగా 'ఓఁ' యని రాముఁడు మారు పల్కునఁట!

మఱొకటి:— ఒక వైశ్యుఁడు వర్తకముచేసికొనుచు సర్వకాల సర్వావస్థలయందు భక్తిశ్రద్ధలతో దాశరథిశతకముం బారాయణముఁ జేయుచు, మంత్రమన్నను వేదమన్నను మఱియేమన్నను

సర్వము దాశరథిశతకమునియే విశ్వసించియుండువాఁ డొకనాఁడు గ్రామాంతరమునకేగి సరకు లమ్ముకొని ధనముఁ గైకొని రెండెద్దులబండిమీఁద వచ్చుచుండఁగాఁ బ్రొద్దుగ్రుంకినది. మబ్బుపట్టినది. గాలివానారంభము రేగినది. ఆసమయమున నెచటనుండియో దొంగలగుంపువచ్చి బండిచుట్టు మూఁగినది. వైశ్యునకు గుండె బ్రద్దలైనది. “శ్రీరఘురామ – శ్రీరఘురామ” అని నాల్క పల్కుచున్నది. డబ్బుమూటపై చేయియున్నది. కన్నులు మూఁతపడినవి. ప్రక్క కొరిగినాఁడు. కొంతసేపటికి శకటచోదకుఁడు ‘బాబయ్యా! అంతగోలజరిగితే నిదురమెల్కువరాలేఁ?’ అని లేపి దొంగలు బాణాకఱ్ఱలతో బండిని జుట్టుకొనుటయు, నెచటనుండియో యాకస్మికముగాఁ బంగనామములువెట్టుకొన్న చెంచువాం డ్రిద్దరువచ్చి బాణములునైచి దొంగలఁ బాఱఁ దఱిమిపోవుటయుఁ, జెప్పి ‘యీ గండముగడిచి బైటఁబడినార’ మన్నాఁడఁట! అది వర్తకుఁడువిని ‘నాయనా! వారు చెంచువారుగారు. మనపాలిటివేలుపులు. రామలక్ష్మణు’ లనిచెప్పి తనపై రాముని కృపయున్నందున కుబ్బిపోయినాఁడు. ఇట్లని పెద్దలు చెప్పుచుండెడివారని మానాయనగారు చిన్నతనమున నాకుఁ జెప్పి నాచే దాశరథిశతకము నిత్యము జదివించుచుండెడివారు. నాకు నట్లే కొన్ని గండములు గడచినవి. గోపన్న మఱియుం గొన్నిపొత్తములు వ్రాసినట్లు కన్పించుచున్నది.

మసకొని రేఁగుపండ్లకును మౌక్తికముల్ వెలవోసినట్లు దు
ర్వ్యసనముఁ జెంది కావ్యము దురాత్ముల కిచ్చితి మోసమయ్యె......

దాశరథి 7

అని వగచినాఁడు. దురాశచే నోఁపుల కంకితమిచ్చిన యీ గ్రంథ
మేమయ్యెదియో? ఎన్నటికైన నా కావ్యరత్నము కాలగర్భమును
జీల్చికొని బయల్పడునా ?

ఈ శతకమందలి యొకటి రెండుపద్యములు స్థాలీపులాకన్యాయ
ముగాఁ బట్టిచూతముగాక.

ఉ. రంగదరాతిభంగ ఖగరాజతురంగ విపత్పరంపరో
త్తుంగ తమఃపతంగ పరితోషితరంగ దయాంతరంగ స
త్సంగ ధరాత్మజాహృదయసారసభృంగ నిశాచరాబ్జమా
తంగ శుభాంగ భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!

ఉ. కోఁతికి శక్యమా? యసురకోట్లను గెల్వను [illegible] జం
బాతని మేన శీతకరుఁ డౌట దవానలుఁ డెట్టు లింత? మా
సీత పతివ్రతామహిమ సేవకు భాగ్యము మీకటాక్షమున్
ధాతకు శక్యమా పొగడ? దాశరథీ! కరుణాపయోనిధీ! 62

ఉ. నీ సహజంబు సాత్త్వికము నీ విడిపట్టు సుధాపయోధి ప
ద్మాసనుఁ డాత్మజుండు కమలాలయ నీప్రియురాలు నీకు సిం
హాసన మిద్ధరిత్రి గొడు గాకస మక్షులు చంద్రభాస్కరుల్
నీ సుఖతల్ప మాదిఫణి నీకు సమస్తము కొల్చినట్టి నీ
దాసులభాగ్య మెట్టిదయ దాశరథీ! కరుణాపయోనిధీ! 64

గోపన్న కవితాధారను భావమాధుర్యమును భక్త్యావేశమును
జవిచూడవలయునన్న నాసుకృతికీర్తనలఁ జదివితీఱవలయు. అతని
మఱొక గ్రంథమదియే. ఆకీర్తనలనే నేఁడాంధ్రదేశమున నాబాల
గోపాలము చదివి యానందించు చున్నది. బంగారమునకు

మణులఁ జేర్చినట్లు తన రచించిన తోహారలకుఁ బద్యములకు నా కీర్తనలనే కూర్చి కంచినుండి తూము లక్ష్మీనృసింహ దాసు గారితోఁ గలిసి భద్రాచలమునకు 1831 వ సంవత్సరమున వచ్చి నివసించిన నాగండ్ల వరదరామదాసుగారు హరికథను జేసి యానందించినాఁడు.

"రామదాసుకథ వరదరామదాస రచియించెను నూతనగా'

అని రామదాసుచరిత్రలోఁ గలదు.

అది యట్లుండె. ఇప్పుడు గోపన్నకు యౌవనమువచ్చినది. దానితోఁబాటు తెలివిగలవాఁడు - చదువుకొన్నవాఁడు. బుద్ధిమంతుఁడన్న పేరును వచ్చినది. ఒకనాఁడెవఁడో గోసాయి నిర్నిమిత్తముగా వచ్చి యాయనను జూచి "అబ్బాయీ! నీకుఁ గొలఁది కాలములో రాజయోగము పట్టనున్నది. తెలివిగలిగి దానిని నిలుపుకొ"మ్మనిపల్కి పోయినాఁడు. అమ్మాట నయ్యమ్మ విని యంతములేని యానందము నంతరంగముననే యనుభవించినది. చుట్టు ప్రక్కల యమ్మలక్క లొండొరుల కవ్వార్తను దెలిపికొని పని లేకపోయినను గల్పించుకొనివచ్చి కామమ్మతో సంభాషించి స్నేహము చేసికొని పోవుచున్నారు. మిత్రులు గోపన్ననుజూచి నీకు గొప్ప పదవి లభించిన మమ్ము మఱతువు గాఁబోలు నని చిఱునగవులతో నెచ్చరించుచున్నారు. ఊరి పెద్దలు రచ్చబండమీఁదఁ గూర్చుండి "ఏమో తిన్నగనుసంతవాఁడు కాఁగూడదా? ఎవరి యదృష్ట మెట్లున్నదో? నిముసమునకు వచ్చు సంగతి మనకుఁ దెలియదుగదా?" అని యనుకొను చున్నారు. ఒకటి రెండు దినము లీముచ్చటయే యెచ్చట చూచినను.

ఒకనాఁడు తల్లి గోపన్న కన్నుమువెట్టి యెదురుగా గూర్చుండి 'నాయనా! పెద్దదాననుగాన నోరూరకుండక చెప్పుచుంటిని. ఎంతకాలమిట్లు తినికూర్చుండుట? కొండయైనను దినమునకొక్క కాయిచొప్పునఁ దీయుచున్నచోఁ దఱిగిపోవునుగాదా? మీ తండ్రిగారు సంపాదించినదానిని దినుచుఁ గూర్చున్న నెన్నిదినములకువచ్చును? ఆయాస్తి కొంచమైపోయినపిదప సంసారమెట్లు జరుగును? వేఁడినీళ్ళకుఁ జన్నీళ్లు, చన్నీళ్ళకు వేఁడినీళ్లు నన్నట్లు పిత్రార్జితమునకుఁ దోడు స్వార్జితమును నించుకయున్నఁ గూటికి గుడ్డకుఁ గష్టపడక దినములఁ గడపవచ్చునుగదా? 'ఉత్తమం స్వార్జితంవిత్త'మన్నమాట నెఱుఁగవా? పెండ్లిపేరంటములు గావలసినవాఁడవే? నిర్వ్యాపారుఁడవై యిట్లున్న నీకెవరుపిల్లనిత్తురు? ఏమి చూచియిత్తురు? అబ్బాయీ! నీవేమి తెలివితక్కువవాఁడవా? విద్యాగంధశూన్యుఁడవా? 'ఉద్యోగం పురుషలక్షణమ్' అని యెఱుఁగవా? శ్రీరాములవారి కొల్వులోనుంటినిగదా యనెదవేమో? ముక్తినిజూచికొని భుక్తిని మూనుకొన్ననెట్లు? భుక్తిముక్తులురెండు నుపాదేయములుగావా? లేనియెడల లోకయాత్రజరుగుట దుర్ఘటమురా నాయనా! భక్తిని నేను నిరసింపనుగాని భుక్తిని జూచుకొనుచు భక్తి కలిగియుండవలె నందును. ఉద్యోగము భక్తి కాటంకముగల్గింపదు. ఇప్పటి నవాబుగారు హైందవులను మహమ్మదీయులను రెండుకన్నులవలెఁ జూచుచున్నాఁడు. కావుననే తానీషా మంచిరాజన్న కీర్తిని గాంచినాఁడు. ఆయనను సందర్శించినచో నేదేనియుద్యోగము నీకీయకుండఁజాలఁడు. మనవాఁడు మాదన్న ప్రధానిమంత్రిగాఁగూడ

నచటనున్నాఁడుగదా? ఆదయాళుఁడు తప్పక నీకు సిఫార్సు చేయఁగలఁడు. 'విత్తకరీ చ విద్యా' అని తెలిసికొని రాజవిద్యలో నీవు గొప్పతరగతులుకూడఁ జదివితివఁట! గోసాయి యెవఁడో వచ్చి యేమో చెప్పినాఁడనియు వింటిని. రానున్నది రాకమానదని మిన్నకుండరాదు. ప్రయత్న మత్యావశ్యకము. తాను యత్నింపకున్న దైవమెట్టులు కొనితెచ్చి తనకు నిచ్చు?

"పౌరుషంబు దైవంబు తోడ్పాటులేక
ఫలము పండంగ నేరదు పార్థివేంద్ర!
విత్తు సహకారి గాకున్న రిత్తనేల
వంధ్యమగుఁగాక తా ఫలవంతమగునె?"

పురుషుఁడు ప్రయత్నము చేయఁగా దైవమును దోడ్పడును. రెండు నున్ననే ఫలములభించును. పొలములో విత్తనములు చల్లనియెడల దైవము పంట పండింపఁగలదా? కానఁ బౌరుషదైవములు రెండును ఫలహేతువులు. కనుక నవాబుగారిదర్శనము సేయఁబొమ్ము "యత్నేకృతే యది నసిధ్యతికో౽త్ర దోషః" మనము ప్రయత్నము చేయుదము. దైవము తోడ్పడి ఫలమొసంగనిచోఁ బోనిమ్ము. మనతప్పేమున్నది? ఏమి ? మాటాడవేమి ? నవ్వెదవేమి? తలవంచుకొని జవాబుచెప్పవేమి రా తండ్రీ!" యనఁగా గోపన్న తలయెత్తి ముసిముసినగవులతో "అమ్మా! రామకోటివ్రాయుట పూర్తి గావచ్చినది. సాంతమగుటతోడనే భద్రగిరిదాశరథి కర్పించి యచటనుండియే గోలకొండ కేగివచ్చెదనులె"మ్మని యన్నముదిని లేచినాఁడు. "రామాయణము పారాయణము చేయుట- రామకోటివ్రాయుట- రామభజనమొనర్చుట-

నీకుమాత్రము ఓటికయున్నదా నాయనా !" అని తల్లియులి లేచి పోయినది.

పిమ్మటఁ గొన్ని దినములకు రామకోటిం బూర్తిచేసికొని తల్లితోఁ భద్రాద్రికి కరిగినాఁడు. అచ్చట శ్రీరామచంద్రపాదారవింద ములసన్నిధిని రామకోటి సర్పించి తల్లి నాయూరనే నిల్పి తాను ద్యోగమునకై గొల్కొండతానీషాదగ్గఱకేగినాఁడు. ఆయన మఱొక తూరి దయచేయుఁడని నొకసలామునొట్టి తిరిగివచ్చి తల్లితోఁ జెప్పినాఁడు. ఆమె 'కానిమ్ము రాముఁడే సియ్యండు'యనిపలికి 'నాయనా! యూష్మకుండను వెళ్లి చూచి పిదపఁ గొండపల్లి కేగుద'మన్నది. గోపన్న తల్లిని దీసికొని భద్రాచలమునకు నాగ్నేయ భాగమున రెండు క్రోసుల దూరమునసున్న యూష్మకుండమున కేగుచుఁ త్రోవలో దానికథ నిట్లు చెప్పఁదొడఁగె.

అమ్మా! పూర్వకాలమున నాదిశేషుఁడు పాతాలమునకుఁ ప్రభువైయుండఁ గొందఱు క్రూర రాక్షసు లాయనను బాధింపదొర కొసిరి. దాని నాయన సహింపలేక బ్రహ్మదేశము చేత భూలోకమునకువచ్చి భద్రాచల సమీపమున గౌతమీ తీరమున శివ ప్రతిష్ఠగావించి యద్దేవుంగూర్చి జపతపము లాచరించుచు నొక్క యగ్నికుండము గావించి యం దభిచారహోమము చేయ శివుఁడు ప్రత్యక్షమై శత్రువినాశకమగు నొక శూలమిచ్చి శత్రువుల జయించి సుఖంబుండుమని యానతిచ్చి యరిగె. అయ్యనంతుఁ డనంతరము భూలోకమునుండి స్వీయంబైన నాగ లోకంబున కరిగి రాక్షసుల జయించి ప్రభుత్వము సేయుచుండె.

అమ్మా! శేషుఁడు భూమినుండి రసాతలమున కేగిన బిలద్వారమునుండి భోగవతీ జలం బుచ్చి గౌతమీనదిం గలిసె. ఆయదియే రసాతల గంగాసంగమం బనుపుణ్యతీర్థంబు. శేషుఁడు ప్రతిష్ఠించిన శివక్షేత్రమే శేషేశ్వరస్థానము. ఆతఁడు చేసిన యగ్నికుండమున మహాగ్నిజ్వాలలు వెలిఁగెఁ గావున నందలి జలంబుష్ణంబుగనుండు. అదియే యూష్మకుండము. ఇమ్మాఁడుం శేషుని వలన నేర్పడియెఁ గాన దాని శేషతీర్థమందురు. అందు స్నానదానము లాచరించిన నభీష్టములు నెఱవేరు-నని చెప్పికొనుచుఁ దల్లియుఁ దాను దానిని సేవించి పిమ్మటఁ గొండపల్లికి వచ్చిరి.

# మూఁడవ ప్రకరణము

వయో వృద్ధులు "అబ్బాయీ! నీ కిప్పుడే మంత్రమెందుకు? ఏమంత గడ్డాలు మీసాలు తెల్లవడినవి?" అని వారించుచున్నను, "నా కే మహాత్ముఁడు రామతారకము ననుగ్రహించునో? ఆచార్యులవారైనను సంచారమునుండి రారైరి" అని గోపన్నకు విచారము కలిగినది. అతఁ డొకనాఁడు శయనించి యిట్లు తలపోసె. రామస్మరణము సేయుచున్నను 'గురువులేని విద్య గూడ, వందురు. నా కే మహాత్ముఁడు త్వరగా లభించునో? ఏ గురువు నన్నుద్ధరించునో?

శ్లో॥ "గురవో బహవస్సంతి శిష్య విత్తాపహారకాః
తమేకం దుర్లభం మన్యే శిష్య హృత్తాపహారకమ్"

శిష్యుల ధనమును హరించు గురువులు పెక్కుమంది కలరు కాని హృదయ తాపమును బోఁగొట్టు గురువొకఁడుఁగూడ లేఁడని తలంచెదను. అయ్యో! కాలము వృథాగాఁ బోవుచున్నదే!" యని యనుకొని నిద్రించెను. అంత చిన్నతనములో నట్టి భక్తిభావము కుదురుట పూర్వ పుణ్యవిశేషము వలననే. కృష్ణుఁడు చెప్పెఁగదా?

శ్లో॥ తత్ర తం బుద్ధి సంయోగం లభతే పౌర్వ దైహికం
యతతే చ తతో భూయ స్సంసిద్ధౌ కురునందన! భ॥ గీ 6-43

అర్జునా! పురుషుఁడు పూర్వజన్మమునందు సంపాదించుకొన్న యాత్మానాత్మ వివేకజ్ఞానము నుత్తరజన్మమునందును బొందుచున్నాఁడు. పూర్వ సంస్కారమువలన జ్ఞానసిద్ధికై మఱలఁ బ్రయత్నమును జేయుచున్నాఁడు.

౪౦. చెడుఁ గరులు హరులు ధనములు
చెడుదురు నిజసతులు సుతులు; చెడు చెనటులకున్
జెడక మనునట్టి గుణములకుఁ
జెడని పదార్థములు విష్ణుసేవా నిరతుల్.

భాగవత-అష్టమ

ఏనుఁగులు గుఱ్ఱములు ధనములు భార్యలు పుత్రులు నశించెదరు. చెడిపోవు దుష్టులకైనను, చెడిపోని శిష్టులకైనను విష్ణుభక్తి మాత్రము జన్మాంతరముం బైనను జెడక వెంటవచ్చును. అట్టైన గురు వేలనందురా? గురువులేనిది బహిర్గతముకాదు.

"అభివ్యంజ కాధీనత్వా న్నస్వభావాత్" ఈశ్వరదర్శనము 8-33

'పూర్వసంస్కారము లభివ్యంజ కాధీనములు. అవి స్వతస్సిద్ధముగా బయటికి రావు. అభివ్యంజకద్రవ్య సన్నిధానముననే యాయా సంస్కారములు బహిర్గతములగును' అని బ్రహ్మానందస్వాములవా రనిరి. ఒజ్జయుఁ దనంతటతాన వచ్చి యుపదేశించి పోవును జూఁడీ!

అంతఁ గొక్కొరొకో యని కోడి కూసినది. గోపన్న రామనామస్మరణముతో లేచి కాల్యములు నిర్వర్తించి స్నానసంధ్యాదికము నాచరించి రామాయణము భక్తితోఁ జదివి నమస్కరించి లేచి కుల గురువైన రఘునాథ భట్టరాచార్యులవారు ముంగిటికి కరుదెంచిరని విని వేగముగా భక్తిశ్రద్ధలతోఁ బ్రత్యుత్థానాదికము నాచరించి యంజలిపట్టి నిలువంబడి యాశ్చర్య దృష్టి నిరీక్షించుచున్నవాని కొజ్జ యిట్లనియె.

గోపన్నా! కుశలమా! నీ నడవడిని వింటిని. నీ భక్తివిశేషములు నాకబ్బురము కలిగించినవి. నీ రచించిన దాశరథిశతకమే నీసుకృత పరిపాకమును వెల్లడించుచున్నది. రామానుగ్రహము నీయందున్నట్లు నాకు గోచరించుచున్నది. శ్రీరామచంద్ర పరబ్రహ్మమూర్తి యందలి నీ యచంచలభక్తియే నీకుఁ బునరావృత్తిరహిత శాశ్వత పరమపదము నీఁజాలును. 'రామ'యను రెండక్షరముల ప్రభావము నీశ్వరుండును దెలియఁజాలఁడు.

> "రా" కలుషంబులెల్ల బయలంబడఁ ద్రోచిన "మా" కవాటమై
> దీకొని ప్రోచు నిక్కమని ధీయుతులెన్నఁ దదీయవర్ణముల్
> గైకొని భక్తిచే నుడువఁ గానరుగాక విపత్పరంపరల్
> దాకొనునే? జగజ్జనుల దాశరథీ! కరుణాపయోనిధీ !

అని నీవునుం జెప్పితివిగదా! నాయనా వింటివా? నారాయణాష్టాక్షరికన్న ముఖ్యతమమగు మంత్రము లేదని వైష్ణవోత్తములును, శివపంచాక్షరి సప్తకోటి మహామంత్రములకుఁ బ్రధానతమమైనదని శైవులును దలంతురు. మహర్షియైనవసిష్ఠుఁడీమంత్రద్వయ రహస్యము నెఱింగి యష్టాక్షరినుండి "రా" అనునట్టియుఁ బంచాక్షరినుండి "మః" అనునట్టియుఁ బ్రధానవర్ణములఁ దీసికొని "రామః" అను నామము నేర్పఱిచినాఁడు. ఆ మంత్రములలో నా రెండక్షరములే ప్రధానము లెట్లయ్యె నందువా? వినుము. అష్టాక్షరిలో 'రా' పోవుటతోడనే "నాయనాయ" అయినది. న + అయనాయ = అనఁగాఁ బరగతికిఁ బనికిరాదనియు-శివపంచాక్షరిలో 'మః' పోవుటతోడనే 'నశివాయ'

అనఁగా శుభముకొఱకుఁ గాదనియు-నర్థమిచ్చుచు నిర్జీవము లైనవి. ఇంతకంటె దృష్టాంతమేమికావలయు? అబ్బాయీ! అట్టిరాముఁడు పరమదైవమని భావింపుము. రామతారకమే భవతారకము. ఊరక సంశయించి పెరవేల్పులం గోరక నారక పీడానివారకమని తారకమునే హృదయకోరకమునఁ బూజింపుము-అని రామభక్తుఁడా! మాపరమగురుస్వాములవా రానతిచ్చిన భక్తిలక్షణములన్నియు నీయందుఁ గన్పట్టుచున్నవి.

శ్లో॥ మద్భక్తజన వాత్సల్యం పూజాయాం చానుమోదనం
స్వయ మభ్యర్చనం చైవ మదర్థే దంభవర్జనం
మత్కథా శ్రవణే భక్తిః స్వరనేత్రాంగ విక్రియా
మమానుస్మరణం నిత్యం యచ్చమాం నోప జీవతి
భక్తి రష్టవిధా హ్యేషా యస్మిన్ మ్లేచ్ఛేపి వర్తతే
స విప్రేంద్రో మునిశ్శ్రీమాన్ స యతిస్సచ పండితః
తస్మైదేయం తతోగ్రాహ్యం సచపూజ్యో యథాహ్యహం

1. భక్తులయందు వాత్సల్యము కలిగియుండుట. 2. ఒరులుసేయు భగవత్పూజ కామోదించుట. 3. తాను స్వామినారాధించుట. 4. భగవద్విషయమున దంభములేకుండుట. 5 భగవత్కథల భక్తితో వినుట. 6. భగవద్గుణానుభవమున వైస్వర్యాదులువహించుట. 7. నిత్యము భగవత్స్మరణము సల్పుచుండుట. 8. భగవంతుని వదలి యుండలేకుంట-నను 8 విధముల భక్తితో వర్తించు, వాఁడు మ్లేచ్ఛుఁడైనను వాఁడే బ్రాహ్మణశ్రేష్ఠుఁడు. మునియు యతియు, పండితుఁడును. వానికేదే నీయవచ్చును. వానినలనఁ బుచ్చుకొనవచ్చును. వాఁడును నావలెనే పూజ్యుఁడు. అని భగ

వంతుఁడే వక్కాణించెను. భక్తికంటె నుత్తమమార్గ మెుందు లేదు. నాయనా! హఠయోగము, ఖేచరి, జాలంధరము, ఉడ్యానము, వజ్రోలి, అమరోలి, మొదలగు మార్గములజోలి పోకుము. అవి నిరపాయములు-సులభసాధ్యములు-కావు. ఒకవేళ కష్టించి సాధించినను నవి యణిమాదిసిద్ధులనొసంగి నీకు గర్వహేతువు లగును. సులభమైన తారకము నాశ్రయించిననే యష్టసిద్ధులు తమకుఁదామే పిచ్చికుక్కలవలె నీవెంటవచ్చును. కాని వానివైపు తిరిగియైనఁ జూడకుము. చూచితివా లక్ష్యము తొలఁగును. ఇచ్ఛగలదేని యిది వినుము.

"దేహమధ్యే బ్రహ్మనాడీ సుషుమ్నా సూర్యరూపిణీ పూర్ణచంద్రాభావర్తతే. సాతుమూలాధారా దారభ్య బ్రహ్మరంధ్ర గామినీభవతి. తన్మధ్యే తటిత్కోటి సమానకాంత్యా మృణాళ సూత్రవత్ సూక్ష్మాంగీ కుండలినీతి ప్రసిద్ధాఽస్తి. తాం దృష్ట్వా మనసైవ నర స్సర్వ పాపవినాశద్వారా ముక్తోభవతి. ఫాలోర్ధ్వ గలలాట విశేషమండలే నిరంతరం తేజస్తారకయోగ విస్ఫురణేన పశ్యతిచేత్ సిద్ధోభవతి"

అద్వయతారకోపనిషత్తు

దేహమధ్యమున మూలాధారము మొదలుకొని బ్రహ్మరంధ్రము వఱకు సూర్యరూపిణియగు సుషుమ్నానాడి వెలుఁగుచున్నది. అదియే బ్రహ్మనాడి. దాని మధ్యరంధ్రమునఁ దామరదారము వలె సూక్ష్మమైనట్టియు, కోటివిద్యుత్కాంతులతోఁ బ్రకాశించుచుండునట్టియు కుండలినీశక్తిగలదు. దానిని మనోనేత్రమునఁ జూచిన నరునిసర్వపాపములు నశించును. పిదప ముక్తియు లభించును. మఱియు ఫాలమునకుఁ బైలలాటమునఁవలి చంద్రమండ

లమందుండు కుండలినీప్రకాశమును దారకయోగానుభవముచేఁ జూచువాఁడు సిద్ధుఁడగును. ఇదియే యమూర్తి తారకము. తెలిసినదా? "శుక్ల తేజోమయం బ్రహ్మ" శుద్ధజ్యోతిర్మయమగు బ్రహ్మమును మనోయుక్తాంతర్దృష్టిచే నరయుభాగ్యము నీకు శీఘ్రముగా లభించునుగాక! "సర్వ త్రాంతఃపదార్థవివేచనే మనోయుక్త్యభ్యాస ఇష్యతే" లోనివస్తువుఁ దెలిసికొనుటకు మనస్సుతోఁగూడినయభ్యాసమే కావలయుననుట మఱువకుము.

నేను చెప్పినదానిని జక్కఁగా మననముచేయుము. శ్రవణమననాదు లలవడినపిదప మూర్తితారకముఁ దెలిసికొనుము. వినెదవా? గుదస్థానమున మూలాధారము, మేహనమున స్వాధిష్ఠానము, నాభియందు మణిపూరము, హృదయమున ననాహతము, తాలుమూలమున విశుద్ధము, నిటలమున నాజ్ఞ, బ్రహ్మరంధ్రమున సహస్రారము, నుండును. ఈషట్చక్రముల సందర్శించినసాధుపుంగవు లిట్లు నుడివిరి.

శ్లో॥ ఆధారస్తు చతుర్దళో ఽరుణరుచి ర్వాసాంత వర్ణాశ్రయః
స్వాధిష్ఠాన మనేక వైద్యుతనిభం బాలాంత షట్పత్త్రికం
రత్నాభం మణిపూరకం దశదళం డాద్యం ఫకారాంతకం
పత్త్రై, ర్ద్వాదశభి స్త్వనాహతపురీ హైమీకఠాంతాన్వితా

శ్లో॥ వృష్ట్యారం స్వర షోడశైశ్చ సహితం జ్యోతి ర్విశుద్ధాంబుజం
హంక్షే త్యక్షర పద్మపత్త్రయుగళం రత్నాభమాజ్ఞా పురీ
తస్మా దూర్ధ్వ మధోముఖం వికసితం పద్మం సహస్రచ్ఛదం
నిత్యానందమయీ సదాశివపురీశక్తే నమ శ్శాశ్వతం.

ఆధారచక్రము ‘వ శ ష స’ అను నాల్గు వర్ణములుగల నాల్గు దళములతో నెఱ్ఱగా నొప్పుచుండును. స్వాధిష్ఠానము ‘బ భ మ య ర ల’ అను 6 వర్ణములుగల 6 దళములతోఁ బెక్కు మెఱుపుల కాంతితో మెఱయుచుండును. మణిపూరకము ‘డ ఢ ణ త థ ద ధ న ప ఫ’ అను 10 వర్ణములుగల 10 దళములతో రత్నమువలె వెలుఁగుచుండును. అనాహతము ‘క ఖ గ ఘ ఙ చ ఛ జ ఝ ఞ ట ఠ’ అను 12 వర్ణములుగల 12 దళములతో బంగారువన్నె భాసిల్లుచుండును. విశుద్ధము ‘అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఏ ఐ ఓ ఔ అం అః’ అను 16 వర్ణములుగల 16 రేకులతో జ్యోతిపగిదిఁ బ్రకాశించుచుండును. ఆజ్ఞాచక్రము ‘హం క్షం’ అను 2 అక్షరములుగల 2 దళములతో రత్నముమాద్రి తనరుచుండును. దానికిపై సహస్రముఖముగా వికసించిన సహస్రారపద్మము నిత్యానందమయు డైనసదాశివుని పురము క్రాలుచుండును. మఱియుఁ దదధిష్ఠానదేవతలు విమానములు మున్నగునవి కలవు. వాని ననుభవమున నీవే తెలిసికొనఁ గలవు.

కం. తారకయోగము తెలియఁగ
నేరక వేదాంతవాక్య నికురుంబముచే
నూరక వాదించెడు చెడు
వారికి మోక్షంబు గలదె? వాయుకుమారా!

సీతారామాంజనేయము

అని కలదుగదా? భక్తి కంగముగ నీ యభ్యాసము నుంచికొనుము.

తండ్రీ! ఏమైన నడిగెదవా? యన గోపన్న సాష్టాంగనమస్కా
రము లాచరించి నిలిచి కేల్మోడ్చి 'మహాత్మా! ధన్యుఁడను.
ధన్యుఁడను. మీ సందర్శనమున ధన్యుఁడను. మీ నిర్హేతుక
కృపాకటాక్షమున నన్నుఁ బావనునిం జేసిన మీ ఋణము
నెట్లీఁగఁ గలను. ఆహా! నాకుఁ దెలియని యెన్ని విషయముల
బోధించితిరి? అని కొంత తడవు నిమీలితాక్షుఁడై యుండి—

> ధ్యాయే త్వాం హృదయాంబుజే రఘుపతిం విజ్ఞాన దీపాంకురం
> హంసోహంస పరంపరాది మహిమాధారం జగన్మోహనం
> హస్తాంభోజ గదాబ్జచక్ర మతులం పీతాంబరం కౌస్తుభం
> శ్రీవత్సం పురుషోత్తమం మణినిభం రామం భజే తారకం.
>
> రామకర్ణామృతము

అని యాచార్యులవారికి నమస్కరించి మొగంబునఁ జూడ్కు లు
నిగిడించి యిట్లనె.

గోపన్న—"బ్రహ్మమ్మనఁగ నేది? పరమగురుండ!"

అనియడుగ నాచార్యుం డించుక యోచించి యితనికి నిర్గుణ
పరబ్రహ్మతత్త్వమును గూడ నుపదేశించెదంగాక! యని సంభా
షింపఁ దొడంగె.

గురు— కనుమోయి మహదహంకారమైనట్టి
భూమ్యాదిభూతముల్ వో మహద్రూప
మై యొప్పు తేజ మాద్యంత శూన్యమ్ము
నిర్గుణమ్ము శుభ మ్మనిర్వాచ్య మతుల
ముజ్జ్వలమ్ము బహువిధోపాధిరహిత

మఖిలగతము సచ్చిదానందరూప
మై మించు చైతన్యమగును బ్రహ్మము.

గోపన్న — ఈశ్వరుం డెవ్వఁడో యెఱిఁగింపు గురుఁడ!

గురువు — ఈబ్రహ్మమే స్వప్రకృతిచేత నీశ్వ
రాభిధేయమునొంది యఖిలలోకములఁ
దానుసృష్టించి యంతర్యామియయ్యుఁ
బాలిచి బ్రహ్మముల బుద్ధీంద్రియముల
కెలమి నియంతయై యీశ్వరుండయ్యె.

గోపన్న — జీవుం డెవండో వచింపుమో గురుఁడ!

గురువు — ఈ యీశ్వరుండె రుద్రేంద్రాదినామ
రూపమూలకమగున రూఢిగా నేన
స్థూలదేహమ్ముగాఁ దొడరియుంటె నను
నధ్యాసవశమున నందె జీవాఖ్య
అతఁ డొక్కఁడయ్యు దేహారంభకముల
భేదవశంబునఁ బెక్కురై తోఁచు.

గోపన్న — ప్రకృతి యెయ్యదియొ చెప్పవె గురుదేవ!

గురువు — బ్రహ్మసన్నిధినున్కి బహుచిత్రగతుల
సర్వజగత్సృష్టి సామర్థ్యమొంది
బుద్ధిరూపంబునఁ బొలుచు నాబ్రహ్మ
శక్తియే ప్రకృతి నా జాల్వారుఁ దండ్రి!

... ... ... ...

గోపన్న — ఏది కర్మమొ చెప్పవే గురురాయ!

గురువు—ఇంద్రియమ్ము లొనర్చు నెల్లకార్యముల
నేన యొనర్చుచుంటి నటంచు నాత్మ
కనుబంధముగఁ జేయు నదియె కర్మమ్ము.

... ... ... ...

గోపన్న—ఏది బంధము చెప్పవే గురువర్య !

గురువు—అనఘ! యనాద్యవిద్యావాసనలను
నేఁ బుట్టితినని యిట్లున్ననిగతుల
ననుకొనుచుండుట యగునుబంధనమ్ము
తల్లిదండ్రుల సహోదరులఁ బుత్త్రికుల
గృహావనక్షేత్రాద్యనేకవస్తువుల
నాది యన్మమతయున్నఁ బంధమగును

... ... ... ...

కర్తృత్వమును బూనఁగా బంధమగును

... ... ... ...

కైవల్యమాత్రకాంక్షయును బంధమ్ము

... ... ... ...

తనరు సంకల్పమాత్రమున బంధమ్ము.

గోపన్న—మోక్షం బనఁగ నేది బోధింపు దేవ !

గురువు—ప్రబలనిత్యానిత్యవస్తు విచార
శక్తి నశాశ్వత సంసారదుఃఖ
సౌఖ్యవిషయ సమస్తక్షేత్రమమత
లను వీడు బంధమ్ములఁ దొలంగుకొనుము

అఖిలసంకల్పక్షయంబె మోక్షంబు

... ... ... ...

గోపన్న—సన్న్యాసి యెవ్వండు శశ్వత్ప్రభావ!

గురువు—సర్వధర్మముల విసర్జించి మమత
నయ్యహంకారంబు నటుత్రోసిపుచ్చి
బ్రహ్మంబు నొంటను నుపాసించుచుండి
తలఁచి 'సర్వం ఖల్విదం బ్రహ్మ' మనియు
నిఁక "తత్త్వమసి" యని "నేహ నానాస్తి
కించన" యని యెఱింగియుఁ దదర్థాను
భవయోగమున "నహం బ్రహ్మాస్మి" యనుచు
భావించి నిర్వికల్పసమాధిచేత
నలరునాతండె సన్న్యాసియనంగ
నతఁడె బ్రహ్మజ్ఞాని యతఁడె ముక్తుండు.

... ... ... ...

—నా జిజ్ఞాస

ఇట్లు శ్రీశంకరభగవత్పాదులవారి కభీష్టమగు నద్వైతమతము నుపదేశించి మఱియు నిట్లనియె.

గోపన్నా! ఈ మార్గము సర్వజనసులభసాధ్యముకాదని శ్రీశ్రీ రామానుజులవారు శ్రీమధ్వాచార్యులవారు సేవ్యసేవకభావ ముట్టిపడ ఆ శంకరాద్వైతమునకు భిన్నముగా మఱికొన్ని మతముల స్థాపించిరి—

"హరి సర్వోత్తమదైవ మీజగము సత్యం బుచ్చనీచస్థితుల్
కలవన్ జీవులు భిన్నులై హరికి సేవల్ చేసెడిన్ భక్తిభా

స్వాఽసత్తాసాధన నైజసౌఖ్య మగుమోక్షం బక్షముఖ్యత్రయీ
స్ఫురితార్థంబు ప్రమాణమన్గురుఁడు పోల్చెన్ మధ్వరాయల్।”

—నా స్మరణము

జీవేశ్వరులు భిన్నులను మాధ్వమతముంగూర్చి చర్చించి—

“పరి దృశ్యంబునె మిథ్యయందు రకటా ప్రత్యక్షమున్ నమ్మఁబో
వనో జ్ఞానంబున మోక్ష మబ్బదనొకో భక్తిప్రపత్తుల్ చనన్
గోరి నేకంబయినన్ వృతింపరయ జీవుం డీశ్వరుండగాడఁ డ
న్వర రామానుజ సద్గురూత్తముఁడు............”

—స్మరణము

అని విశిష్టాద్వైత మతముంగూర్చియు బోధించి— నాయనా! మీ వంశమున మూఁడుతరములనుండియు వైష్ణవాచారము విజృంభించుచున్నదిగదా! నీవును శ్రీరామచంద్ర పరబ్రహ్మ మూర్తియే ముక్తికారణుఁడని దృఢముగా విశ్వసించి తైల ధారావిచ్ఛిన్న ధ్యానపరంపరచేతను—

శ్లో॥ ఆనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనం
రక్షిష్యతీతి విశ్వాసో గోప్తృత్వవరణం తథా
ఆత్మనిక్షేపకార్పణ్యే షడ్విధా శరణాగతిః

అనుకూలుఁడుగా నుండునని సంకల్పించుట, ప్రతికూలభావము వీడుట, రక్షించునను నమ్మకమూనుట, రక్షింపఁగోరుట, ఆత్మ భారము నర్పించుట, దీనతఁజూపుట, యనెడి ప్రపత్తిచేతను శ్రీరాముని గొల్వుము.

శ్లో॥ వ్యాధస్యాచరణం ధ్రువస్యచవయో విద్యాగజేంద్రస్యకా
కుబ్జాయాః కిమునామరూపమధికం కిం వా సుదామ్నోధనం

వంశః కో విదురస్య యాదవపతే రుగ్రస్య కిం పౌరుషం
భక్త్యా తుష్యతి కేవలం నచగుణైర్భక్తిప్రియో మాధవః

ధర్మవ్యాధుఁడు మాంసమమ్మువాఁడైనను, ధ్రువుఁడు చిన్న ప్రాయమువాఁడైనను, గజేంద్రుఁడు విద్యాశూన్యుఁడైనను, కుబ్జ సుందరిగాకున్నను, కుచేలుఁడు ధనవంతుఁడు గాకున్నను, విదురుఁడు హీనజాతివాఁడైనను, యాదవుఁడగు నుగ్రసేనుఁడు పౌరుషహీనుఁడైనను, మాధవుఁడు గుణములంజూడక భక్తినే వీక్షించి సంతసించి సంరక్షించెను. భగవంతుఁడు భక్తిప్రియుఁడు సుమా! అమ్మహాత్ముం డనంతకల్యాణ గుణగణమండితుండు. హేయగుణరాహిత్యుండు. కల్యాణసంధాయకుండు. "పుంసాం మోహనరూపాయ" అనినట్లు పురుషులకును మోహజనకమగు దివ్యసౌందర్యమంగళవిగ్రహుండు. ఆనందమయుండు. పుండరీకాక్షుండు. బిడ్డా! నీవు లేఁబ్రాయముననే యిట్టి సన్మార్గము నవలంబించుటచే నీ భక్తి శీఘ్రముగనే పరిణతిం బొందునని తోఁచుచున్నది. శబ్దాంతరోచ్చారణప్రాతికూల్యమునకు "నోరు నొవ్వంగ హరికీర్తి నుడువు"చుండుము. అన్యశ్రవణాంతరాయమునకుఁ గంఠమెత్తి బిగ్గరగా హరికీర్తనలు పాడుము.

శ్లో॥ జిహ్వే కీర్తయ కేశవం; మురరిపుం చేతో భజ; శ్రీధరం
పాణిద్వంద్వసమర్చ; యాచ్యుతకథా శ్రోత్రద్వయ త్వం శృణు
కృష్ణం లోకయ లోచనద్వయ; హరే ర్గచ్ఛాంఘ్రియుగ్మాలయం
జిఘ్ర ఘ్రాణముకుంద పాదతులసీ మూర్ధన్నమాధోక్షజమ్

—ముకుంద

ఓ నాల్కా! కేశవునిఁ బాడుము. ఓ మనసా! మురారిని భజింపుము. ఓ హస్తములారా! శ్రీధరుని బూజింపుఁడు. ఓ శ్రో

త్రములారా! అచ్యుతుని కథలను వినుఁడు. ఓ కన్నులారా! శ్రీకృష్ణుని జూడుఁడు. ఓ పాదములారా! విష్ణ్వాలయమున కేగుఁడు. ఓ నాసికా! హరిపాదములఁబూజించిన తులసి నాఘ్రాణింపుము. ఓ శీర్షమా! అధోక్షజునికి వంగి మ్రొక్కుము—

అని నీ యింద్రియములఁ గైంకర్యవశమున శ్రీరామచంద్రుని కొప్పగించి కృతార్థుండవగుము.

శ్లో॥ నాస్థా ధర్మే నవసునిచయే నైవ కామోపభోగే
యద్యద్భవ్యం భవతు భగవన్ పూర్వకర్మానురూపం
ఏతత్ప్రార్థ్యం మమ బహుమతం జన్మజన్మాంతరేపి
త్వత్పాదాంభోరుహయుగగతా నిశ్చలా భక్తిరస్తు

—ముకుందమాల

"ఓ భగవంతుఁడా! నాకు ధర్మార్థకామములును వలదు. పూర్వకర్మము ననుసరించి యేది రావలయునో యదివచ్చుంగాక! నేనుమాత్రము కోరునదొక్కటే. ఎన్ని జన్మము లెత్తినను నీపాదముల నాశ్రయించు నిశ్చల భక్తిమాత్రము తప్పక నాకుండుగాక!" అని ప్రార్థించుచుండుము.

నాయనా! మనస్సు శాంతించినదా? ఇంక నేమికావలయునో యడుగుము. తెలిసియున్నఁ జెప్పెద- ననుడు గోపన్న యాచార్యులవారి పాదములఁబడి కన్నీటితోఁ బాద్యమిచ్చి, నిట్టూర్పుతో నర్ఘ్యమిచ్చి, హృదయముతోఁ బుష్పమిచ్చి, తత్పాదరజోమాల్యము కంటనద్దికొని మౌళిధరించి నిజేప్సితం బెఱింగింప నగ్గురుండు తారాబలాదికముంజూచి యరిచక్రంబున

సిద్ధసుసిద్ధంబని యెఱింగి "శుభస్య శీఘ్రమ్" అనితలంచి హస్తమస్తక సంయోగ పూర్వకంబుగా—

'శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే"

అనుచుఁ జెవిలో భవజలధితారక మగుతారకమహామంత్రము నుపదేశించి పునశ్చరణ విధానంబు గఱపి విధిదృష్ట ప్రకారంబు నం బూజలంది సంతుష్టాంతరంగుఁడై యరిగె.

అంత గోపన్న నిదురనుండి మేల్కొనినట్లుగా నిక్షేపము దొరకినట్లుగా నేత్రములు వచ్చినట్లుగాఁ దలంచి నిర్భరానందాతిశయమున నిశ్చలస్వాంతుఁడై నిమీలితనేత్రుఁడై యించుక తడ వమ్మంత్రరాజమును మననము చేసికొని పరవశుఁడై గాంబోలుఁ బాణియుగంబు వికృతంబుగాఁ ద్రిప్పుచు శీర్షంబు నాడించుచు—

"జయజయజయ మంత్రం జన్మసాఫల్య మంత్రం
జననమరణ భేదక్లేశ విచ్ఛేదమంత్రం
సకల నిగమ మంత్రం సర్వశాస్త్రైక మంత్రం
రఘుపతి నిజమంత్రం రామరామేతి మంత్రం"

## గేయము

తారకమంత్రము కోరిన దొరకెను ధన్యుఁడనైతిని ఓరన్నా
మీరినకాలుని దూతలపాలిటి మృత్యువయని నమ్మరయన్నా!
... ... ... ... ... ...
ఎన్ని జన్మములఁ జేసినపాపము-లీజన్మముతో విడునన్నా
అన్నిటికిది కడసారిజన్మ మిది-సత్యం బికఁ బుట్టుట సున్నా!

అని గంతులు వైచుచుఁ బాడిపాడి కొంతసేపటికిం దెలివి

వహించినాఁడు. ఇట్లు గోపన్న భక్తితో రామమంత్రము నుపాసించుచు దినములు గడపుచుండెను.

ఇక్కడ రామదాసు గురువెవరో యించుక విచారింపఁబడిన పిదప మూఁడవప్రకరణము ముగియును. జనశ్రుతి యొకటనో తారుమారు చేయుచుండును. ఈలోకప్రవాదాఘాతములకుఁ గొండలుసైతము కూలును. సముద్రములుసైతము వట్టిపోవును. నన్నయకుఁ దిక్కనకు—

"మదమాతంగతురంగకాంచన లసన్మాణిక్య గాణిక్యసంపద" లను పద్యముద్వారమున సమకాలీనతఁ గూర్చినవారో, భోజరాజునకు నక్షురలక్షులకథలఁ దార్చినవారో, ప్రమిదేఁడు చమురునకుఁ బాండురంగమాహాత్మ్యమునకు సంబంధము వెట్టినవారో రాజరాజునకుఁ జిత్రాంగిని సారంగధరుని నంటఁగట్టినవారో యెవరోకాని కబీరునకు రామదాసునకు గురుశిష్యత్వమును బాధించి వైచిరి.

ఆ వాడుక ననుసరించి నాగండ్లవరదరామదాసు 1832లో రామదాసు హరికథయందు—

'కబీరుదాసుని కటాక్షమునఁ దాఁ గాంచె రామనామమును'

అనిరచించెను. కబీరునకు గోపన్నకుఁగల కాలవ్యత్యాసమును దద్భక్తశిఖామణి గమనింపఁజాలఁడయ్యెను. అదియునుంగాక నాకాలమున వ్యక్తుల కాలనిర్ణయము చేసికొనుటకు సాధన సంపత్తియు సమృద్ధిగా సంభవింపదయ్యె. సంభవించినను భక్తుల కాజోలియేపట్టదు. అందువలన వృద్ధులమాటల నాధారము

చేసికొనియో కబీరుం గురువుఁ జేసినఁగాని రామదాసునకుఁ గీర్తిరాదనియో అట్లయ్యనఘుండు వ్రాసియుండెను.

బహుగ్రంథపరిశోధకుఁ డగు నప్పకవియే నన్నయ కలియుగాది నుండెనని యెఁజుఁడీ!

కం. అవధారు శబ్దశాసను
డవనిఁ గలియుగమున కాది నారాజమహేం
ద్రవరంబునఁ జెప్పెన యాం
ధ్రవచోవ్యాకరణసూత్రతతిఁ దెనిఁగింతున్

—అప్పకవీయము

అనినం బెఱవారిం దడవనేల?

అంత నాహారికథయే యాంధ్రదేశమునంతయు నలముకొని యెల్లరిహృదయపీఠముల నాక్రమించుకొనియె. ఆగింజ నానుటచే నాటకములు ప్రబంధములు మొలకెత్తినవి. ఆకవులైన విచారించినవారు కారు. చూడుఁడు. శ్రీయుత ధర్మవరము గోపాలాచార్యులగారిచే రచింపఁబడిన రామదాసు రూపకమును తన్నాటకప్రదర్శనములం దిలకించి కబీరు బాగుగా నభినయించెనందు రేకాని యొక్క-రేని 1398 లోఁ బుట్టినకబీరు, 17వ శతాబ్దిమధ్యముననున్న గోపన్న కెట్లుపదేశింప లేచివచ్చెనని యందురేమో విచారింపుఁడు. గోపాలాచార్యులవారేని సవిమర్శముగా యోచించినట్లు కన్పింపదు. వారు తమనాటకము నాల్గవకూర్పునఁ బీఠిక "నేను హైదరాబాదునగరమున చిరకాలము వసించి భద్రాచల రామదాసుచరిత్రను విమర్శించి యున్నాఁడను. ఈనాటకము యొక్క- కథాభాగము చరిత్ర ననుస

రించి యున్నది. ౨౦౦ సంవత్సరముల క్రిందట గోలకొండ రాజ్య పాలకుఁడగు తానీషాకాలమున నక్కన్నయను నియోగిబ్రాహ్మణుఁడు రాజమంత్రియైయుండెను. అతనికి గోపన్న మేనల్లుఁడు. ఇతఁడే రామదాసు. ఇతఁడు కబీరుదాసువలన రామమంత్రోపదేశముపడసి" రనియు వ్రాసియుండిరి. కనుకనే తమనాటకమునఁ బెక్కురంగములఁ గబీరుఁ బ్రవేశపెట్టిరి. ఇది చమత్కారముగానున్న నుండునేమోకాని చరిత్రకు మాత్రము తీరని లోపము తెచ్చిపెట్టును.

"కబీరు విక్రమశకము ౧౪౫౫వ వత్సరమున జ్యేష్ఠశుద్ధ పూర్ణిమనాఁడు (క్రీస్తుశకము 1398 అగును.) జనించినట్లు ప్రబలాధారములు గన్పించుచున్నవి. సరియేకాని యాతఁడు రమారమి ౩౬౦ ఏండ్లు బ్రతికియుండఁగూడదా? అణిమాదిసిద్ధులంబొందిన యోగాభ్యాసకుల కది యొకలెక్కలోనిదియా?

"ఏవంచధారణాః పంచకుర్యాద్యోగీ విచక్షణః
తతో ధృఢశరీరస్స్యాత్ మృత్యుస్తస్య నవిద్యతే"
—యోగతత్త్వోపనిషత్

ధారణాద్యభ్యాసమువలన దృఢశరీరుఁడగుటయేకాక మృత్యువునుగూడ జయింపవచ్చునని యోగతత్త్వోపనిషత్తునం గలదు. మఱియుఁ బాతంజలమందును మృత్యువుం గెలువవచ్చునని మూఁడవయధ్యాయమునం గలదు. కానఁ గబీరు భీష్మునివలె మృత్యువును లోఁబఱచుకొని జీవించియుండఁగూడదా" అనియు మీరడుగవచ్చును. నా యుత్తరము వినుఁడు. మీరన్నది సత్యమేకాని కబీరు యోగాభ్యాసకుఁడు గాఁడు. అతఁడు

పాతంజలసూత్రములఁ జదివి యాచరించిన ట్లాధారములు లేవు. పైఁగా నాతఁ డవతారవాదము—మాయావాదము-విగ్రహా రాధనము-కర్మకాండము-వ్రతాదికములు - తీర్థయాత్రలు-వర్ణా శ్రమధర్మములు—మొదలగువానికిం బ్రతికూలవాది. కనుక నాతం డాసూత్రముల నా యుపనిషత్తులఁ బాటించియుండఁడు. ఎఱిఁగియుండఁడనిన ననవచ్చును. భక్తివాదము నాతఁ డంగీక రించిన నే కేశ్వరవాదియేసుఁడీ! రామరహీముల కైక్యము గూర్చినను నవతారముల నమ్మఁడుసుఁడీ!
కబీరుమాటలు వినుఁడు.

"దునియా ఐసీ బావరీ, పత్థర పూజనజాయ్
ఘరకీ చకియా కాహే న పూజై జిసకా పీసా ఖాయ్"

లోకము పిచ్చిది. ఎందుకన రాతిని పూజించును. గృహ మందలి తిరుగలి నేలపూజింపరాదు? అది విసిరినపిండిని మనము తినుచుంటిమిగా? అని పై దాని భావము. మఱొకచో "రాతిని బూజించిన భగవానుఁడు కన్పించినచో నేను బర్వత మునే పూజించెద" ననియె. ఇట్టివాఁడా రామదాసునకు గురువు? శిష్యుఁడు భద్రాద్రి శ్రీరామవిగ్రహములఁ బూజించు చున్న? గురువు వలదనఁడా?

మఱియొకచోఁ గబీరు "రాళ్లు కంకర ప్రోగుచేసి మసీదును నిర్మించెదరు. పూజారి దానిపై నెక్కి గొంతుపగుల నఱచును. భగవంతునకుఁ జెవుడు వచ్చినదా? యేమి?" అనెను. ఇట్టి గురువుగారు, తనశిష్యుఁడు భద్రాచలమందలి యాలయనిర్మా

ణాదుల కాసులక్షలు వ్యయముచేయుచుండఁ జూచుచు మిన్నకుండఁ గలఁడా?

వేయేల? కబీరుమతమునకు రామదాసుమతమునకు హస్తిమశకాంతరము కలదు. కబీరు కాశీక్షేత్రమును వదలి 'బస్తీ' మండలములోని 'మగహార' అనుగ్రామమున కేగి యక్కడనే విక్రమశకము ౧౫౫౨ లో నాశ్వయుజ శుద్ధైకాదశినాఁడు (క్రీ శ. 1495) పరమపదముఁ జెందెనని "భక్తిసుధాబిందుస్వా" దను గ్రంథమునం దున్నది. ఆయన కళేబరమును సమాధిచేయ మహమ్మదీయులును, దహనముచేయ హైందవులును, జోరాడి చివరకెట్లో సమాధానపడిరఁట! ఎవరేమిచేసినను క్రీ శ.1495 లో మృతిచెందినవాఁడు 17 వ శతాబ్దిమధ్యమున రామదాసున కుపదేశింప లేచివచ్చుట యసంభవముకాదా?

ఇఁక స్వప్నగోచరుండై యుపదేశించెనందురా? యది తప్పుకొనుట యగును. లేకున్నఁ "దత్పథావలంబకునింగూడఁ గబీరందు" రనియు నట్టివాఁడెవఁడో యొకండు వచ్చి మంత్రోపదేశముచేసి పోరాదా? యనియు నొకచేయి యడ్డముపెట్టఁ జూచెదరా? "అయ్యో! రామదాసునకు గురువుకాఁదగినవాఁ డంత యనామకుఁడా?" ఏల యీ వితండవాదము? రామదాసుగారే స్పష్టముగా నొకచోటఁగాదు రెండుచోట్లఁ దన కారణగురువును స్మరించియుండ మనకీ యూఁకదంపు తగునా? వినుఁడు—

"ఎన్ని జన్మము లెత్తఁగవలయునో" అను కీర్తనలో "అనుదినమును గురునుపదేశయోగము నభ్యసింపనైతింగా" అని గురు వున్నట్లొప్పుకొన్నాఁడు. పేరు లేదుగదా యనెదరేమో? ఉన్నది. ఇదుగో—

"ఆర్యులకెల్ల మ్రొక్కి వినతాంగుడనై రఘునాథభట్టరా
చార్యుల కంజలెత్తి"

—దాశరథిశతకము. 6

అని విస్పష్టముగా వాయెత్తి వాకొన్నాఁడు. ఇంకను సంశయమా? అయిన మఱొకచోటఁ గూడఁ దిలకింపుఁడు—

పట్టితి భట్టరార్యగురుపాదము లిమ్మెయి నూర్ధ్వపుండ్రముం
బెట్టితి మంత్రరాజ మొడిఁ గట్టితి నయ్యమకింకరాళికిం
గట్టితి నమ్మ నీచరణకంజములందు తలంపువెట్టి పో
దట్టితిఁ బాపపుంజముల దాశరథీ! కరుణాపయోనిధీ!

గోపన్న వైష్ణవమత సంప్రదాయము కలవాఁడని యతని నడవడియే నుడువుచున్నది. కనుక రామదాసు వ్యంగ్యముగాఁగాక వాచ్యముగా "రఘునాథభట్టరాచార్యుల వలన మంత్రరాజముగు తారకము గ్రహించితి ననుచుండ నీ డొంకతిరుగుడులు సంశయములు నేల?

ఇఁకనైనఁ గబీరు రామదాసునకు గురువు కాఁడని విశ్వసింతురు గాక!

# నాల్గవ ప్రకరణము

విద్యార్థికిఁ గ్రొత్తపొత్తము, రేవంతునకుఁ దురంగోత్తమము, దరిద్రునకు విత్తము, లభించినట్లు గోపన్నకు మంత్రము లభించినది. అహోరాత్రములు దానిసేవయే. చెప్పవలసిన దేమున్నది.?

క్రమక్రమముగా గోపన్న సద్గుణములు భక్తిలతలు పరిసర గ్రామముల నలముకొన్నవి. ఆముష్యాయణుండు-సుందరుండు-విద్యావంతుఁడు- తినఁ గుడువనింతకలవాఁడు- సాముద్రికులు జ్యోతిష్కులు రాజయోగమున్నదనుచున్నారు - అని గోపన్నను గూర్చి తెలిసికొని మాపిల్లనిత్తుము - మాపిల్లనిత్తు మని పైపై వచ్చి కన్యాజనకులు కామమ్మగారి నడుగుచుండిరి. అబ్బ లేనిబిడ్డ గాన నండయుండుటకు గొప్పసంబంధమైన బాగుండునని కామమ్మ మదిలోఁగలదు. కాదా మఱి? తండ్రి కులమును, తల్లి ధనమును, బిల్ల రూపమును, బంధుగులు మృష్టాన్నమును, గోరుచుందురు.

కామమ్మ యొకనాఁడు కొడుకునుఁజేరి "నాయనా! పితరుల ఋణము దీర్పుము. గృహస్థాశ్రమము స్వీకరింపుము. ఏమో నాఘటము మాత్రము శాశ్వతమా? నీ వొకయింటివాఁడవైన నావచ్చిన పనితీఱును. మీ తండ్రిగారికిఁ బీటలపైఁ గూర్చుండు వేడుక లేకపోయె. నాకుఁ గన్నులతోఁ జూచు నదృష్టమైనా కలదు. ఎప్పటికేమో? పిల్లనిచ్చెదమన్నపుడు మానినచోఁ బిదపఁ గష్టపడవలసివచ్చును నీకుమాత్రము తిరిగి చేయునా రెవ

రున్నారు? బ్రహ్మచర్యాశ్రమమాయెను. ఇఁక గృహస్థాశ్రమమునఁ బ్రవేశింపుము. అది నీకేమియాటంకము గలిగింపదు. మీఁదుమిక్కిలి యదియే నీవంటివారికి శ్రేష్ఠతమము.

సీ. కలఁకులనున్న తంగేటిజున్ను గృహమేధి
　　యజమానుఁ డఁకసిశాస్థపేటి
పండిన పెరటికల్పకము వాస్తవ్యుండు
　　దొడ్డిఁబెట్టిన వేల్పుబడ్డి కాఁపు
కడలేని యమృతంపు నడబావి సంసారి
　　సవిధ మేరునగంబు భవనభర్త
మరుదేశపథమధ్యమ ప్రపకులపతి
　　యాఁకటికొదవు సస్యముకుటుంబి
బధిరపంగ్వంధ బిక్షుక బ్రహ్మచారి
జటిపరివ్రాజకాతిథి క్షపణకావ
ధూతకాపాలికా ద్యవాహ్యలకుఁగాన
భూసురోత్తమ! గార్హస్థ్యమునకు సరియె? —మనుచ

చెవిటి కుంటి గ్రుడ్డివారలకు బిచ్చగాండ్లకుఁ బెండ్లిగానివారికి సన్యాసులు మొదలైన దిక్కుమాలినవారికెల్ల గృహస్థుఁడే కూడుపెట్టు రక్షకుఁడు. కాఁబట్టి పరోపకృతి యొనర్పవలెనన్న నీ ద్వితీయాశ్రమమునఁ జేరవలయు. నీవు గృహస్థుఁడవయ్యు రామము జపించుకొనవచ్చు"నని యొడంబఱిచి కుమారున కన్ని విధములఁ దగిన యాదెమ్మ యనుకన్యనుగూర్చి యొక శుభముహూర్తమున వివాహము చేసినది. కొలఁది కాలమునకే గర్భాదాన సంస్కారముగూడ జరిగినది. భగవ

దనుగ్రహమున గోపన్నకుఁ గొన్నాళ్ళకుఁ గొడుకు గల్గినాఁడు. ఆ నాఁడు కామమ్మకు భర్త లేచివచ్చినట్లున్నది. ఇరుగు పొరుగువారు వచ్చిచూచి లింగనమంత్రి పుట్టినాఁడన్నారు. గోపన్న స్నానదానము లాచరించినాఁడు. పురుడు వెళ్ళిన పిమ్మటఁ గోటివ్రాసి బాలారిష్ట మున్నదేమో చూచి కుజుఁడు చాలియుండలేదని తచ్ఛాంతికై జపాదు లాచరించినాఁడు. ఒక రోజు కామమ్మ బాలుఁడు పోరుపెట్టెనని సోదెయడిగి నామ కరణమహోత్సవమునాఁడు నక్షత్రనామ మాసనామాదులైన పిదప నాయనా! మీ నాయనగారి పేరుపెట్టరా బిడ్డకని చెప్పి నది. “లింగయ్యశర్మ” అని నామకరణము చేయఁబడెను.

పిల్లవాఁడు దినదినప్రవర్ధమానుఁడగుచున్నాఁడు. గోపన్న దూర మునుండి చూచిపోవునుగాని యెత్తుకొనుటలేదు. మనస్సులోఁ దన గృహస్థధర్మము నెఱవేర్చికొంటిననియుఁ బితౄణము దీర్చి కొంటిననియు మురియుచున్నాఁడు. తనకు రామునికొలువు— దారకు నింటికొలువు—తల్లికి పిల్లవానికొలువు. కామమ్మ చేతు లలోనే బాలుఁడు పెరుగుచున్నాఁడు.

పిల్లవాఁ డున్నాఁడు. వానిని బోషించుటకు ధనము కావలయు నన్నవాంఛయే గోపన్నకులేదు. అతండు దయాళుండు గావున బీదలంజూచి సహింపలేక క్రమముగాఁ దనయింటఁగల సర్వ వస్తువుల దానము చేయుచున్నాఁడు. చివరకు మిగిలినదిచూడ దారకుఁ దాళిబొట్టు—తనకుఁ బిలకజుట్టు. ఉంఛవృత్తి మేలు

గాదా యనుకొన్నాఁడు. కుచేలుఁ డిర్వదేగ్గురు కొడుకులతో బీదకాఁపురము సరిపెట్టుకొనలేదా యనుకొన్నాఁడు.

ఇట్టి స్థితిలోఁ బాపము! కామమ్మ యొకనాటి మధ్యాహ్నము మడికట్టుకొని జపముచేసికొని నాయనా! కన్నులు తిరుగుచున్నవిరా! హంస లేచునట్లున్నది—అని నేలపై నొత్తిగిలి భగవద్ధ్యానముచేయుచు నిరాయాసముగా నసువుల విడచినది. ఒక యేడుపేడ్చి గోపన్న యథావిధి యపరకర్మ మాచరించి మాతృఋణ విముక్తుఁ డైనాఁడు. తనచేతులలోఁ దల్లి పోయినందులకుఁ దృప్తుఁడైనాఁడు.

ఒకనాఁడు శ్రీరామచంద్రుఁ డడవులలోఁ గష్టములొందుచున్నట్లు, చెట్టుక్రింద గండశిలపైఁ గూర్చుండి శబరి యిచ్చెడి యెంగిలి పండ్లఁ దినుచున్నట్లు, స్వప్నమున గోచరింప నులికిపడి లేచి కూర్చుండి యోజించినాఁడు. తా నిదివఱలో భద్రాద్రి కేగి దర్శనము చేసికొనివచ్చిన శ్రీరామవిగ్రహము స్మృతికివచ్చినది. దమ్మక్క గట్టించిన యాలయము జీర్ణమైనది. ఆ రామస్వామికిఁ గోవెలను నిర్మించిన బాగుండు ననువాంఛ కల్గినది. మఱల యోజించినాఁడు.

“చేత దమ్మిడీ లేని నేను దేవాలయనిర్మాణ మహాకార్యము నెట్లాచరింపఁగలను? దరిద్రునిమాట నెవ్వరాలింతురు? ఎవరు పల్కుదురు? ఎవరు తోడ్పడుదురు? ఇది నావలన నగు కార్యమా?” అని కొంతసేపు నిట్టూర్పుపుచ్చి మఱల ధైర్యము తెచ్చుకొని “స్వామివారి యనుగ్రహమున్న తాళ్ళు నీళ్ళపైఁ దేలవా?

పూరిపుడక బ్రహ్మాస్త్రము కాదా? కనుక నాకేల యధైర్యము? అంతకు రాముఁడే కలఁడు. ఈ సారి నవాబును సందర్శించెద" ననుచుండ దక్షిణబాహువు స్పందించె. అది శుభశకునంబని మనంబున నానందించి "రామా! నీకు నమస్కారములు. నీ సంకల్పము లమోఘములు. నీ కృత్యము లనిర్వాచ్యములు. నీలీల లద్భుతావహములు. నీ యిచ్చవచ్చినట్లు నన్ను ద్రిప్పి కొనుము." అని యొకనాఁడు పంచాంగశుద్ధి యెఱింగి గోలకొండకుఁ బయనమైనాఁడు.

ఆ మార్గమును రామస్మరణమను నిశ్శ్రేణిచే నెక్కుచున్నాఁడు. అందువలన మార్గాయాస మతని డాయదయ్యె. ఆనాఁడు ధూమశకటములుగాని ద్విచక్రశకటములుగాని లేవు. గ్రామంబులు నొండొంటికి దగ్గఱ యుండవు. మార్గములును నిష్కంటకములై యుండవు. క్రూరచోరసంచారభైరవములు. అటవికజనాకీర్ణములు. దుర్గమకాంతార సంతానదంతురితములు. కాని యానాఁ డూరికొక సత్త్రముకలదు. అం దాగంతులకు వలయునన్ని వసతులు చేయఁబడుచుండును. మఱియు గృహస్థులతిథ్యభ్యాగతులకు నతికుతుకమున నాతిథేయ సత్కారము లాచరించుచుందురు "నాన్నోదక సమందానం" 'అభ్యాగత స్స్వయం విష్ణుః' ఇత్యాది వాక్యార్థముల మననము చేయుచుందురు. పాత్రమెఱిఁగి దానము, క్షేత్రమెఱిఁగి విత్తనము, వేయవలయుననియు వారికిఁ బట్టుదల. కనుక మన రామభక్తుఁ డేగ్రామమున కేగినను 'అయ్యా! మాయింటికి దయచేసి మా యాతిథ్యము స్వీకరించి మమ్ము బావనులఁ జేయుఁ' డని బతి

మూలువారే. ఆముఖవికాసమో—ఆ పూర్వసుకృత విశేషమో-ఆ రామకృపాతిశయమో- ఎవరుచెప్పఁగలరు? 'వస్త్రేన వపుషావాచా' అన్నట్లు గోపన్న పింజవోసి వస్త్రము ధరించెను. మోమునిండఁ దిరుమణి తిరుచూర్ణము దిద్దును. మెడనిండయేకాక తులసిపూసలు ముంజేతులకును జుట్టుకొనును. గోవుపాదమంత నడినెత్తిని శిఖ. ముందరిజుట్టుగాని క్రాపింగుగాని లేదు సరికదా యీనాటి గిరజాలు జులపాలుగూడ నాయనకు లేవు. బుజమునుండి చిన్న బొక్కసా ప్రేలాడుచుండును. శిరోవేష్టనమ్ము పాదరక్షల ధరించి యొకచేతఁ బేముకఱ్ఱను మఱొకచేతఁ జిఱుతలను వాల్చి టక్కుటక్కుమనిపించుకొనుచు సీరనముగా హరికీర్తనలఁబాడుచు నడచుచుండును. ఆయన యొడ్డుపొడుగు గలవాఁడు. దేహము బలిష్ఠమైనది. విశాలమైన ముఖము. కనులలో నొకటిరెం డరుణరేఖలు గలవు.

తనవెంట సుందరకాండమును గొంపోవుచుండెనుగాన గోపన్న మకాముచేసినయింట భోజనానంతరము నిదురింపక పురాణముం జెప్పెడివాఁడు. స్ఫుటమైనవాక్కు. మధురమైన భావములు. చక్కని వైదుష్యము. స్వారస్యముగల గాత్రము. సంగీతమునందుఁ బ్రవేశముగలదు. ఇఁక నతని కేయూరగౌరవముజరుగదు? ఉదయ మొకయామడ సాయంకాల మొకయామడ చొప్పున నప్పారుండు కతిపయదివసములకు గోలకొండఁ జేరినాఁడు.

16 వ శతాబ్దిని గోలకొండరాజ్యము రెండవయీజిప్టని ఖ్యాతి వహించినది. అరబస్థాన్ తురుకస్థాన్ ఈరాన్ (పారశీకము)

మొదలైనదేశములనుండి యనేకవర్తకులు గోలకొండకు వచ్చుచుండిరి అందుచే దేశములోని వర్తకము విశేషముగా నభివృద్ధియై గోలకొండలో దొరకని వస్తువులేదని ఖ్యాతివచ్చెను. ఇబ్రాహీం కుతుబ్ షాహా (౧౫౫౦-౧౫౮౦) కట్టించిన "గోలకొండ దుర్గప్రాకారము, ఇబ్రాహీంబాగ్ అనుతోట, ఫుల్ బాగ్ అను పుష్పోద్యానము, లంగరులు, (భిక్షాగృహములు) ఇబ్రాహీం పట్టణతటాకము" ఆయనకీర్తిని జాటుచు వెలుగుచున్నవి. తానీషామామతండ్రి (౧౫౮౦-౧౬౧౧) మహమ్మద్ కులీకుతుబ్ షాహా కట్టించిన జుమ్మామసీదు, చార్ మినార్, రాజసౌధములు-పాఠశాలలు, భిక్షాగృహములు, నేటికిని బ్రకాశించుచు ననేకుల పొగడ్తల నందుకొనుచున్నవి. ఈయన కాలములో బట్టణముచుట్టు వేయబడిన పెక్కుతోటలు తానీషాగారిచేతను గాపాడబడుచు పురమునకు వన్నె దెచ్చుచున్నవి. గోలకొండ దినదినాభివృద్ధినందుటచే జనులందఱికి నీరు చాలినంత లభింపమిచే కులీకుతుబ్ షాహా మూసి కానకట్టగట్టించియు గొట్టములద్వారమున నీరుదెప్పించియుఁ బ్రజలఁ బోషించుటయే కాక మూసియొడ్డున నొక పట్టణముగూడ నిర్మించి స్థల సంకోచభయము ప్రజలకుఁ బాపెను. ఆ నవాబుకొడుకు హైదర్ అగుట నతనిపేరనే హైదరాబాదని నేఁడు పిల్వఁబడుచున్న దా పట్టణము. గోలకొండ కైదు క్రోశముల దూరముననున్న హైదరాబాదునుగూడ గోపన్న చూచినాఁడు.

గోపన్న గోలకొండ రాజవీధులఁబోవుచు నా పుర సమృద్ధికైశ్వర్యముంజూచి యాశ్చర్యపడినాఁడు. నేటి చెన్నపురము దాని

గ్రుక్కకుఁజాలదు—నేటి బొంబాయి దాని ప్రక్కకుఁజాలదు— అనినచో మీరాకాపట్టణమహోన్నతదశ హృదయమునకు హత్తుకొనునని తలంచెదము. ఏవైపుచూచిన శిరోవేష్టనము క్రిందఁబడుఁగాని సౌధ శిఖరాగ్రభాగములు దృగ్గోచరములుకావు. ఏ వంకఁజూచిన మావిపండ్లరాసులవలె మాణిక్యములు కుప్పలు వోయఁబడియున్నవి. అందఱు రత్నముల వెల యెఱుగువారే. అందఱు బంగారమును వీసెలకొలఁదిఁ గొనువారే. బీదవాఁడు కంటికిఁ గన్పింపఁడు. బిచ్చగాఁడు కూడులేదని యాచింపఁడు. భటులు రాజలాంఛనార్థమే కాని చోరులను బట్టుటకుఁగాదు. దర్బార్ ప్రజోపయోగకార్యముల నొనర్చుటకేగాని నేరముల విచారించుటకుఁ గాదు.

అట్టి గోలకొండపట్టణమున నేగుచు మహామాత్యశేఖరుల సౌధమడిగి సమీపించినాఁడు. అక్కన్నకొక సౌధము. మాదన్నకొక సౌధము. మాదన్నకొడుకు మల్లన్నకొక సౌధము. మాదన్న పినతండ్రి కొక సౌధము. అన్నిటినిజూచి యాశ్చర్యపడి—

సీ. భానుచంద్రప్రభా భాసమాన స్వర్ణ
చంద్రకాంతోపల సౌధములును
కలకంఠ శుక నీలకంఠ సముత్కంఠ
మానితకూజితోద్యానములును
ఫుల్లవికాంభోజ హల్లకకల్హార
కైరవోల్లసిత కాసారములును
మణిమయ కనకకంకణ ముఖాభరణ వి
భ్రాజిత దాస దాసీజనములు

గలిగి చెలువొందు సదనంబుగాంచి విస్మ
యమును బొందుచు నెట్టిపుణ్యాత్ముఁ డుండు
నిలయమొక్కొ యపూర్వమై నెగడె మహిత
వైభవోన్నత లక్ష్మీనివాసమగుచు.

— భాగవతము

అని తలంచుచు డాయంజని ద్వారపాలురచే నమాత్యులవారి హర్మ్యమని యెఱింగినాఁడు. ఆ ధగద్ధగాయమానభర్మహర్మ్యమును నిర్నిమేషదృష్టితో వీక్షించి నిశ్చలుఁడై నిలిచినాఁడు. పింగళి మాదన్నగారు సామాన్యుఁడా? నవాబుతర్వాత నవాబంతవాఁడు. ఆయన యాజ్ఞపై నౌకల నడిపించినాఁడు. అవనిపై బంగారమును పండించినాఁడు. ఆయనకత్తి కెదురులేదు. ఆయనమాటకుఁ బోటీలేదు. ఆయనకీర్తికి మేరలేదు.

ఆనతియిచ్చెనా యది శిలాక్షర మెవ్వని నేని మెచ్చెనా
వానిఁ గృతార్థుఁ జేయఁ బగవాఁడయినన్ శరణంబుఁ జొచ్చెనా
యా నరు నేరమెంచక తనంతటివాని నొనర్చుఁ నిచ్చెనా
యేనుఁగుపాడి యీడుఁగలరే?......................

బెబ్బులివంటివాఁడైన యౌరంగజేబునకుఁ బ్రక్కలో బల్లెమైన యోధాగ్రేసరుఁడు. స్వకీయ నిశితకరవాలధారాంచలములఁ బెక్కుసారు లౌరంగజేబుసైన్యము నోడించి పాఱఁగొట్టిన వీరాగ్రణి. మహారాష్ట్రరాజ్య స్థాపకుఁడగు శ్రీ శివాజీప్రభువంతవాని స్నేహము జూఱఁగొన్న మహారాజ్యాంగవేత్త. బెజవాడ మచిలీపట్టణము చెన్నపురి మొదలైన తనరాజ్యమందలి యనేక పట్టణముల నన్నసత్త్రముల స్థాపించిన మహాపుణ్యశాలి. అతని భోగభాగ్యములు వర్ణనాతీతములు.

ఆంధ్రులారా! ఆయనను గుఱించిచెప్పిన మీకు విసువుపుట్టునా? పునరుక్తి యనిపించునా? అభిమానము గలదేని యాదరముతోఁ జదువుఁడు.

"యజమానునిరాజ్యము కాపాడవలయుననియు, హిందువుల గౌరవ మధికముచేయుటకై హిందువులయొక్క మభివృద్ధిచేయవలయుననియు, మాదన్నపంతులు శ్రీశివాజికిని తానీషాకును స్నేహము కుదిర్చెను. మాదన్నపంతులుగా రాహ్వానము చేసినందున ౧౬౭౭ లో శివాజి.........గోలకొండకుఁ బోయెను." అ............

మాదన్నగారు ధర్మమునందు మిక్కిలి శ్రద్ధగలవారుగను విద్వాంసుల నాదరించువారుగను నుండిరి......తానీషా మరాటావారితో సంధిచేసికొనుట విని యౌరంగబేబు తన సైన్యములను గోలకొండమీఁదికిఁ బంపెను. కాని యక్కన్న మాదన్నగార్ల సైన్యములను అనేకపర్యాయము లోడించి పాఱఁదోలిరి............

ఇట్లు గోలకొండలో సర్వాధికారముతోఁ బ్రభుత్వము చేయుచున్న యీ మంత్రిపుంగవుల యనుగ్రహము వడయవలయునని మనదేశమువారుగాక ఫ్రెంచి ఇంగ్లీషువారుగూడ విశ్వప్రయత్నములు చేయుచుండిరి. అప్పుడు ఈష్టుఇండియాకంపెనివారు చిన్న వర్తకులు. చెన్నపట్టణము ఒక చిన్నగ్రామము. ప్రస్తుతము జార్జిటవున్ అనఁబడుస్థలము మాత్రము కంపెనీవారి స్వాధీనములో నుండెను. మచిలీపట్టణములో వీరికి నొక

గిడ్డంగి (Factory) యుండెను. ఈ స్థలములన్నియు గోల కొండవారి రాజ్యము లోనివి. కావున నీ భూములకై కంపెని వారు గోలకొండనవాబునకు శిస్తు చెల్లించుచుండిరి. ఇంతియు గాక గోలకొండరాజ్యములో నిరాటంకముగా వర్తకము చేసి కొనుటకు నవాబు నాజ్ఞ కావలసి యుండెను......కావున గోలకొండలో సర్వాధికారులయిన అక్కన్న మాదన్నగారి యనుగ్రహము సంపాదించుటకు చెన్నపట్టణములోని యింగ్లీషు వారు విశ్వప్రయత్నములు చేయుచుండిరి. ౧౬౭౮ లో తానీషాయు మాదన్నగారును మచిలీపట్టణమునకుఁ బోఁగా నచ్చటి యింగ్లీషువారు వారిని మిగుల గౌరవించి వారి యనుగ్రహము వడయుటకై వారికి ననేక బహుమతు లొసంగిరి. ౧౬౭౮ వ వత్సరపు ఫిబ్రవరి నెలలో చెన్నపట్టణపు ఇంగ్లీషు వారు తమకు స్యాంథోం అనఁగా మైలాపూరు ఎగ్మూరు అను స్థలములు కౌలున కిప్పించునట్లు కోరిరి.

౧౬౮౦ లో పోడేల లింగప్ప యనువాఁడు చెన్నపట్టణమునకు సరుకులు రాకుండ నడ్డగించినందున వాఁడట్టు చేయకుండ మాన్పవలసినదనియుఁ దమవర్తకమునకు భంగము లేకుండఁ జేయవలసినదనియుఁ గంపెనీవారు అక్కన్న మాదన్న పంతుల వారినిఁ గోరిరి.........అదివరకు కంపెనీవారికి నీయఁబడిన "ఫర్మాను" ప్రకారము విశాఖపట్టణము మొదలైన స్థలము లలో కంపెనీవారికి వర్తకవిషయమైన వీళ్లు కలుగఁజేయుమని కంపెనీవారక్కన్న మాదన్నగారిని ౧౬౮౩ సెప్టెంబరులోఁ గోరిరి. అక్కన్నగారికిని దుబాష్ వెంకటాద్రికిని ౩౧ వ సెప్టెంబరు దిన

మున బహుమతుల నంపిరి. ౧౬౮౨ నవంబరులో మాదన్నగారి కొడుకు మల్లప్పకు వివాహమయిన సందర్భములో వెలయిచ్చె దనని యాతఁడు తెల్పినను వలదనిచెప్పి చెన్నపట్టణపు ఇంగ్లీషు వారు వీసెడు బంగారపు గొలుసు కానుకగాఁ బంపిరి. ౧౬౮౩ సం॥ నందు ౧౮ జనేవరి దినమున సంవత్సరాదికానుకఁ గంపెనీ వారు ౪౦౦ వరహాలు మాదన్నగారికిఁ బంపిరి. వారి యను గ్రహము వడయుట కివి పంపఁబడెనని వ్రాయఁబడియున్నది.

ఇంగ్లీషువారిని ననుగ్రహించుటకును పరదేశమునుండి వచ్చిన యితరాగంతుకులను (Interlopers) గోలకొండ రాజ్యములో నుండి వెడలఁ గొట్టుటకును అక్కన్నగారికి నెన్నియోపుట్ల రాగియు ధనమును ఇచ్చెదమని చెన్నపురములోని ఇంగ్లీషు వారు ౧౬౮౩ లో ౧౪ గవ ఆగస్టుదినమునఁ దెలియఁజేసిరి. ఇట్లొక్కటా ? రెండో మాదన్నగారి కుమారుని యుపనయన మునకుఁ బొడ్డకి మాదన్నగారి పేష్కారుకు (Secretary) అయిన బిడ్డకును, బినతండ్రికి బహుమతులు పంపి వారియను గ్రహమును సంపాదించుటకై యీస్టుఇండియా కంపెనివారు ప్రయత్నించుచుండిరి.” ఇదియొకనాటి మనయాంధ్రుని మహోన్నతదశ.

—మహమ్మదీయ మహాయుగము.

అట్టి పింగళి మాదన్న మహామాత్యశేఖరు సందర్శన భాగ్యము కొండికలకు లభించునే? యనుకొనుచుండ నొక వైష్ణవోత్తముఁ డాగోపన్నంజూచి జాలిపడి సమీపించి “అయ్యా! మీ

దేయూరు ? ఏలవచ్చితిరి?" అనియడిగి నిజవృత్తాంతం బెఱింగి "ఇట్లుకాదు. అమాత్యులవా రుషఃకాలంబున మధురోదనామక సరోవరమున కేగి స్నానసంధ్యాదికము నిర్వర్తించుకొని వత్తురు. మీ రిచట వేచియుండి వారితో సంభాషింపుఁడు. ఎల్లి శివ పూజయుఁ దత్సర స్తిరసౌధంబున నేయని కొందఱు బ్రాహ్మణు లన వింటిని. నేఁడు మీరు మాయింటికి విచ్చేయుఁ"డన నగునగు నిది మంచియుపాయమని గోపన్న వారియింటనే యారేయి గడపెను.

చరణాయుధములు ఱెక్కలల్లాడించి గొంతెత్తి కొక్కొరోకోయని కూసెను. దరిద్రుని ఛిద్రకుటీరము చందమున మిన్కుమిన్కు మనుకొలఁది తారలతో నంబర మొప్పుచుండెను. ప్రభాత వాయువులు మందమందముగా భటులవడువున రాజవీధుల నడయాడుచుండెను. శయ్యోపవిష్టులగు వృద్ధబ్రాహ్మణు లొనరించు హరినామసంకీర్తనములు ద్విజారావముల మాఱుంచు చుండెను. అగస్త్యుఁడు తనసునిశిత కిరణజాలంబులం జోఁపి కర్షకలోకంబు కృషికార్యంబులఁ బ్రవర్తిల్లం జేయుచుండెను. కులాయంబుల శకుంతసంతాన మెఱకై పోవనుంకించి కాఁబోలు స్వీయ శిశుసంతతికిఁ కిలకిలారావముల బుద్ధులు గఱపుచుం డెను. సూర్యునకుఁ బ్రచటికాలంబు కూర్చుండఁ దీఱికకలదో లేదో కాని కాలమునకు మాత్రము తీఱిక లేదు. ఎల్లప్పుడు పయనము చేయవలసినదే!

అప్పుడు గోపన్న రామస్మరణ మొనర్చుచు మేల్కొని కనులు విచ్చి స్వీయాంగుళీయకమందలి శ్రీరామస్వరూపమును దిల

కించి కంటనద్దికొని నీరవముగా ధ్యానశ్లోకములఁ బఠించుకొని లేచి యవ్వలఁ గాల్యముల నిర్వర్తించుకొని స్నానసంధ్యాదు లాచరించి ముఖంబునఁ దిరుమణి తిరుచూర్ణంబు, మెడను దులసి పేరులు, హృదయమున రామపాదములు, నోట శ్రీరామ పదోచ్చారణము, మెయినిండ ద్వాదశోర్ధ్వపుండ్రములు, గ్రాలనా గేస్తునకుం జెప్పి పింజవోసిన నీర్కావిధోవతి గునిసియాడ బుజమునుండి వ్రేలాడు నుత్తరీయపుఁ జెంగులు గాలికి నృత్య మాడ సవరంబెత్తింగి యెడమకాలు ముందుంచి పయనమై మాదనామాత్యుని సౌధరాజమునకు దక్షిణదిశనున్న మధురోదంబను కాసారంబు తీరంబుఁ జేరె.

ఆ సరోవరము భూసురులకొఱకు మాదన్నగారు నిర్మింపించిరి. మహామ్మదీయు లద్దానిం దాఁకరాదని వాకట్టడి. అది సుగ్రీవాజ్ఞయే. దాని గట్టున గోపన్న సుఖోపవిష్టుఁడై సమయము కొఱకు నిరీక్షించుచున్నాఁడు. శరీరవ్యాయామానంతరము మాదన్న యఘమర్షణసూక్తులతో స్నానమాచరించి తీర మందలి తియ్యమామిడిచెట్టుక్రింద తిన్నియపైఁ బఱచిన వ్యాఘ్రాజినముపైఁ గూర్చుండి యనుష్ఠానము చేసికొనుచున్నాఁడు.

కారాగారవిముక్తులైన చోరులమాడ్కి ముడిచికొన్న తామర పూలనుండి చంచరీకసంచయము లెట్లో దారితీసికొని వెల్పలికి వచ్చి ఝుంకారము లాచరించుచున్నవి. వారిజపరాగ పంకిల దూషితముకానియట్లు యంత్రము లమర్పఁబడియుండుటం జేసి నిర్మలోదకము భూసురవర్యుల కాపోశనాదులఁ దృప్తిగొల్పు

చున్నది. సదాగతియగుటఁగాబోలుఁ దెమ్మెరకుఁగమ్మని తమ్ముల సెత్తావి నువ్వెత్తుగనెత్తికొనిపోవ సర్వాధికార మీఁబడినది. దాఁగిలిమూఁతలోఁ దల్లినిఁదాఁకఁ బర్వెత్తుబాలికలవలె పాల రాలమెట్లచాలుం దాఁకఁ దరంగపాళులు వెన్వెంటఁ బర్వులిడు చున్నవి.

తరుణారుణకిరణ మృదుకరముల చక్కిలిగింతలఁ బకబకనవ్వు చున్నవోయన్నట్లు వికసితపుండరీకషండంబులు ధవళరోచుల వెలుఁగుచున్నవి. ద్విజులు సద్దెసల మెట్లపై బారులు తీర్చి నిలువంబడి మందేహాసురసంహారణార్థము మంత్రించి సర్వతోముఖంబుల బ్రహ్మాస్త్రంబుల విడుచుచుండిరి. కొందఱు గాయత్రి జపించుచుండిరి. కొందఱు వచ్చుచుండిరి. కొంద ఱేగుచుండిరి. ఝల్లున తెల్లవాఱినది. భాస్కరుఁడు ప్రభామయకరములం దట్టి ప్రకృతిని మేల్కొల్పినాఁడు. సర్వప్రాణులు స్వస్వవ్యాపారముల నిమగ్నులై యుండిరి.

మాదన్నగారు ముఖవస్త్రము వైచికొని పంచాక్షరి జపించి శివపూజను ముగించి లేచునప్పటికే జాముప్రొద్దెక్కినది. పిమ్మట శివనిర్మాల్యము మారేడుదళములు గంటనద్దికొని చెవిం జేర్చి యడిగినవారి కడిగిన ట్లెన్నియో దానధర్మము లాచరించి వారిని సంతుష్టులం జేసి పంపెను. ఇది వారికి నిత్యకృత్యము.

కలిమి యుండఁగ నేసరియా? దానశూన్యమైన విత్తము, సంతాన విహీనమైనగృహము- ధైర్యరహితమైన దేహబలము-నిరర్థకము.

జరయు మృతియులేనిజనునట్లు ప్రాజ్ఞుండు
ధనము విద్య గూర్పఁ దలఁపవలయు
ధర్మమాచరింపఁదగు మృత్యుచేఁ దల
వట్టి యీడ్వఁబడిన వాఁడుఁబోలె.

గోపన్న దూరముననుండి యిదియంతయుంజూచి మాదన్నగారి దైవభక్తికి ధర్మాసక్తికి నబ్బురంపడుచు సమీపించి నమ్రుఁడై నమస్కరించి నిలువంబడి తన స్థితిం జెప్పికొని యేదే నుద్యోగ మిప్పింపవలయునని ప్రార్థించినాఁడు. మాదన్నగా రాతనియాకార వైఖరుల నుపలక్షించి విద్యాధికఁ మెఱింగి "నేఁడు దర్బారు నకువచ్చి నవాబుగారిని సందర్శింపవలసిన" దనిచెప్పి గృహాభిముఖుఁడై నడచినాఁడు. గోపన్న చిత్తమని సెలవుదీసికొని పరిచితుఁడైన వైష్ణవునింటి కేగి యతనితో నంతయుం జెప్పి భుజించి దర్బారుసమయము నెఱింగి తగిన వేషముతో రాచనగరి కరిగి రాముని ధ్యానించుచు నవాబు కొల్వుకూటముం జేరుకొనియె.

నవరత్నస్థాపితమై యున్నతమై విశాలమై కనులకు మిఱుమిట్లు గొల్పు కాంతులతో నలరారు సింహాసనమున నవాబు హుక్కా పీల్చుచు సురేంద్రునట్లు గూర్చున్నాఁడు. ఆయన ప్రక్కన సముచితాసనమున రెండవ బృహస్పతింబోలినమాదనామాత్యుఁ డుపవిష్టుఁడై యున్నాఁడు. మఱొకప్రక్కన నక్కన్నగారు రెండవ రుద్రుఁడువలె వెల్గుచున్నాఁడు. సామంతప్రభువులు, రాయబారులు, రాజకీయోద్యోగులు, నుచితస్థలముల నొప్పారుచున్నారు. రాజభటులు స్వస్వవ్యాపారములం దప్రమత్తులై యున్నారు. పాలితులువచ్చి తమతమకష్టనిష్ఠురములం జెప్పికొని

తృప్తికరమైన ప్రత్యుత్తరములొంది వెడలిపోయిరి. ఇపుడు హుక్కా గుడగుడధ్వనిదక్క మఱొండు శబ్దము చటం బుట్టుటలేదు. అట్టి సమయమున గోపన్నగారుత్తరీయమును నడుమునకు బిగించి వంగి సలాముచేసి వినయముట్టిపడ మాదన్నగారికిని నమస్కరించి తన్నిర్దిష్టాసనంబునం గూర్చుండి నవాబుగారి గుణగణములు నురుములోం బ్రశంసించుచుం దన వక్తృత్వము, పాండిత్యము, సౌజన్యము, ప్రభుభక్తి, వెల్లడించినాండు.

ఈగోల్కొండనవాబు అబూహాసన్ కుతుబ్ షాహ. ఇతడు కాంతాలోలుండు. మహాభోగియైనను ప్రజల కష్టనిష్ఠురముల విచారించుచుం గన్నబిడ్డలవలెం బోషించు ధర్మప్రభువైయుంటచే "తాన్ షాహ" అనంగా మంచిరాజు నాం బేర్వడసెను. తాన్‌షాహ పదమే తానీషా యయ్యెను. ఆంధ్ర బ్రాహ్మణుండగుమాదన్నగారికిం బ్రధానామాత్యస్థానము, నక్కన్నకు సర్వసైన్యాధిపత్యము నిచ్చి హిందూ మహమ్మదీయుల సమానగౌరవదృష్టి నరయుచుంటచేం బ్రజలెల్ల రతనిం బొగడుచుండిరి. ఆయన దైవభక్తి గలవాండుగూడ.

తానీషా గోపన్న ముఖవైఖరి, భక్తిలక్షణములు, ధైర్యసాహసములు, విద్యావాగ్మిత్వములు, పరికించి మిక్కిలి యలరి మాదన్నగారి నభిప్రాయగర్భితముగా నిరీక్షింప మాదన్న గోపన్నంజూచి నీ కేమికావలయు ననియడిగెను. గోపన్న చిత్తము-తమకొల్వు గావలయునన మాదన్న నవాబుగారి చెవిచెంత నేదియో చెప్పి తలద్రిప్పించి వెంటనే యొక ఫర్మానా వ్రాసి నవాబు

చేతి కొసంగ నతండు నవ్వుచు గోపన్నం దాపునకుం బిలిచి "భక్తవర్యా! మిమ్ము నరసినది మొదలు నా హృదయ మపరిమితానందము నందుచున్నది. మీరు మా కొలు వియ్యకొనెదరేని భద్రాద్రి తాలూకాకుఁ దహశీల్దారుగా నియమించెదము." అనుడు దేవరవారికృప యనుచున్న గోపన్నకు దస్కతుచేసి యధికారపత్త్ర మిచ్చి 'మీ విధిని మీరు సక్రమముగా నెఱవేర్చుకొనెదరని నమ్ముచున్నాము' అనఁ జిత్తమని భయవినయములతో దాని నందుకొని కంట నద్దికొని వంగి సలాము చేసెను.

అంత నగారా మ్రోత విని నవాబు కొలువు చాలించి యభ్యంతరమందిరమ్మున కరుగ మాదన్నగారికి గోపన్న నమస్కరించి సముచితసంభాషణలం దేల్చినాఁడు. అమాత్యుఁడును నతని బుద్ధికుశలతకు సంతసించి ముద్రాదు లొసంగి ప్రవర్తింపవలసిన పద్ధతులం గఱపి యుచితవిధి నంప నతండు తన గురువుగారి బంధు వగు నవ్వైష్ణవు నింటికరిగి సర్వము నివేదించినాఁడు. అయ్యుభయుల సంతోషలహరుల కొడ్డు దగులలేదు.

మఱునాఁడు గోపన్న యాగేస్తునకుఁ గృతజ్ఞతాపూర్వకముగా నమస్కరించి పయనమై భద్రాద్రిఁ జేరి గౌతమీపూతవారి సుస్నాతుఁడై సీతారాములవారి సందర్శించి సంజాతకౌతుకంబున సర్వ వృత్తాంతము నివేదించినాఁడు. పిమ్మట బుత్త్రవతి యగు కళత్రముఁ బిల్పించుకొని యుద్యోగము స్వీకరించి రామకైంకర్యమున కిది తోడగునని తలంచి ప్రజల నలజడి వెట్టక

యతిథ్యభ్యాగతులఁ బూజించుచుఁ జుట్టపక్కముల గౌరవించుచు సీతారాముల ధ్యానించుచు రైతుల కష్టసుఖముల విచారించుచుఁ గాలము గడపుచున్నాఁడు.

> సిరి దా వచ్చిన వచ్చును
> సలలితముగ నారికేళ సలిలముభంగిన్
> సిరి దాఁ బోయినఁ బోవును
> కరి మ్రింగిన వెలగపండు కరణిని సుమతీ!

ఎవఁడైనను నధికార మున్నపుడు మంచివాఁ డన్నపేరు గడింపవలయును. అపకారముచేయ నవకాశమున్నను జేయనివాఁడు, నుపకారము చేయవీలున్నపుడు చేయువాఁడుగదా సద్గుణుఁడు? ఏది చేయుటకును నవకాశము లేని నిరుద్యోగిని మంచివాఁడనుట తన వివేకశూన్యతం దెల్పుఁగాని వాని నైజస్వభావముం దెల్పదు. అపకారోపకారములు నిరుద్యోగి యెట్లు చేయఁగలఁడు?

ఇదివఱకుకంటె నిపుడు గోపన్నను మంచివాఁడనుటలో నర్థమున్నది. చేతినిండ నధికారమున్నది. భద్రాచలము తాలూకాకుఁ దాను సర్వాధికారి. తనక్రింద నెందఱో యుద్యోగు లున్నారు. ఎందఱో ప్రజ లున్నారు. ఎన్నియో వ్యవహారము లున్నవి. వానివానిఁ జక్కఁబఱచుటలోఁ జాకచక్య మున్నది. వివాదములలోఁ దీర్పు లీయవచ్చుఁగాని న్యాయనిర్వహణము చేయవలయును. అధికారము చెలాయింపవచ్చుఁగాని ధర్మమునందు దృష్టి నిల్పవలయును. పన్నువసూలుచేయుట పాడియేకాని పైఁపడకున్నఁ బరికింప

వలదా ? ఆక్రమణలు చేయకుండ నదుపాజ్ఞలలో నుంచుట యధర్మము కాదుకాని యనదల లేమిని నరయవలదా ? తన వ్రాఁత చెల్లుబడి యగునని చీటికిమాటికిఁ జిన్న నేరమునకును గ్రామాధికారుల నుగ్రదండనమునకుఁ బాల్పరుప వచ్చునా ? తనకు లోఁబడినవారుగదా యని కోరికోలఁది బ్రువ్వఁ దిట్ట వచ్చునా ? తనకు నౌకరులుగదా యని రేయనక పవలనక పనిగొనవచ్చునా ? గోపన్న యెట్లు పరిపాలన మొనర్చెనో కాని యందఱుఁ జేమెత్తి మ్రొక్కువారే. అందఱు మంచి మహారాజని కొనియాడువారే. కాదామఱి?

ఎవఁడు తనపొట్టకై కాక ప్రజలకొఱకై తా నుంటినని తలంచునో యాయుద్యోగి నందఱు నగ్గింతురు. ప్రజను దనకుటుంబముగా నెంచుకొనువాని నెవరు కొండాడరు? ఇట్లు గోపన్నగారు భద్రాచలము తాలూకాను ధర్మముగాఁ బాలించుచుఁ బ్రజలకుఁ దలలోని నాల్కవలె మెలఁగుచుండెను. కొంత కాలము గడచెను. చదువరులారా ! ఈప్రకరణముఁ ద్రిప్పుటకు మున్నొక విషయమును మీకుఁ జెప్పనిచో సంశయము మిమ్ము బాధించును. ఏది యది ? గోపన్న మాదన్నగారి మేనల్లుఁడుగాఁడా ? చూతము.

1760 లోనున్న తిమ్మజగపతి యాస్థానపండితుఁ డగు నేనుఁగు లక్ష్మణకవిగారి తుల్యామాహాత్మ్యమున—

సీ. సుల్తనబ్దుల్ హసన్ క్షోణీశ్వరునిచేత మాటిమాటికి బహుమానమందె
మఱియును బింగళిమాదన్న భానుజీ మంత్రజ్ఞులవలన సమ్మానమందె

అక్కన్న మొదలైనయట్టి పెద్దలచేత మేలుభూషణములు మెప్పులందె అని యుండుటవలనను—

“సుల్తాన్ శహాబహద్దరు అబ్దుల్ హాసన్ అనేప్రభువున్ను పింగళి మాదన్నగారున్ను విశేషమైన బహుమతీలున్ను జగపతి అనే బిరుదనామమున్ను ఇప్పించినారు.”

—వెద్దా- సం.

అని కిమ్మాపుసీమ కైఫీయతులో నుండుటవలనను మాదన్నగారి యింటిపేరు పింగళివారనుట స్పష్టము.

“శ్రీ ఖిలాపస్తంబ సూత్రు గౌతమగోత్రు సుచరిత్రుండు పింగళి సూరసుకవి”

అని కళాపూర్ణోదయమందుఁ గలదుగదా? కనుక మాదన్న గారిదికూడ గౌతమగోత్రమైయుండునా? కీర్తిశేషులైన కె. వి. లక్ష్మణరావుపంతులుగారు పురాతనగ్రంథములఁ బరిశోధించి మాదన్నగారిది భారద్వాజగోత్రమని తెలిసికొంటిమని మహమ్మదీయ మహాయుగమున వ్రాసియుండిరి గాన సూరన మాదనలు భిన్నగోత్రజులు.

‘అక్కన్నమాదన్న లార్వేల నియోగులనియు, వారియింటిపేరు పింగళివారనియు, వారివంశికులగు పింగళివారును సిద్దలూరివారును నిప్పటికి నున్నారనియు, వారికి గోలకొండ వేపారులతో సంబంధబాంధవ్యము లున్నవనియు సాక్ష్యముగ తెలియుచున్నది. (See: Local Recards, Mackenzei) (పె-సం. వి)

ఈరికార్డును మనము నమ్మవలసినదే. కనుక మాదన్న యార్వేల నియోగి. నేటికిని బింగళివా రార్వేలనియోగులలోనే కలరు.

ఇతరశాఖలందు లేరు. వారు భారద్వాజగోత్రజులే. నేను వారితోను మాట్లాడితిని. గోపన్న యాదిశాఖవాఁడు గాన మాదన్నకు మేనల్లుఁ డెట్లగును?

మేనల్లుఁడే నైనచోఁ బైకము చెల్లించిన వదలిపెట్టెదనని తానీషా యనెం గాన రామదాసునకుద్యోగమిప్పించినవాఁడును, మహోదారుఁడును, మహైశ్వర్య విరాజితుఁడును, మహామేధావియు, నగు మాదన్నగారు పైకముచెల్లించి కాని లేక యేదేనివిధమున నవాబుతోఁ జెప్పి కాని తన మేనల్లుని జెఱవిడిపింపక మానుచుండునా? పైఁగాఁ జెఱలో నన్నికష్టములు పడుచుండఁ జూచి సహించుచుండఁగలఁడా? ప్రధానామాత్యుని మేనల్లునే సేవకు లన్నివిధముల హింసలు పెట్టఁగలరా? ఈచెఱ మేనమామకుమాత్రము గౌరవప్రదమా? ఏమి సందు దొరకునా యని వేచియున్న యిబ్రహీము మున్నగువారీసమయమందు మాదన్న యుద్యోగమునకును భంగము గలిగింప నవాబునకుఁ జాడీలు చెవినాటఁ జెప్పకూఱకుండురా? గోపన్నను జెఱనుండి విడిపించినను, విడిపింప కూఱకున్నను గూడ మాదన్నగారి కమాత్యస్థానమున కీసూచకులవలన ముప్పు తప్పక వచ్చెడిదే. అట్లు జరుగలేదు. కాన నీ చుట్టఱికము నమ్మరానిది.

అసలీ కల్పన యిటీవలఁ బుట్టినది. ఒక రామదాసుచరిత్ర హరికథలో నిది లేనే లేదు. అది వరదరామదాసుగారు ౧౮౩౧-౧౮౩౮లో వ్రాసినది. ఇప్పుడు ప్రచారములోనున్న హరికథ

సింగరిదాసు కూర్చినది. మఱొక రామదాసుచరిత్రలో నిట్లు కలదు. "అక్కన్న మాదన్నయు నని యిద్దరు నన్నదమ్ము లతిప్రియులు." ఈ సోదర్యమును గొంద ఱొప్పుకొనలేదు. మఱియు నందే—

కం. అనఘుల శాస్త్రవిధిజ్ఞుల
ననురక్తులఁ బితృపితామహక్రమమున వ
చ్చినవిప్రుల మంత్రులుగా
నొనరించెను గార్యసంప్రయోగము కొఱకున్.

అని కలదు.

అక్కన్న సర్వసైన్యాధ్యక్షుఁడు. మాదన్నమాత్రము ప్రధానామాత్యుఁడు. మఱియు వీరి తండ్రితాతలు మంత్రులైనట్లు నిదర్శనములు లేవు. మాదన్నగారి మంత్రిత్వము పిత్రార్జితము కాదు. తానీషాకుఁ బూర్వమున్న సుల్తానుదగ్గఱ మీర్ జుమ్లా దివానుగా నుండి గడబిడ చేసినట్లున్నది. కాని మాదన్న తండ్రి యున్నట్లులేదు.

మఱియు నాగ్రంథమందే "హైదరాబాదున మేనమామలు అక్కనమాదనగారు......" కలరనియు

కం. మామలు మంత్రులు నాకును
నే మచ్చికఁ జూడఁగోరి యిటువచ్చితి మా
మామల కెఱిఁగింపుఁడని
వేమరు వేఁడెదనటంచు వెస వచ్చి తమిన్.

... ... ... ... —అనియు,

తెప్పునలేచియు నెదురుగవచ్చిరి యప్పసుతునిఁ జూడ
అప్పు డపరిమిత సంతోషంబున గప్పినమోహముతోడ
వందనములు చేసినతమయల్లు నవార్యమైన కృపతోడన్
సుందరాంగ రమ్మని యక్కున నరుదంపఁ జేర్చి వగతోడన్

అనియుఁ దమ తల్లి మృతిని గోపన్న చాటఁగా—

... ... ... ... ... మమున్
'ఘనదుఃఖంబున ముంచి నీవరిగితే కామమ్మ యేమన్న......'

అని యక్కన్న మాదన్న లేడ్చినారనియుఁ గలదు.

ఇదియంతయుఁ గవికల్పనా విశేషముకాని సత్యముకాదు.

"పోర్చుగీసువారి గ్రంథానుసారముగాఁ బ్రకటింపఁబడిన ఆర్కి-లాజికల్ రిపోర్టులో దాసుగారికి నక్కన్నమాదన్నగార్లకు సంబంధము లేనట్లు వ్రాయంబడియున్నది" అని బ్రహ్మశ్రీ కా. బ్రహ్మయ్య శాస్త్రిగారును పెద్దాపుర సంస్థాన చరిత్ర విమర్శనమున వ్రాసియుండిరి. కనుక గోపన్న మేనల్లుఁడు కాఁడని తలంచుట సమంజసముకాదా ?

# ఐదవ ప్రకరణము

చదువరులారా! భక్తులకు భగవత్కథల యందు విసువుండదు గదా? అవధారు. రాముఁడు భద్రగిరిపై నేలయుండెనో వచించెదను.

## భద్రాచలము

మాహాత్మ్యము బ్రహ్మాండపురాణమునందు గౌతమీ మాహాత్మ్యమున నిట్లు కలదు.

ఏ మహోన్నతాకారుశిఖర భాగంబున స్వర్గంబును, పాదతలంబునఁ బాతాళంబును, మధ్యంబున మర్త్యంబును, భాసిల్లుచున్నదో- ఏ మహానుభావుఁడు త్రిపురసంహార కార్యంబున లలాటేక్షుణునకుఁ జేదోడై నిల్చెనో-యట్టి మేరుమహీధరేంద్రునకుఁ జిరకాలము వఱకు సంతతి కల్గదయ్యెను. అక్కతన నతండు ఘోరతపం బొనర్చి చతుర్ముఖుండు చక్షుర్గోచరుండై వరం బడుగుమను డతండు నమస్కరించి స్వామీ నాకు భగవద్భక్తుం డగుపుత్రు నిమ్మని కోరఁ నలున వల్లెయని యంతర్ధానుం డయ్యెను.

త్రేతాయుగమున రావణాది దుష్టరాక్షససంహార మొనర్చి శిష్టుల సంరక్షింప బ్రహ్మేంద్రాదులు ప్రార్థింపఁగా శ్రీమన్నారాయణుం డయోధ్యాపతి యగుదశరథమహారాజున కగ్రమహిషి యగుకౌసల్య యందు శ్రీరామచంద్రుఁడై యవతరించెను. మఱియుఁ గైకకు భరతుండును, సుమిత్రకు లక్ష్మణ

శత్రుఘ్నులును, దివ్యాంశములవలన జనించిరి. రామలక్ష్మణులు జంట. భరతశత్రుఘ్నులొకజంట. రామునియందుఁ దమ్ముల కత్యంత భక్తిశ్రద్ధలు కలవు. రామునికథ నెఱుఁగని వారెవరు ? అయిన నిది చదువుఁడు.

సీ. తాటకమర్దించి తపసిజన్నము కాచి
హరువిల్లు విఱిచి వైర్యమున మెఱసి
ప్రబలులైనట్టి విరాధకబంధోగ్ర
ఖరదూషణాది రాక్షసులఁదునిమి
వానరవిభుఁ జేరి వాలిఁ గూలఁగఁ జేసి
జలరాశి గర్వంబుఁ జక్కఁజేసి
సేతువుబంధించి చేరి రావణకుంభ
కర్ణాదివీరులఁ గడిమిఁ ద్రుంచి
అల విభీషణు లంకకు నధిపుఁ జేసి
భూమిసుతఁగూడి సాకేతపురమునందు
రాజ్యసుఖములు గైకొన్న రామవిభుఁడు
వసుస ననుబ్రోచుచుండుఁ బ్రవాసగతుల. భాగవతము

శ్రీరామచంద్రమూర్తి పితృాజ్ఞాపరిపాలనమున కడవులకేగి సీతాలక్ష్మణసమేతుఁడై చరించుచు నొకనాఁడు బడలికచెంది విశాలమైనట్టి, సుస్నిగ్ధమైనట్టి, శిలాఫలకమ్మునఁ గుతుకమ్మున విశ్రమించి తన శ్రమమ్ము వోఁ జెమ్మెనని మనమ్మున ముదమ్ము వొంది "ఓ పాషాణమా! నీవు మాకొనర్చిన యీ సుకృతవిశేషమ్మున మేరుధరేశునకుం జనించి మా కత్యంతభక్తుండవయ్యెద వని యానతిచ్చెనఁట! ఆకారణమ్మున నాపాషాణమ్ము మేరు

కళత్ర మగుమేనకయందు శైలాకారమ్మునఁ బ్రాదుర్భవించి భద్రుం డనునభిఖ్య నొందె.

పిదప నతండు కొంతకాలమునకుఁ దపంబొనర్చి రాముని బ్రత్యక్షము చేసికొని 'స్వామీ! అనారతమ్ము మిమ్ము నెత్తిపైఁ బెట్టికొని సేవించున ట్లనుగ్రహింపవలయు' నన శ్రీరామచంద్రుండు వల్లె యని 'ఓ భద్రా! భానువాసరమ్మున గౌతమీతరంగిణి స్నానానుష్ఠానమ్ములు సలిపి ముమ్మారు నీకుఁ బ్రదక్షిణమ్ము చేసిన జనులు మల్లోకంబునకు వచ్చెదరు. నీవు కల్పాంతమందు మత్సాయుజ్యము నందెద'వని యనుగ్రహించి యాభద్రుని శిరోభాగమందు ధనుస్తూణీరధరుండు సీతాలక్ష్మణసమేతుండు నై నిలిచె. చదువరులారా! రాయి యెక్కడ! తపమెక్కడ! ఇట్టిమాటలు మేము నమ్మమని మీ రనవచ్చు. నా దొకమనవి. చైతన్యబ్రహ్మము స్థావరజంగమాంచితసర్వబ్రహ్మాండభాండమందు నిండియుండె ననుట మఱువకుఁడు. ఆహారనిద్రాభయాదులు మనుష్యులకుం బోలె పశుపక్షికీటకాదులకుం గలవనుట సర్వవిదితము. అట్లయ్యు నవయవములు తుల్యములుగా నున్నవా? మన చర్మచక్షుస్సులకు గోచరింపనియంతమాత్రమున నమ్మమనుట భావ్యము కాదు. వానివానికిం దగిన యంగాదు లుండితీరును. ఇప్పుడిప్పుడు "బోసు" మొదలగు పండితులు తీఁగలకును బ్రాఁకులకునుగూడ నిద్రాభయసంతోషాదులు కలవని కనిపెట్టి యంత్రములద్వారమునఁ జూపుచున్నారుగదా? నమ్మితిరా? లేదా? నిన్నమొన్నటివఱకు రాముఁడు విమానమెక్కిపోయెనన

గేలిసేసితిరిగాదా? నేఁడు విమానము లున్నవనిన నమ్మరు గాఁబోలును?

మఱియుఁ జీవుల భావను వైకతండ్రి యెఱుఁగునఁట! మృగముల భాషను యయాతి యెఱుఁగునఁట! కనుకఁ బరిశోధింపఁ బరిశోధింప నింక నెట్టి యత్యద్భుతములు బయల్పడునో? కాఁబట్టి మానవావయవములకుం గన్పట్టనంతమాత్రమున స్థావరముల కవయవాదులు లేవనుకొను టెట్లు?

## దమ్మక్క

భద్రగిర్యుపత్యకయందుఁ దొట్టతొలుత నొక చిన్నయిల్లు కట్టఁబడెను. దానిం జూచి మఱొకటి. పిదప నింకొకటి. క్రమముగా గ్రామ మేర్పడినది. భక్తులు రామసన్నిధాన భాగ్యమును త్యజింపఁగలరే? అదియే భద్రాచలము. అందుఁ బూర్వము తమ్ముల దమ్మక్క యను నొక వయసుచెల్లిన భక్తురాలు గలదు. ఆమె రామకోటి వ్రాయుచు రామోచ్చారణమున బియ్యపుగింజల నేరుచు నిరంతరము రామస్మరణము చేయుచు రాముని నమ్మియుండెను.

ఒకనాఁ డామెకు రాముఁడు స్వప్నగోచరుండై "ఏతద్గిర్యుపరితలమున నుంటి" నని కొన్ని చిహ్నములం జెప్పి యాలయ మొండు నిర్మింపించుమని యాదేశించి యదృశ్యుఁ డయ్యెనఁట! ఆమె యులికిపడి మేలుకొని పరిసరవర్తుల కయ్యుదంతము విన్పింప వారంద రాశ్చర్యనిమగ్నులై యాథార్థ్యము నరయుదముగాక యని తచ్చిహ్నముల నన్వేషించుచు నా తిప్పపై

నొకచో లతాగుల్మముల మధ్యమున సీతారామలక్ష్మణ విగ్రహములం దిలకించి ప్రహర్ష పులకితాంగులైరి. సాష్టాంగ నమస్కృతు లాచరించిరి. భక్తిరసమునఁ దేలియాడిరి. భగవన్మహిమముల కబ్బురం పడిరి. దమ్మక్క యదృష్టమును గొండాడిరి.

పిమ్మట వారందఱు స్వస్థలమునకు వచ్చి యొండొరులఁ బ్రోత్సహించుకొని యథాశక్తి ధనమర్పింప దమ్మక్క యాధనముతోఁ చిన్నగర్భాలయమ్ము కట్టించి యావిగ్రహములఁ బ్రతిష్ఠించి నిత్యనైవేద్య దీపారాధనాదు లాచరించుచుండె. నాఁడు మొదలు నేటివఱకు భద్రాద్రిరాముఁడు శరాసనతూణీర ధరుండై భక్తాభీష్టప్రదాయకుండై సర్వజనసంసేవ్యుండై యున్నాఁడు.

అంతఁ గ్రమముగా నారామగర్భాలయము జీర్ణదశను బొందినది. దానిని బునరుద్ధరించి గొప్పకోవెల నిర్మించి ధ్వజంబెత్త నలయునని గోపన్న సంకల్పించుకొని యొకనాఁడు రైతుల నందఱ రప్పించికొని భక్తినిగూర్చియు ధర్మకార్యములఁ గూర్చియు నుపన్యసించి యిట్లనియె.

గేయము

పొయ్యేటప్పుడు వెంటరాదు-ఒక పుచ్చినవక్కైన
వెయ్యారులు దాఁచుకొనియు నర్థుల-కియ్యలేని లోభుల కయ్యయ్యో
ఇచ్చినమాత్రం బిమ్మను దైవము-హెచ్చుఁడిగినరాదు
వచ్చేటప్పుడు వెంటనేమయిన-దెచ్చుక రాలేదు.
... ... ... ...

# ఐదవ ప్రకరణము

ఇరవుగఁ దొలిజన్మంబులఁ బేదల కియ్యని దానముఁ
దిరిపెము లెత్తెడి వారినిఁ గాంచియుఁ దెలియక యున్నారు.

అని ధర్మాసక్తిని గలిగించి మన పాపములు కొండలకొలఁది యెన్నిజన్మములనుండియో పేరుకొనియున్నవి. ఎంతకాల మిట్లు పుట్టుచుఁ జచ్చుచు వాని ననుభవింతము? ఆ పాపరాశి నొక్కుమ్మడి నిర్మూలింప వలదే? బ్రహ్మహత్యాది పంచ మహాపాతకములేమి వాచిక కాయిక మానసిక దుష్కలుషము లేమి యన్నియు దేవాలయ నిర్మాణవశంబునఁ బటాపంచలై తూలిపోవును. కనుకఁ దత్కార్యమున మీరు నాకుఁ దోడ్పడ వలయును—అన నందఱు అదిలెస్స. అట్లే యథాశక్తిఁ దోడ్పడెద మనిరి.

గోపన్న తత్క్షణమున దక్షులైన తక్షకాదులఁ బిలిపించి యాలయ నిర్మాణమునకు నియోగించెను. కాఁపులు తమ తమ శకటములతోడ వచ్చి యుచితకార్యము లాచరించుచుండిరి. భృతకుల కవ్వారిగా ధనమిచ్చుటవలన నొక్కొకప్పుడు రాజ ధనమును వ్యయపఱుపవలసి వచ్చుచుండెను.

గోపన్న ప్రథమమున నవాబుసొమ్ము (సిస్తు) నంటఁగూడదని తలంచెనుగాని రామభక్త్యతిశయమువలనఁ గార్యావసరముల కొలంది తప్పనిసరి యయ్యెను. చందాలమూలమున వెంటనే ధనముం గూర్చి సాలాఖరున నవాబుగారి కంపవచ్చునులెమ్మని ధైర్యము వహించినాఁడు. చందాలు వేయించుచున్నాఁడు. వసూలు చేయించుచున్నాఁడు. వ్యయము సల్పుచున్నాఁడు. ఎండయనక వానయనక పవలనక రేయనక తిరుగుచున్నాఁడు.

ఆఁకలిదప్పులనే మఱచినాఁడు. చెంతనుండి ప్రతిపనిని జేయించు
చున్నాఁడు. కరణములందఱు గొప్పకాఁపులనొప్పించి కాగి
తములపై వేయుఁడు. ఇచ్చునపుడు చూచుకోవచ్చునని పది
చోటవంద-వందచోట వెయ్యి-వేయించుచున్నారు. నవాబు
పైకము వ్యయముచేసినంత చందాపట్టికలోఁ బడినది. గోపన్న
చూచి వసూలు చేయలేకపోదునా? అనుకొన్నాఁడు.
రాముఁడు తోడ్పడఁడా? పోనీ యంత కరుణమానిన నా
ప్రయత్నమేమిసాగును? ఈశ్వరు నాజ్ఞలేనిది చీమయుఁ గుట్ట
దందురు. ఏమాపనయు రాముని కెఱుకలేక నాకేలా సాధించునని
తలంచుచున్నాఁడు. అది యెంత భక్తియో! ఉద్యోగమిచ్చి
నది రాముఁడు. ఈపని చేయించుచున్నది రాముఁడు. రాముఁడు
నాకేల యుండగాలేఁడు? అని తలంచును. ఒక్కొక్కప్పుడు
నే నీ యుద్యోగమునఁ జేరినదీపని కేగదా? అది తీర్చుకొన్నపిదప
నే నెట్లైననేమి? యని భావించును. నక్తందివము పని సాగు
చున్నది. క్షణికవారము నిదర్శనముగాఁ గన్పించుచున్నది.
శూన్యమునఁ బదార్థము గోచరించుచున్నది. పదార్థము భాస
మాన మగుచున్నది. స్థలాభోగము - శిలాభోగ మన్నట్లు భద్ర
గిరి యిప్పుడు కన్నులపండువుగా నున్నది.

"కలియుగవైకుంఠము-భద్రాచలనిలయము-సేవింత"మని ప్రజల
మేల్కొల్పినది. సీతారామస్వామి దేవాలయము తయారైనది.

గేయము

కాంచనసౌధములు-వానికి కెంపు-మించిన దూలములు-ధ్వజములు చె
క్కించిన స్తంభములు-పగడములని భ్ర-మించగ ద్వారములు-

ఆచయాన మఱి యెంచలేనుగదె - మంచిపచ్చలుగూర్పించిన వాకిండ్లు-
—కలియుగ వైకుం

బంగారుగోపురములు-కోవెలలు వెలుంగు మాణిక్యములు-భేరీమృ
దంగాదివాదములు-భాగవతుల సంకీర్తనలు-
రంగైనకల్యాణరత్న మండపముల-శృంగారమేమని చెలియ విన్నవింతు-
—కలియుగ

మఱియు నేమైనం గానిమ్మని ధైర్యమువహించి రామదాసు తహసీల్ పైకముతో వివిధధాన్యములకుం గొట్లు, గుడిబ్రాయస కాండ్రకుం గచేరీలు, నన్నదానమునకుం బచనశాలలు, నుత్సవములకుం దేరులు, వాహనములు, నేర్పఱచెను. రామునకుం బలుదోము నెలవులు, పన్నుండుతలములు, పాన్పుచోటులు, దిరముకొల్పెను. ఉత్సవవిగ్రహములం జేయించె. తనకీర్తికి ధ్వజముగా గొప్ప ధ్వజస్తంభమును స్థాపించెను. పదివేలవరహాలు వెచ్చించి ప్రాకారమును, పదివేలవరహాల పచ్చలపతకమును భరతునకు, పదివేల మొహరీల మొలత్రాడు శత్రుఘ్నునకు, పదివేల వరహాల ముత్యాలపతకము లక్ష్మణునకు, పదివేలవరహాల చింతాకు పతకము సీతమ్మకుం, జేయించెను.

మఱియు పూర్వప్రతిష్ఠిత మూలవిరాడ్విగ్రహమును గదలింపజంకి ఉత్సవవిగ్రహముల నెలకొల్పి యితరదేవతాప్రతిష్ఠ లాచరించి మహావైభవముతోం జైత్రశుద్ధప్రతిప త్తిథి మొదలుకొని బ్రహ్మోత్సవంబు సాంగంబుగ సాంతంబుగం బాంచరాత్రోక్త ప్రకారంబున జరిపించి నవమినాండు సీతాకల్యాణమును గావించి యెన్నియో గ్రామములనుండి వచ్చిన వివిధవర్ణములవారి కవ్వారిగా షడ్రసాన్నములను బెట్టించుచుండెను. వందువారు

వడ్డించువారు, తినువారు ,లేచువారు, జనము సందులేక నిండి యుండెను. స్వామికార్యమునఁ బాల్గొన్నఁ బుణ్యమువచ్చునని యెంచెనో మరియు నేదో యొకపనిని సముత్సాహంబున సల్పుచునే యుండెను.

పుత్త్రుఁడు పునర్జీవితుఁ డగుట.

గోపన్ననోట 'లేదు' అనుమాట వినరాదు. అంత నిర్భాగ్యుఁడై నను నాబ్రతము నాచరించుచుండె. తనకై యొకరిని "దేహీ" యనియుం జెయి సాపఁడు. కనుక నన్నదాన మవ్వారిగా సలుపుచు నన్ని వర్ణములవారిని సంతుష్టులం జేయుచుండె. ఇట్లుండగా నొకనాఁడు దశసహస్రాధిక బ్రాహ్మణమున కన్నము వడ్డించుచుండిరి. పచనశాల కలకలలాడుచుండెను. ఎక్కడఁ జూచిన నేల యీనినట్లు జను లుండిరి. అట్టియెడ గోపన్న కొడుకు పారాడుచుం బోయి లోతయిన గంజిగుంటలోఁ బడెను. ఎవరి పనిలో వారుంటచే నెవరుం జూడలేదు. "జయ రమారమణ గోవిందా హరి" యని బ్రాహ్మణు లాపోశనించిరి. దాసుగారిభార్య యగు నాదెమ్మ వడ్డించుచు వెలుపలికి వచ్చి చేతులు గడిగికొనుచు గంజిగుంటవైపు చూచి శిరోజములు గన్పింప వేగిరపాటుతోఁ జెంత కేగి పరికించి మేను గడగడ వడకుచుండఁ జిఱుచెమటల కేల్దోయితో బాలునిఁ బైకెఁ దీసి తా నేడ్చినచో బ్రాహ్మణాపరాధము చేసినట్లగునని తలంచి ప్రాణములు బిగపట్టుకొని యా బాలశవమును భుజమున వైచుకొని పోయి యొక గదిలోఁబడి కంటికిం గడివెడు నీరు గాఱ నీరవముగా నేడ్చుచుండెను. నెమ్మదిగా సంతృప్తిగా

యథేచ్ఛముగాఁ గంఠదఘ్నముగా భుజించి గోవిందలు గొట్టు కొనుచు గట్టున ద్రేఁపుచు బ్రాహ్మణ ముత్తరాపోశనము పట్టి పదిలముగా లేచెను. దాసుగారు సదక్షిణమ్ముగ పూగీఫల కర్పూరాది ద్రవ్యసహితమ్ముగ నగుతాంబూలమ్ముల నిప్పించునప్పు డార్తనాదమ్ముగ వినవచ్చెను. జనులు చుట్టు మూగిరి. "అయ్యో! అయ్యో! ఎంత దారుణము! ఎంత పాపకాలము! అట్టి భక్తునకా యిట్టి చెట?" అనుచుం బరిపరివిధములం దలంచుటవలన నమ్మహారావము రేగి దిక్కుల వ్యాపించి గోపన్న నాహ్వానించెను. అప్పారుండు నివ్వెఱపడి డాయం జని తన యేకైకపుత్త్రుఁడు మృతుండగుటచేఁ గన్నుల నీరు కాల్వలు గట్ట నించుకసేపు శోకించి యంత ధైర్యమువహించి తెల్విదెచ్చుకొని యబ్బాలశవముఁ బైనివేసికొనిపోయి శ్రీరాము ముందటంబెట్టి "శ్రీరామచంద్రా! నీ మాహాత్మ్యము దిగంత ముల మాఱుమ్రోగునట్లు సల్పుటకే నాకీ యాపద గల్పించితి వని యెఱింగితి. ఇఁక నాలసింపనేల? తొల్లి మృతుండగు విప్రనందను బ్రదికించినట్లు నేఁడు నాపుత్త్రుని బ్రదికించుము.

కీర్తన.

కోదండరామ కోదండరామ-కోదండ మాంపాహి కోదండరామ

... ... ... ... ... ...

ఏబుద్ధి వీఁడు ఎఱుఁగనివాఁడు-పాపఁడు వీఁడు-బడలియున్నాఁడు
పాపని లేపి-బాధలఁజోపి- ఆపదబాపి-యటు బ్రతికింపు ॥కోదం॥

... ... ... ... ... ...

రావయ్య వీని-రక్షింతుగాని - సేవించు వాని-స్థితి గందుగాని॥కోదం॥

అని యన్నేనిగతుల వేఁడుకొన నమ్మృతబాలుండు సుప్తోత్థి

తుండుంబోలెఁ గనులువిచ్చె. చైతన్యము వచ్చె. లావణ్యము హెచ్చె. మాటాడఁజొచ్చె. కాలుటచే బొబ్బలుపోయి వ్రణమయముగా నున్న శరీరమంతయు క్రమముగా నెప్పటియట్లయయ్యె. రాముని కసాధ్య కార్యములుగలవా ? నోళ్ళు తెఱచికొని యాశ్చర్యచిత్తులై చూచుచున్న జనులు భళీ ! రామదాసా! నీవ నిక్కమగు భక్తుఁడవు. నీ సుకృతాతిశయముఁ బొగడఁ దరముగాదు- అని పరిపరివిధములఁ బొగడిరి. నమస్కరించిరి. పాపహారమగునని పాదముల నంటిరి. కౌఁగిలించుకొనిరి- అని వ్రాయవలయునా ? నెలంతలు దాసుగారి భార్య యుచితజ్ఞతకు, ధైర్యమునకు, నోర్పునకు మెచ్చుకొని నవరత్నములన్ని యొకచో, నత్తగుల్లలన్ని యొకచో, నుండునని యామెం బొగడి నమస్కరించి పోయిరి.

సంకల్పించుకొన్నట్లు రామాలయ నిర్మాణకార్యము ముగిసెను. అదృష్టచర మశ్రుతపూర్వమని యెల్ల రబ్బురంపడ సుతుఁడు పునర్జీవితుఁడై నాఁడు- అని గోపన్న తలంచుచుండఁ గొందఱుపౌరులువచ్చి "రామదాసా ! తహసీల్ సొమ్మును వ్యయముచేసితివి. రాజుల చెల్ములు, పాముల చెల్ములతోఁ దుల్యములని యెఱుంగవా? చూపోషనివారు నీపైఁ జాడీలుచెప్పి తానీషా కాగ్రహము కల్గించెదరు. కనుక సొమ్మును దయారు చేసికొమ్ము." అన దాసు కానిమ్మంతకు రాముఁడేయున్నాఁడు.

...

కీర్తన

తక్కువేమి మనకు రాముం డొక్కఁడుండు వఱకు- అనిపాడుచుండెను.

# ఆఱవ ప్రకరణము.

సితారా గోల్కొండ నవాబైన తానీషా భార్య. ఈమె పూర్వపు సుల్తానైన "అబ్దుల్లాహుసేన్ కుతుబ్ షా కొమార్తె. మిక్కిలి చక్కనిది. ఈసుందరి హిందువులయందు ద్వేష భావముగలదై సమయము లభించినపుడెల్ల వారి నడఁగఁ ద్రొక్కఁ జూచుచుండెను. ఐనను మహామాత్యుఁడగు మాదన్నగారి యనుపమాన ప్రజ్ఞాబలమునకును ధర్మాత్ముఁడగు భర్తృ సమదృష్టికిని భయంపడుచునే యుండెను. సర్వసేనాధ్యక్షుఁడగు నిబ్రహీమ్అను నొకమహమ్మదీయుఁడీమె యాలోచనముల నెఱవేర్చుచు మాదన్నగారికి సైత మపాయముం గల్గింపఁదలంచి "నీలీలావిలాసములఁ గామదాసుఁడగు తానీషాను బ్రముగ్ధునిం జేసి హైందవద్వేషిగాఁ జేయుమ"ని సితారాకు బోధించుచుండెను. ఇతఁడు భద్రాద్రితాలూకాధికారము ఖాళీయైనపుడాస్థానమును మహమ్మదీయునికిమ్మని పట్టుపట్టి నవాబును గోరె. సితారాయు నొకదినంబునఁ బ్రణయకలహాంతమునఁ గోరెను. కాని తానీషా యిట్టి పక్షపాత ముచితముగాదని యోజించి యా హైందవస్థానమును మాదన్నగారి యిష్టప్రకారము రామదాసున కొసంగి యుచితవైభవముతో నంపెను.

### గోపన్నను రాముఁడు వ్యాఘ్రాకారమునఁ గాపాడుట.

గోపన్న మహావైభవముతో భద్రాద్రి కేగుచుండెనని సితారా విని యోర్వలేక దురాగ్రహాగ్రస్తయై యిబ్రహీమును

బిలిపించి కొందఱు తస్కరుల నంపి మధ్యేమార్గమున రామ దాసుం జంపింపు మని యాదేశించెను.

ఇబ్రహీము వల్లె యని కఠినచిత్తులం గాలాయసతుల్యాకారుల దీర్ఘదండహస్తులం దననచ్చినభటుల నంప వారు ఘోరకాంతార మధ్యప్రదేశంబునం దారసిల్లి రామదాసు నరికట్టిరి. అప్పుడు రామదాసుగారు నిర్విఘ్నచిత్తుండై చేయునది లేక—

శ్లో॥ ఆపదా మపహర్తారం దాతారం సర్వసంపదాం
లోకాభిరామం శ్రీరామం భూయోభూయో నమామ్యహం॥

ఆపదలం దొలంగించి సంపదల నిచ్చు నయనానందకరుండగు రాముని కెన్నియో నమస్కారములు. అని పెక్కు చందం బులం బ్రార్థించి రామా! 'జడ్డిగములోనే మిడుతపో ట'న్నట్లు నన్నుం బరిహాసపాత్రునిం జేసి యుద్యోగారంభదశలోనే యిట్టి యిక్కట్టుం బెట్టితివా" యని నిమీలిత నేత్రుండై యుండ నా భక్తరక్షణపరాయణుండు నారాయణుండు ఘోర వ్యాఘ్రాకారంబున నేతెంచి యా ముష్కరతురుష్కుల దఱిమి కొందఱ వధించి యొకచోం గూర్చుండెను. అప్పుడు రామ దాసా శార్దూలమ్మును జూచి భయమ్ము నొందక యిది రామా నుగ్రహమ్ముకాక మఱేమని భజనసేయుచు దాని కభి ముఖుండై—

## గేయము

అడుగు దాటి కదలనియ్యను నా కభయ మీయక నిన్ను విడువను

అని వెన్నంట నది యటునిటు చనుచుండ నెదురుగాం జని—

"గడియగడియకుం దిరిగితిరిగి యడిగితిని వేసరక వచ్చెను

గడువు దప్పిన నేను నిఁక గడు దుడుకుతనములు నేయుదు నిను"- అడుగు॥

అనుచుండ నది తోఁక ముడుచుకొని కూర్చుండె నప్పుడు—

"కుదురుగఁ గూర్చుండనియ్యను నీకు గోపము వచ్చిన భయపడను
ఇది మదిని నెఱిఁగియు నింక నీ మొఁగమోటు మేమియు లేదు దగ నా
హృదయకమలమునందు నీ మృదుపదములను బంధించి వేయుదు—అడుగు॥

అది యూవులించుచు నటునిటు చూచుచుండ—

'తేపతేపకు నీదు మోమిటు చూపకుండిన నోర్వఁజాలి॥ —అడుగు॥

అని నృత్యముచేయుచుండ మఱి రెండు పులులు మెల్లగా రాఁగా

'నీహితవుజనములు వచ్చి నన్ను-వేఁడుకొనినను విడువ నిన్ను"
—అడుగుదాటికదలనీయ॥

ఓయీ! నీవు వ్యాఘ్రరూపమునవచ్చిన రాముఁడవు. నే నెఱిఁగితి ననుచున్నాఁడు

"రాక్షసాంతక సీతారమణ- సారసాక్ష సద్గుణ భక్తాభరణా
ఈ క్షణంబున దీనజనుఁడని మోక్షమియ్యక యుంటివైనను
సాక్షిపెట్టి నేఁడు వేరొక దీక్షచే సాధింతు నిన్ను
—అడుగుదాటి॥

అని యదరుబెదరులేక కీర్తింప నా వ్యాఘ్రము చూచి చూచి పిదప నల్లనం జని యగోచరంబయ్యె.

ఈప్రయత్నము నిష్ఫలమగుటవలనఁ బాషపెద్దపులి యెటనుండి వచ్చెనో యని నిట్టూర్పువుచ్చి కానిమ్మతఁ డుద్యోగముం దక్కించుకొన్నం జూతములెమ్మని తలయూఁపి కొందఱ గూఢచారులంబిలిచి "రామదాసునందు తప్పులు వెదకుచు నతని యాజ్ఞ తాలూకాలోఁ జెల్లకుండునట్లు రైతుల

కుద్బోధించి సిస్తు వసూలుగాకుండునట్లు చేయుఁడని పంపెను. ఆ చారులును భద్రాద్రికివచ్చి మారువేసములతోఁ జరించుచు రామదాసు రామాలయము నిర్మింపించుసమయమున హితుల వలె వచ్చి ఖజానాలోని సొమ్మును ప్రస్తుతము వ్యయముచేసి పర్యాయమునఁ జందాలమూలకముగా మఱల బొక్కసము నింపవచ్చునని గఱపి యట్లుచేయించి యీసమాచారమును వెంటనే సితారా కెఱింగించిరి

'పిట్ట చిక్కెనని సితారా సంతసించి యీ వేగులవాండ్రకుఁ బారితోషికములఁ బంపి' యిబ్రహీమును రప్పించి దాసు సిస్తును వ్యయము చేయుచున్నాఁడు. నవాబుగారు మఱల మీవలన వసూలుచేయుంపుమా యని రైతుల భయపెట్టి సిస్తు వసూలు గాకుండునట్లు గ్రామములలోఁ బ్రచారము సాగించి నవాబు గారిని రామదాసు ధిక్కరించు చున్నాఁడని మహాజరుల నంపు నట్లు చేయవలసినదని చెప్పిపంపి యతండు పోవుచుండ మఱలం బిలిచి ఓయీ! ఉక్కు తునియలవంటి మొఱకులంబంపి భద్రాద్రి ఖజానాను గొల్లగొట్టించుము. మఱవకుము. ఈ హిందువులకు సింహస్వప్నముల మయ్యెదముగాక యనిచెప్పి సెలవిచ్చి పంపెను

అంత నొకనాఁడు మాదన్నగారు లెక్కలు తనిఖీచేసి భద్రాద్రి పైకము రాలేదని యెఱింగి వెంటనే విశ్వాసపాత్రులగు గూఢ చారులం జీరి "నవాబుగారు భద్రాద్రితాలూకా పైకము రాలేదని కోపించుచున్నారు. కాన నీవు వెంటనే సొమ్ము వసూలు

చేసి పంపవలయును. లేకున్నఁ గీడుమూడును. నీ యభ్యుదయ మునకు భంగముగల్గింపం గొందఱు గోముఖ వ్యాఘ్రము లున్నారని యెఱింగి జాగరూకుఁడవై కనుగలిగి మెలగవల యునుసుమా! అని గోపన్నకుఁ జెప్పఁబంపినాఁడు. తా నా మాటల గూఢచారులవలన విని కానిమ్ము "భవితవ్యతాబల వతీ" కాఁగలది కాకపోదు. అంతకు శ్రీరామచంద్రమూర్తియే కలండని యా చారుల నంపివేసి రామదాసు కంకణము గట్టుకొని శ్రీరామ కల్యాణ మహోత్సవాలోకనానందసముద్రమున మునిఁగియుండ నానాటి నడిరేయి యిబ్రహీమ్ పంపిన దొంగల గుంపులు ఖజానాతలుపులు బ్రద్దలుగొట్టి లక్షయేఁబదివేల సైకమును హరించిరి. తెల్లవాఱినది. ఎల్లవారి మోములతోఁ బాటు దాసు మోమును దెల్లవాఱినది నేను రామునింటిలో దొంగలదోఁపు చేయించెదనని రాముఁడే ముందుగా నా యిం టిలో దొంగలదోఁపు చేయించినాఁడు కావలయు. కాని మ్మింతకు నతండే యున్నాఁడని తలంచి దాసు నిశ్చింతుఁడై యున్నాఁడు.

మఱునాఁడే రామదాసు తమ ధనమును వ్యయముచేసి దేవా లయముం గట్టించినాఁడు. మేము సిస్తు నిచ్చుటకే భయపడు చున్నాము. తమ యానతిం ద్రోసిపుచ్చు రామదాసువలన మీ రాజ్యమునకు మీకు నపాయము రాఁగలదు. మీరు వెంటనే విచారించిన సర్వముం దెలియఁగలదు. అను నర్థము గల మహాజరులు కొన్ని గ్రామములనుండి తానీషాకు వచ్చి చేర నతండు పఠికించి నా ధనము ధర్మకార్యముల కేగదా విని

యోగపడినది. ఇఁకఁ గావలసిన దేమున్నది? ఈ వ్రాఁతంబట్టి దాసుని విరోధులు వ్రాసినట్లు కన్పట్టుచున్నది. అని యక్కాగితముల గీటునవుచ్చె. అయ్యది సితారా యెఱింగి నవాబు తనతో సరస సల్లాపములాడుచుఁ దన్మయుఁడై యున్నసమయమున నదివఱక కట్టడచేసియుంటచే నొక పరిచారిక యొక మహాజర్ అర్జీని తెచ్చి యిచ్చి పోయెను.

ఆమె యెఱుఁగనట్లు దాని నందికొని చదివి, "వింటిరే! ప్రభువులవారు మా మాటలను వినరుగాని యీ హైందవుని సాహసము నిఁకనైన విచారించి తెలిసికొనుఁడు. ఇట్లైన మీరేమి రాజ్యమేలఁగలరు? అబ్బబ్బా! యెంతధనము పరమతమునకుఁ బ్రభువులవారి యాజ్ఞలేనిదే వ్యయపఱుపఁబడినది. ఇట్లైనఁ దమయానతి యెట్లు చెల్లఁగలదు. తహసీల్దారులు సిస్తు నపహరింపరా? సామంతరాజులు స్వతంత్రులై పోరా? అయ్యో! ఇట్టి గొప్ప విషయము మీకుఁ జీమకుట్టినంత మాత్రముగూడఁ గాకుండె. మాదన్నగారి మాటయే మీకు మహా మంత్రము. వారు తన జాతివాఁడు గనుక గోపన్నకు నౌకరి నిప్పించి నే నున్నాఁడను. ఫరవాలేదు. సొమ్ము నీ యిచ్చవచ్చిన మచ్చున వెచ్చించుకొమ్మన్నారు. మహాప్రభూ! నేను జెవి నిల్లుగట్టుకొని చెప్పుచున్నను మీరు వినుటలేదు. ఈ కాగితముం జూచియైన నామాట వినుఁడు. నాకు భయమెత్తుచున్నది. మాతండ్రిదగ్గఱ మీర్జుమ్లా చేరినట్లు మీదగ్గఱ మాదన్న చేరినాఁడు. మా ముత్తాతయగు నిబ్రాహిం కుతుబ్‌షాహా దగ్గఱ జగదేవరావు చేరినట్లు మీ

దగ్గఱ మాదన్న చేరినాఁడు. హిందువుల నమ్మరాదు. వారు గోముఖవ్యాఘ్రములు. విజయనగర వినాశనము చూచి దెబ్బకు దెబ్బ కొట్టవలయునని వారు చూచుచున్నారు. మహమ్మదీయుల దౌర్జన్యమును పెఱవారు సహింతురే. వారికి మాత్రము స్వజాతీయాభిమాన ముండదే. పయోముఖ విషకుంభములవలె వారు మన రాజ్యమున నిండినారు. తేనెపూసిన కత్తులవలె వారు మనకొలువు చేయుచున్నారు. ఎందఱ నాలోచింపకయే యొక్కఁడు పాటుఁ డిట్టి సాహసముఁ జేయఁ గలఁడా? ఒఁడా రెండా! నూఱా, వేయా, పదివేలా? అబ్బా! ఆఱులక్షలే! ఆహాహా! ఆ సంఖ్యఁ దలఁచుకొన్న నా గుండెలు క్రుళ్ళుచున్నవి. ఇందు మాదన్నకు మాత్రము పాలు లేకుండునా?

అల్లా! నాతండ్రిరాజ్యము నా కనుల యెదుటనే యిట్లు విచ్ఛిన్నమై పోవునా? అక్కటా! నా మనస్సు చెయివెట్టి కలఁచిన ట్లున్నది. నాదేహము అంపములఁ బెట్టి కోయుచున్న ట్లున్నది. నేనీ పరితాపమును భరింపలేను.

అయ్యో—అయ్యో? మీరు వట్టి అమాయకులు. తెల్లని వన్ని పాలు, నల్లనివన్ని నీళ్లు నని తలంచెదరు. కుడుము చేతి కిచ్చినఁ బండుగని భావించెదరు. ఆ మాదన్న మాయమాటలకు మనసిచ్చెదరు. రాఁబోవు ముప్పు నెఱుంగలేరు. సర్వసమత్వము— సర్వసమత్వమని కలవరించెదరు. ఎవరీ పిఱికిమందు మీకుఁ బోసినది. మనమతము కత్తిచేఁగదా స్థాపింపఁబడినది.

మనకు హిందువులకుఁ బోలిక యెక్కడిది? పొత్తెక్కడిది? ఏమండీ—వినుఁడు.

అవకాశము దొరకినంత జాలు నిదియంతయు హిందూ రాజ్యమగును. అగుటకుఁ బ్రయత్నములును జరుగుచున్నవి. అకటా! ఒక్క తహశీల్‌దారుని మీరు రక్షింపలేకున్న—నా దొక్క హిందువునుగూడ మీయాజ్ఞలో మెలఁపకున్న—ఇఁక మాటలెందుకులే. ప్రభూ! నా కంటె హితము గోరువారు మీకుఁ గలరా? మీ క్షేమముగోరి చెప్పుచున్నదానను. వినుఁడు. నా నిశ్చితాభిప్రాయము వినుఁడు. ఏమైనఁగానిమ్ము ఆ కాఫరును మీరు వెంటనే పట్టి తెప్పించి తల నఱికింపవలయును. ఒక్క హిందువును మీ రీపనిచేసిన నిక నెవ్వఁడును రాజద్రోహమునకుఁ బాల్పడఁడు. నమ్ముఁడని సివమెత్తి పలుకుచున్న యాగయ్యాళినిఁజూచి. తానీషా నవ్వుచు ప్యారీ! బేగం! నీ స్వమతాభిమానమునకు సంతసము, పరనిందకు దుఃఖము కలుగుచున్నది. హిందువుల నేల సంశయించెదవు. ఏటికి దూషించెదవు. అన్నిమతములవారిలోను శిష్టులు దుష్టులు నుందురు. మన మతస్థుఁడైనను నౌరంగజేబు మీ తండ్రి నబ్దుల్లా హుసేన్ కుతుబ్‌షాహాగారిని షియాపంథ మవలంబించెనని యెన్ని విధములఁ బీడింపలేదు మీర్‌జుమ్లా సంగతి నీవే చెప్పితివి. అది యట్లుండె. మీ తాతగారు మహమ్మద్ కులీకుతుబ్‌షాహాగారు ప్రతివత్సరము 60 వేల హోనుల హైందవుఁడని, మహమ్మదీయుఁడని తలంపక పేదతనము మాత్రము చూచి పంచిపెట్టెడివారే. వారు లోకోపకార

ములకై 78 లక్షల హోనుల వెచ్చించిరే. వారి యల్లుఁడనైన నేనేమి వెచ్చించితిని. మఱియు వారా ధనము నొక్క స్వజాతికి మాత్రమే కాదుకదా వినియోగించినది.

మీ తాతతండ్రిగా రగు "ఇబ్రహీం కుతుబ్ షాహా" గారిని హైందవుఁ డగురామరాయలు పుత్రకల్పునిగాఁ బోషింపలేదా? ఆ యిబ్రహీంగారు మురారిరావును ముఖ్యమంత్రిగాఁ జేసికొనలేదా? ఆ మంత్రి దక్షిణ దేశములోని హైందవ దేవాలయముల దోచుకొని వచ్చినందులకుఁ గదా నవాబుగారు మిక్కిలి చింతించి కృశించి యా వగపుతోడనే మరణించిరి. ఆయన స్వపరజాతిభేదము కలిగియుండెనా? ఆయన కొందఱు తెలుఁగు కవులు మిత్రులుగా నుండిరో యెఱుఁగుదువా? ఆయన తెలుఁగు నెంత యాదరించెనో తెలిసికొంటివా? అద్దంకి గంగాధర కవిచేఁ 'దపతీసంవరణ' మను కావ్యమును కూడఁ గృతి నందిన యా నవాబుగారి గుణగణము నేమని కొండాడఁ గలము.

ప్యారీ! జాతి ద్వేషము కూడదు. తప్పు చేసినచో నే మత స్థుఁడేని దండ్యుఁడే మాదనామాత్యశేఖరుని నీ వనుమానింపకుము. ఆయన తెలివితేటల వలననే మన రాజ్యము నిలిచియున్న దని గ్రహింపుము. లేనిచో నెప్పుడో మహారాష్ట్ర వీరులచేఁ బడియుండెడిదే. లేదా ఔరంగజేబు కాఁ జేసెడి వాఁడే.

బేగం! నీవు చెప్పు. ఔరంగజేబు సైన్యములు మన గోల
కొండను ముట్టడించినపు డెన్నిసారు లక్కన్న మాదన్నలు
వానిం బాఱఁదోలి యుండలేదు. స్వజాతి వాఁడైన యిబ్ర
హీమును నమ్మికొని యున్నచో నిప్పటి కెక్కడ నుండెడి
వారమో? నెమ్మదిగా నాలోచించుకొనుము. మాదన్న
గారి బుద్ధికుశలత వలనఁ జుమీ ఫ్రెంచి, యింగ్లీషువారు మన
యాజ్ఞలకు వేచియున్నది. అక్కన్న మాదన్నగార్ల విష
యమై నీ వొక్క దోసమైనఁ జూపఁ గలవా? హైందవుఁడని
గోపన్న నేరము నణఁచియుంచె ననవత్తువేమో? నిన్ననే
లెక్కలు పరీక్షించి భద్రాచలము తాలూకా పైకము మాత్రము
రాలేదనియు హుకుము పంపితి మనియు మాదన్నగారు
నీకంటె ముందే చెప్పియుండిరి. అసలు వారు బయటఁ బెట్టిన
గదా నీకును దెలిసినది. లేకున్న మన మెట్లు తెలిసికొనఁ
గలము. అనుచుండ సితారా చివాలున లేచి మీ రాజ్య
వ్యవహారముల జోలి నా కేల? అదియునుఁగాక ఆడదాని
కేమి తెలియును. మీ యిష్టము వచ్చినట్లు చేసికొనుఁడు.
నాకు శిరోవేదనగా నున్నది అని విలాసముగాఁ జేతులు
త్రిప్పుచు మోము నోరగా వంచి యొక క్రేగంటి చూపు
విభునిపైఁ బాఱవైచి దూరముగాఁ బోవుచుండగాఁ నాయొయ్యా
రమునకు నా నడకల తీరునకు నా చుఱుకుఁ జూపుల యేపు
నకు నోపలేక మదనోద్రేకము తలకెక్కి యున్న తానీషా
వెంటనే లేచి యొడిసి పైఁటచెఱఁగు లంకించికొని యంతలోఁ
గదిసి బాహుపంజరమున గాఢముగా బంధించుకొని పర్యంకము

నకుఁ దెచ్చి యంకతలంబునఁ జేర్చికొని చుబుక మెత్తి మొగము మొగమున కానించి ప్యారీ బేగం! చూడు. ఇటు చూడు. నావలన దప్పున్న క్షమింపుము. వానిని జేప పట్టి తెప్పించెద. నేను మాత్ర మత్యాచారమును సహింతునా? ఉన్న విషయముం జెప్పితిఁ గాని నీవు చెప్పినదానిం జేయ నంటినా? ఏల యింతలో నింత కోపము? అని బుజ్జగించుచు నుండెను.

అంత నా రేయి యమ్మోహనాంగి నిదురించినదో? లేదో? భళ్లున తెల్లవారినది. నిండుపేరోలగంబున కేతెంచిన తానిషా గారితోఁ బ్రభుభక్తి పరాయణుండగు మాదన్న భద్రాద్రి తాలూకా పైకమురాలేదు. నిన్నటితో సాలాఖరైనది. ఏమి యాజ్ఞ? యని విన్నవింపఁ నతండు కనులెఱ్ఱచేసి తత్ క్షణమ తహసీల్దారును బట్టి తెప్పింపుమని హుకుం పంపించినాఁడు.

అక్కడ రామదాసుగా రనుష్ఠానముం దీర్చుకొని కచేరీ చావడిలోనికి వచ్చి 'స వత్సరము ముగియులోపల నవాబుగారి పైకముం జెల్లింపవలయుఁగదా. నేను ఖర్చుపెట్టినదానిని భక్తి చేయుటకుఁ బూనుకొన్న నదియేమిచిత్రమో? ఇంతవఱ కిచ్చినట్లిప్పుడు చందాల ధనికు లొసంగుట లేదు. ఇంకఁ దాలూకాలో వసూలు కావలసిన సిస్తు రెండులక్షల యేఁబదివేలు. దొంగలు దోఁచుకొనిపోయినది లక్ష యేఁబదివేలు- మిగిలిన రెండు లక్షలు నాక్రిందఁబడెంగావలయును. అయ్యో! రామా! యీ యాఱులక్షల పైకము నేఁడెట్లు చెల్లింతు—

గేయము.

నీ సంకల్పం బెటువంటిదో కన నెంతవాఁడ రామా
వాసితొలఁగి నీదాసజనులు భువి గాసివడిన యా ఘన మెవ్వరిదో॥నీసం॥
పాలించినమతి విడఁజూచిన నీకృపఁ గాచియుండుగా నీ
తోఁచితోఁచకను దొడరి కరంబులుచాచి పరుల నే యాచనచేయను॥
—నీసం॥

అని కీర్తించుచుండ యమకింకరులవలె నిష్కరుణులైన కఱకు తురక జవానులువచ్చి హుకుము చూపించి యున్నవాని నున్నట్లు పట్టుకొని రమ్మనిరని చేతులకు సంకెలలువైచి విచ్చు కత్తి పహారాలతోఁ దోడ్కొని పోవుచుండిరి. భద్రాద్రిలో నా భక్తునకువచ్చిన యాపద కాబాలగోపాలము నాఁడు కంటఁ దడిపెట్టనివారు లేరని, యొక్కరును బొయిరాఁ జేయలేదని యింకను వ్రాయవలయునా ?

అట్లు తహశీల్దారుగారిని భార్యతో మాటలాడనీక పిల్లవాని నైనఁ జూడనీక యన్నముం దిననీక సంకెలలువైచి పట్టుకొని పోవుచుండఁ బరిపరిగతుల శ్రీరామచంద్రుని జీరుచు దూరుచు, భూషించుచు దూషించుచు భావించుచు సేవించుచు రాజుసేవకుల వెంటఁ బోవుచు—

శా॥ "పోకన్మానదు దేహ మేవిధమునం బోషించి రక్షించినన్
రాకన్మానవు హాని వృద్ధులు మహారణ్యంబులో డాగినన్
గాకన్మానవు పూర్వజన్మకృతముల్ గాఁగల్గు నర్థంబులున్
లేకన్మానవదెంత జాలిపడినన్ లేముల్ సిరుల్ రాఘవా."

అని ధైర్యము వహించుచు గోల్కొండఁ జేరి నవాబును

దర్శించి తల వంచి సలాము చేయఁ దానీషా మండిపడి తహ
శీల్ దారుగారూ! పైక మేది? సాలాఖరైనను పంపలేదేల?
నవాబుగారు చండశాసనులని యెఱుంగవు గాఁబోలు” నని
పలుక, స్వామీ! ఇంక రెండులక్షల యేఁబదివేలు వసూలు
గావలయును. లక్ష యేఁబది వేలు చోరులు హరించిరి—అని
చెప్పుచుండఁ దానీషా రూక్షేక్షణములఁ బఱపుచు భయంకర
ముగా గర్జించి, దొంగా! రామాలయముం గట్టించి బొంకు
చుంటివా? మే మెఱుగ మనుకొంటివా? యన నా
గోపన్న స్వామీ! కల వృత్తాంత మంతయుం జెప్పుచుంటిని.
దేవా! రామాలయమునకు రెండు లక్షలు మాత్రమే—అను
చుండఁ దానీషా హుక్కాను బీల్చి ఓ గడుసు బాపఁడా!
నీవు భక్తుఁడవు మంచివాఁడ వని యుద్యోగ మిచ్చినందులకుఁ
దగినట్లు చేసితివి. మా యుత్తర్వు లేనిదే ఖర్చు పెట్టుటకు
నీకు గుండె యెక్కడిది?” అన నయ్యా! మీ రాజ్యములోనే
శ్రీరామచంద్రులవారి కాలయము గట్టించితి. ఆ ప్రఖ్యాతి
యంతయు మీదే యని బంధితుం డనుచుండ నింక నోరు
మూయుము. మా యానతి లేనిది నీ వట్లు సల్ప వచ్చునా?
మా పైక మాఱు లక్షలు చెల్లింపనిచో మిమ్ము వదలము.
అంతవఱకుం జైలులో నుండుము.” అయ్యా! గడు విచ్చిన
ధనము చెల్లించెద నన ఛీ తులువా! పాఱిపోఁజూచుచుంటివా.
విడువను. విడువను. ధనము చెల్లించిననే విడిచెదను. అంత
వఱకు జైలులో నుండుమని పంపివైచి కొలువు చాలించి నవా
బంతిపురి కరిగెను.

# పఁడవ ప్రకరణము.

శ్లో॥ హరిర్దుఃఖాని భక్తేభ్యో హితబుద్ధ్యా కరోతి వై
శస్త్రక్షారాగ్నికర్మాణి స్వపుత్రాయ యథాపితా॥

భగవంతుఁడు తన భక్తులకు హితబుద్ధితోడనే దుఃఖములను గలిగించుచున్నాఁడు. కుమారుని కారోగ్యభాగ్యము లభించుటకేగదా తండ్రి యతని వ్రణమునకు ఛేదాదు లాచరించి బాధ కల్గించుట. కనుక రామదాసను రత్నమును గష్ట పరంపరలను నికషోపలముల నొఱసిడివెట్టి దుష్కృతమాలిన్యముం బోఁదట్టి దివ్యతేజోవంతునిం జేయుచున్నాఁడు శ్రీరామచంద్రుండు. కష్టములు వచ్చినప్పుడే మానవుని గాఢ భక్తి ప్రభావము ప్రకాశించునది. పుటము వేయుచున్న కొలందిగదా బంగారమునకు వన్నె వచ్చునది.

## రామదాసు కష్టములు.

బలవద్విరోధము దుస్సహము సుఁడీ. అందుం దుష్టులతోడి పగ నేమనవలయు. "అకరుణత్వ మకారణవిగ్రహమ్". రామదాసేమి చేసెనని సితారా కతనిపైఁ గోపము ? రాణి గారి యాజ్ఞయని చెఱలో నున్న దాసునకుఁ బావుసేరు బియ్యముం బావుసే రుప్పుం గలిపి బత్తె మొసంగిరి. దాసిట్లు దుఃఖించుచున్నాఁడు. రామా ! ఈ యన్నము నెట్లారగింతును.

## గేయము.

ఏలాగు తాళుదు నేమిసేతు రామ - ఈబాలిచేతను తాళజాలనురా
దీనజనులకెల్ల దిక్కు నీవె రామ - మనమున నిన్నునే మఱవనో రామా ॥ఏ॥

అని వేఁడికొని బచనంబు సేసికొన దివ్యాన్నంబయ్యెనఁట. దానిని భుజించి రోజులు గడపుచు రామా! నీ నామస్మరణ మున కితర కార్యము లంతరాయము లగుననియా? నన్ని యేకాంత స్థలమునకుం ద్రోఁచితివి. తండ్రీ! నీ లీలల నెవ రెఱుంగఁగలరు. అని రామధ్యాన నిమగ్నుఁడై సంతోషము గానే యుండెను.

"ఇంటికంటె గుడి పదిల' మన్నట్లు గోపన్న సంతోషముగానే కాలము గడపుచున్నాఁడని సితారా విని పండ్లు పటపటకొఱికి యతనిఁ గొరడాలతోఁ గొట్టుఁడని యాజ్ఞాపింప నా భటు లట్లు చేయుచుండ

గేయము.

అబ్బబ్బా దెబ్బలకు తాళలేర రా మప్పా గొబ్బున నన్నాదుకోర

... ... ... ... ... ...

పరులకొక్క రున్న యీ లేదుగదరా ఓ పరమాత్మ! నీపాదములు నమ్మినార కొరడాలు తీసుకకొట్టిరి గదరా హరనుత గోవిందహరి తాళలేర॥ అబ్బబ్బా॥

అని శరీరమును భటులకు నాత్మను హరికి నర్పించియుండ బాపురే రామానుగ్రహమున నా దెబ్బలవలనఁ గందఁడయ్యె బాధ నొందఁడయ్యె.

మఱియుఁ గొంతకాలమునకు రాజ్ఞాజ్ఞచే ముండ్లపైన నడి పించిరి. ఏమికష్టము. దాసునకు రాముఁడున్నాఁడు గదా!

గేయము.

రామా దయఁజూడవే భద్రాచలధామ నను బ్రోవవే

... ... ... ... ...

తాటక సంహారణ మేటి రాక్షసకోటి మదహరణా
నీటుతో నీనామకోటి వ్రాసితి నీకు సాటిలేదని పారెసారెకు వేడితి। రామ

అనిస్తుతింప నాబాధం బొరయండయ్యె. భక్తులమాటలే మహా మంత్రములు.

మఱియొకనాఁ డిట్లే యందఱుఁ బైకము గాఁజేసి మొండిచేయి చూపెదరు. ఇతరులకు భయము గల్గునట్లు శిక్షింప వలయునని సితారా యాజ్ఞాపింప దాసు చేతులకుఁ గిట్టకోలలు వేసి కొట్టిరి.

గేయము.

అబ్బబ్బా దెబ్బలకు నోర్వలేర జబ్బుసేయకరార తబ్బిబ్బాయెరా
అట్టె నిన్ను పూజించినట్టి చేతులనిదిగో గిట్టకట్టికొట్టె రెట్టుతాళుదునయ్యా!
... ... ... ... ... ...

అని వేడుకొనుచుండ ఫెడేల్ ఫెడేల్ మనఁ గొట్టుచుండిరి. కాని యాదెబ్బలు రామదాసు శరీరమున బూడిదెలోఁ బోసిన యాజ్యధారలయ్యె.

అదిచూచి భటులు నివ్వెఱంపడి యీయన పసరుకట్టెఱుంగునా? యేమి? జెయిలులోనికి వచ్చునపుడు దేహమునకుఁ బసరుపూసికొని వచ్చినాఁడు కావలయు నని యమ్మూఢులు శరీరము శోధించి తోమి స్నానముచేయించి కత్తులపై నడిపించిరి. ఐన నేమి తారకమంత్ర బలమ్మున నవి భూమిలోనికిం గ్రుంగిపోయి యించుకంతయుఁ గాయంబున గాయముచేయ వాయె. అదిచూచి రాజసేవకు లిదియేమిచిత్రము. వీనికిం గారడివిద్య వచ్చునాయేమి? అట్లైన నీదెబ్బతో నన్నియుం

దీరునని సితారాకుం జెప్పి పెద్ద యుక్కు గుండును వీపు విఱుగు నట్లు పైఁబెట్టి యూరంతయుఁ ద్రిప్పుచుండిరి. గోవర్ధనోద్ధారుఁ డుండ గోపన్న కేమికొదువ ?—

గేయము

భారము లన్నిటికి నీవె కలవని నిర్భయుఁడనైయున్నారా
దారితప్పక నీవు దరిజేర్చెదవని ధైర్యముతో చిందిరా శ్రీరామ
—భారము॥

... ... ... ... ...

అని వేఁడుచుండ నతనికిం బెండుమోసినట్లుండి వెంటఁ బర్వెత్తుచుండ నా సేవకులు అబ్బా ! యీ బక్క బాపని కెంతబలమున్నదిరా ? మన మైఁదార్గురమే వీనిచెంత నుండుచో నప్పడము ముక్కలవలె మనల విఱిచి పాఱిపోఁగలఁడురా" యని గుస గుస లాడుచు నతనిం జెయిలులోనికిం బంపివైచిరి.

సితారా కేల బుద్ధిలేదో ? మండు వేసవికాలములలోఁ గాలుచున్న యిసుకపైఁ గోపన్నను నిలువం బెట్టుచుండె. 'లక్షభక్ష్యముల భక్షించు లక్ష్మయ్య కొకభక్ష్యము లక్ష్యమా ? " రామా ! శీతోష్ణాదిద్వంద్వములఁ దుల్యముగాఁ జూడవలయునని నేర్పుటకా నాకీశిక్ష నేర్పఱచితివి. అని రామధ్యానము చేయుచుఁ బూఁబాన్పుపైనుండునట్లుండె. ఇతఁ డపర ప్రహ్లాదుఁడా ? యేమి ?

చం॥ పలువురు దానవుల్ పొడువ బాలుని దేహము లేశమాత్రమున్
నొలియదు లోపల న్రుధిరముబ్బదు కందదు శల్యసంఘము

వ్రాలియదు దృష్టి వైభవము నష్టము గాదు ముఖంబు కాంతియుం
బోలియదు నూతన శ్రమము పుట్టదు పుట్టదు దీనభావమున్.

—భాగవతము

సముద్రములోఁ బడినాఁడు. అదృష్టవశమునఁ గలము చిక్కినది. ఇంక నుల్లోలాభీలకల్లోలమాలాసంఘట్టనము లెన్ని కల్గిన నేమిభయ మున్నది? జ్ఞాని యని తన నౌక దరి వట్టింప వచ్చె ననియు, నజ్ఞాని తనను ముంచవచ్చె ననియు మాత్రము భేదముగాఁ దలంతురు. రామదాసునకుఁ దారకము లభించినది. దాని ప్రభావముఁ బ్రత్యక్షముగా ననుభవించినాఁడు. కనుక—

గేయము

శ్రీరామ నీ నామ మేమి రుచిరా? ఓ రామ నీ నామ మెంత రుచిరా

... ... ... ... ...

కదళీఖర్జూరాది ఫలముల కన్నను పతితపావననామ మేమి రుచిరా॥ శ్రీరామ

... ... ... ... ...

పనస జంబూ ద్రాక్ష ఫలరసములకంటె నధికమౌ నీ నామ మేమి రుచిరా—
—శ్రీరామ

శరణన్న జనుల సరగున రక్షించు బిరుదు గల్గిన నామ మేమి రుచిరా॥ శ్రీరామ

ఈరుచి నిట్టిదని పల్కఁ దరమా? నాయనలారా! ఈ రుచి మధురుచులలోనిది కాదు. ఇది యుపమాతీతము. ఇది యనుభవైకగోచరము సుఁడీ. "పంచదారకన్న పానకంబునకన్న మావిపండుకన్న మాధ్వీకన్న" మిన్నయైన దనుట కానిమాట. సదృశపదార్థము లేనిది పోలిక యెట్లు? అమృతమందు లేమో? అమృత పానరతులకును బునర్జన్మము గలదు కాని

యీ నామామృత పానరతులకు లేదు. కాన నమృతమును దీనికి సాటిగాదు. "ఏమి రుచిరా?" అనుటవలననే నేటికి గోపన్న తద్రసాస్వాదనానంద నిమగ్నుఁడై నాఁడని తేలుచున్నది. కనుకనే అన్ని యిక్కట్టులకుం దాళ గలుగుట. భళిభళీ రామదాసా ! నీవ ధన్యుఁడవు ధన్యుఁడవు.

అట్లు పరవశుండైన దాసుం గాఁపరులు వేరువం జూచి నిర్జీవుండ కాఁదలంచి బిగ్గరగాఁ బిలువఁ గొంతవడికి లేచె. అమ్మూర్ఖులు గాఢ సుషుప్తి యనుకొనిరి.

పిమ్మట నమ్మహాభక్తుండు నీరమునకై కూపమ్మున కరుగుచో మధ్యమార్గమ్మున వృశ్చికదష్టుం డయ్యెను. ఉన్నదిగదా రామ మంత్రము.

గేయము

"మేలైన చిటికెన వ్రేలు - ప్రాతఃకాలమందునఁ గుట్టె తేలు."

రామ రక్షింపుము. అని మొఱవెట్ట నాబాధ పోయెను.

అది కని భటు లాశ్చర్యచిత్తులై "ఏమయ్యా! నీ యొద్ద మందులు మ్రాఁకులు మంత్రములేమైన నున్నవా? ఎన్ని బాధలకు నోర్చుకొనియెదవు" అన గోపన్న యిట్లనియె. నేను మందుల మ్రాఁకుల నెఱుంగ.

గేయము

రామునివారల మైనాము - ఇతరాదుల గణనసేయము
ఆమహా మహుఁడు సహాయుఁడై విభవముగా మమ్ముఁజేపట్టి గారవించును—
సదా॥రా॥

... ... ... ... ... ...

గ్రహగతులకు వెఱవంబోము - మాకుఁ గలదు దైవానుగ్రహము
ఇహపరములకు మాకిఁక నెవ్వరడ్డము - మహి రామబ్రహ్మ మంత్రము—
బూనియున్నాము ॥రా॥

... ... ... ... ... ...

అని నిర్భయముగాఁ బలికినాఁడు. నాటినుండియు సితారా మెదుటనున్నఁ దప్ప నామె యానతిం బూని దాసును బాధింప మానిరి. ఇతఁడు తిట్టినఁజాలు పిల్లా మేకా మనము చచ్చిపోయెదమని భయం పడిరి. ఇట్లు దాసు చెఱలో గడియలా? రోజులా? నెలలా? యేండ్లు గడపుచుండెను. ధనముం జెల్లించిననే వదలుట. ఎవరు చెల్లించెదరు. ఈనేరముసఁ దానుం గలఁడని ప్రజలు నవాబు ననుకొందురని తలంచి మాదన్నగారు చెఱ విడిపింపఁ గలిగియుండియు నూరకుండెను. తదితర బంధువు లాఱులక్షలఁ దెచ్చి కట్టువా రెవరున్నారు? అందువలనఁ జెఱలో మితరహితమైన కాలముం గడపవలసి వచ్చి యెల్లప్పుడు రాముని గీర్తించుచు;

గేయము

సీతారామస్వామీ నేఁ జేసిన నేరంబేమి?
ప్రేమతో నవరత్నంబులు దాపిన హేమకిరీటం బడిగితినా?
కోమలమగు నీ మెడలో పుష్పపు దామములిమ్మని యడిగితినా?
మోమోటం బిడకుండఁగ నీవగు మురుగులు గొలుసులు నడిగితినా?
కమలేక్షణమిము సేవించుటకై ఘనముగ రమ్మని పిలిచితిఁగాని॥ సీతారామ॥

ఇట్లు గోపన్న యెడంద నిష్కామ భక్తి లహరితోఁ ణకిసను

గేయము

“ పంద్రెండేండ్లాయెను శ్రీరాములు బందిఖానాలోనే యుండినాను
శ్రీరాములు
అర్థము తెమ్మనుచు నన్ను శ్రీరాములు-ఇప్పు-డరికట్టఁ దలఁచుచున్నారు
శ్రీరాములు

ఏమిటికి దయరాదు. అని పెక్కుడుములఁ బొందుచుఁ బంద్రెండేండ్లు రాముని ధ్యానించి చివఱకు విసివి, ఇఁక ధనముఁ గట్టనిది వదలఁడని తలఁచి శరీరముపై నాశవిడువక

‘సర్కారు పైకము తృణముగ నెంచుమీ రామచంద్రా ? యీ
చెప్పరమునఁ గాచి యప్పుదీర్చుమయ్య రామచంద్రా.’

అని వావిచ్చి కోరినాఁడు. చూచితిరా ! అస్తినాస్తి విచికిత్సాగ్రస్తచిత్తులారా ! రాముని ధనముం దెచ్చి కట్టుమని భక్తుఁడాజ్ఞాపించుచున్నాఁడు' ఎంత విశ్వాసమో ? ఎంత దృఢభావమో ? ఎంత నిశ్చలభక్తియో ? రామదాసునకు.
అట్టి భక్త్యుద్రేకమునఁ గీర్తించిన కీర్తనలు రసపుష్టిగా నుండెనని వ్రాయు టనవసరము. ఎట్టి ఱాతిగుండె వానినైన నవి గఱగింపఁ జాలును. మఱి రామునికేల దయరాలేదో ? అందువలన నిఁక నమ్మతోఁ జెప్పిచూతమను కొన్నాఁడు. మఱఁ దింపుడు కళ్లమాస జనించి పౌరుషము పుట్టించియైనఁ జూతమని——

గేయము

రామ నీచే నేమి కాదుగా సీతా భామకైనఁ జెప్పరాదుగా
శరచాపముల శక్తి దప్పెనా ? నీ శౌర్యము జలధిలోఁ జొచ్చెనా ?

కరుణామాలి పైకము దెమ్మని భక్తవరుల బాధింప నీధైర్యమెక్కడఁబోయె॥
— రామ॥

అని తర్జించుటకు భక్తునకుమాత్రమే చనవుగలదు. చేసికొన్న భార్యకును లేదు. ఇప్పటికిని రామునికిం బౌరుషము కల్గలేదు. ఇఁక లాభము లేదనుకొన్నాఁడు. తండ్రికోపముం దల్లిగాని తొలఁగింపలేదని యెంచి.

గేయము

'నను బ్రోవమని చెప్పవే - సీతమ్మతల్లి - నను బ్రోవమని చెప్పవే'

అని తగినకాలముంగూడ నిర్దేశించి ప్రార్థించినాఁడు.

" అధిక రోషకషాయిత స్వాంతుఁడైన
నరపతికి విన్నవింపను నాయవస్థఁ
బైత్యదోషోదయంబునఁ బరుసనైన
జిహ్వకుఁ బంచదారయుఁ జేదుగాదె?"

అనెఁగదా దమయంతి. మఱియు "పన్నెండేండ్లనుండి పగలు రేయి నాపన్నుఁడనై మిమ్ముల ఓజననీ - ఎన్నెన్నో విధముల సన్నుతించినఁగాని కన్నులఁజూడఁడాయె - ఓజననీ" అని పాడీలు చెప్పినాఁడు ... ... కన్నతండ్రులింత కరుణామాలి భువిని ఉన్నవారలు గలరా ? ఓ జననీజనకతనయ......" అని వాపోయినాఁడు.

# ఎనిమిదవ ప్రకరణము

'బుద్ధిః కర్మానుసారిణీ' కర్మము ననుసరించియే బుద్ధియుఁ బ్రవర్తించుచుండును. కర్మక్షయమగుటతోడనే దాసుండు సీతమ్మను 'సిఫారసు' చేయుమని కోరినాఁడు. ఆమె మాట దక్కించుకొన్నది. నిజమునకుఁ దల్లుల హృదయములు నవనీత కోమలములు-కరుణారసాప్లుతములు—

మ. అల వైకుంఠపురంబులో నగరిలో నామూలసౌధంబుదా
పలమందార వనాంతరామృతసరః ప్రాంతేందు కాంతోపలో
త్పల పర్యంకరమా వినోదియగు నాపన్నప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము పాహిపాహి యనఁ గుయ్యాలించి సంరంభియై

—భాగవత.

నాఁడు పర్వెత్తినాఁడు. నేడు రామదాసు మొఱ చెవినపడుట తోడనే సీతమ్మతల్లి మగనియొద్దకు గబగబ పర్వెత్తినది. అంజలి పట్టి మనవిని వినుమన్నది. బిడ్డబాధ కెంత పరితపించినదో ఆతల్లి—

గేయము

దాసపోషణ బిరుదాంక సజ్జనులను గాసి నొందజేతురా
ఏసీమనైన దినేశవంశజులిట్లు మోసముచేయుదురా
కరిమొఱ లిడనాఁడు దురుసునఁ జేగి మకరిఁ ద్రుంచి కరిఁగావవా?
పరమపావనరామ చెఱసాలనున్న భూసురు నేల రక్షింపవో?
అతిపాపియైన యజామిళు నేలితి వతఁడేమి నీచుట్టమా?

అని చెప్పినది. మఱియు వినయము, చనవు, నుట్టిపడఁ గావుమని చెప్పినది.